అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 09-10-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 231 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

10 న ట్యాంక్ బండ్ వద్ద ఘనంగా సద్దుల బతుకమ్మ

- పది వేల మంది హాజరవుతారని అంచనా : సీఎస్ శాంతి కుమారి



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై దాదాపు పదివేల మంది మహిళలతో ఈ నెల 10న సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఈ వేడుకల ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షాసమావేశం నిర్వహించారు. వివిధ శాఖల కార్యదర్శులు, పోలీసు అధికారులు హాజరైన ఈ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ 10న గురువారం సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్‌పైకి చేరుకుంటారని తెలిపారు.

వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్కుల వద్ద నుంచి ప్రత్యేక లేజర్ షోల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పండుగ శోభ వచ్చేలా నగరంలోని 150 ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడంతో పాటు పలు కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించనునట్టు తెలిపారు. ఈ విషయంపై సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుంచి పెద్దఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్‌లోని బతుకమ్మ ఘాట్‌తో పాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సాయంత్రం 5:30 గంటల నుంచి 7:30 గంటల మధ్య ట్యాంకు బండ్‌పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్ చేసేలా బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని కోరారు.

ప్రతీ శాఖ ఒక సీనియర్ అధికారిని ప్రత్యేకంగా నియమించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సీఎస్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు వాణి ప్రసాద్, దాన కిషోర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సి.వీ ఆనంద్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాధారణ గురుకులాల్లో చదివిన 32 మందికి ఎంబీబీఎస్ సీట్లు

- ఆ సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ (సాధారణ)లో ఇంటర్మీడియెట్ అభ్యసించిన 32 మంది విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు లభించాయి. ఈ మేరకు తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో చదివిన విద్యార్థులు నీట్‌లో ఉత్తీర్ణులై 32 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించారని తెలిపారు. హసన్‌పర్తి, హన్మకొండ నుంచి పది మంది, సిద్దిపేట నుంచి ముగ్గురు, వంగర నుంచి ముగ్గురు, పెద్దాపూర్ క్యాప్ నుంచి ఒకరు, నేరెళ్ల నుంచి ఒకరు, పోచంపాడు నుంచి ఒకరు, వికారాబాద్ నుంచి ఇద్దరు, బోధన్ నుంచి ఒకరు, వేలేరు నుంచి ఇద్దరు, నెక్కొండ నుంచి ముగ్గురు, తూప్రాన్ నుంచి ఒకరు, బోరబండ నుంచి ఒకరు, సర్వేలు నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 32 మంది వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు పొందారని వివరించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి విద్యార్థులను అభినందించారని తెలిపారు.

ఐకేపీ వీఓఏల పెండింగ్ వేతనాలివ్వాలి

- సెర్ప్‌సీఈఓ దివ్యకు సీఐటీయూ వినతి
- పండుగలోపే ఇస్తామని హామీ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వీఓఏలకు పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఐకేపీ వీఓఏల సంఘం(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో సెర్ప్ సీఈఓ దివ్యకు వారు వినతిపత్రం అందజేశారు. దసరా పండుగ లోపే వీఓఏలకు పెండింగ్ వేతనాలను క్లియర్ చేస్తామని సీఈఓ హామీనిచ్చారు. ఐకేపీ వీఓఏలకు నెలల తరబడి వేతనాలివ్వని విషయాన్ని ఆమె దృష్టికి వారు తీసుకెళ్లారు. గ్రామసంఘం పుస్తక నిర్వహణ కోసం వీఓఏలను ఎంపిక చేశారని తెలిపారు. ఇప్పుడు వారితో ఎస్‌హెచ్‌జీ/విఓ అంకౌంటింగ్, ఎస్ఆర్ఎల్ఎం యాప్, లక్‌పతి దీదీ లోకోస్ యాప్‌లతో ఆన్‌లైన్ పనులు చేయించడం అన్యాయమని పేర్కొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఐకేపీ వీఓఏలకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని విన్నవించారు. వీఓఏలకు ప్రతినెలా రెగ్యులర్‌గా వేతనాలు వ్యక్తిగత ఖాతాల ద్వారా ఇవ్వాలనీ, విఓఏల వేతనాలు గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా చెల్లించాలని, స్త్రీనిధి ఇన్‌సెంటివ్ పెంచి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.

వరంగల్ తహసీల్దార్‌పై దాడి

- బతుకమ్మ ఏర్పాట్లకు వెళ్లగా ఘటన
- ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ–వరంగల్

వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధి 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో బతుకమ్మ ఏర్పాట్లు చేసేందుకు వెళ్లిన తహసీల్దార్‌పై మంగళవారం దాడి జరిగింది. ఈ మేరకు ఎనుమాముల పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. బతుకమ్మ పండుగ కోసం కాదు. వాడ్రా పేరుతో ఇక్కడ ఇండ్ల కూల్చివేతకు వచ్చారంటూ స్థానికులను ఉసిగొల్పి తనపై ఓ బీఆర్ఎస్ నాయకుడు దాడి చేశారంటూ తహసీల్దార్ ఇక్బాల్ తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ మండల కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో ఎస్ఆర్‌నగర్‌లో బతుకమ్మ ఆట కోసం స్థలాన్ని పరిశీలించేందుకు సిబ్బందితో కలిసి వెళ్లినట్టు చెప్పారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకుడు తనపై కాలనీవాసులను ఉసిగొల్పి దాడి చేసినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై ఎనుమాముల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ కరువు

- వారిని వంటింటికే పరిమితం చేసే యత్నం
- కొత్తగూడెంలో ఈ నెల 21, 22, 23 తేదీలో ఐద్వా రాష్ట్ర 4వ మహాసభ : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ–కొత్తగూడెం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మహిళలను వంటింటికే పరిమితం చేసేలా ఉన్నాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళలపై అఘాయిత్యాలు చేసిన దుండగులకు అక్కడి పాలకులు అండగా ఉంటున్నారని ఆరోపించారు. కొత్తగూడెంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరుగనున్న ఐద్వా రాష్ట్ర 4వ మహాసభ పోస్టర్‌ను మంగళవారం భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలోని టీఎస్‌యూటీఎఫ్ టీచర్స్ భవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో లక్ష్మి మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో మహిళలపై లైంగికదాడులు, హింస, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. మహిళలపై దాడుల నివారణ, భద్రత కల్పించే విధంగా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల పట్ల వివక్ష పెరిగిందని, ఆర్థిక అసమానత, నిరుద్యోగం పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా ఐద్వా కార్యక్రమాలను రూపొందించి ఉద్యమాలు చేపట్టే విధంగా రాష్ట్ర మహాసభలో తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో కేంద్రం విఫలమైందన్నారు. పౌష్టికాహారమందక అనేక మంది మహిళలు రక్తహీనతతో బాధ పడుతున్నారని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తోందన్నారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు చట్టసభలో 33శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. అన్ని రంగాల్లో మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిందని, ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏదీ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిపై ఉందన్నారు. యువత డ్రగ్స్ బారిన పడుతోందని, డ్రగ్స్ నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వీటన్నిటిపై ఈనెల ఐద్వా రాష్ట్ర మహాసభలో చర్చిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆదరించి ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ, జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మి, ఉపాధ్యక్షులు సందకూరి లక్ష్మి, ఎం.లీలావతి, అన్నవరపు ఇందిర, ఆలేటి సంధ్య, అన్నవరపు పద్మ, నందిపాటి రజిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

కసరత్తులు ముమ్మరం చేసిన ప్రభుత్వం

- మంత్రుల ఆధ్వర్యంలో కీలక చర్చలు
- డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలిప్పించి వారి ద్వారా బస్సులను ఆర్టీసీకి అద్దెకిచ్చేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ వస్తున్న నేపథ్యంలో మహిళా సంఘాలకు ఉపాధి కల్పిస్తూ వారి ద్వారా కొనుగోలు చేసిన బస్సులను హైర్ చేసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని కసరత్తు మొదలుపెట్టింది. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) సమక్షంలో ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల కేటాయింపు విధి విధానాలపై చర్చలు జరిపారు. రవాణా శాఖ స్పెషల్ సెక్రటరి వికాస్ రాజ్, కమిషనర్ ఇలంబర్తి, పీఆర్ఆర్డీ సెక్రటరి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, టీజీ ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. మొదటి విడతలో ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని నిర్ణయించారు. సీఎం సొంత జిల్లా మహబూబ్ నగర్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లా కరీం నగర్‌లను ఎంపిక చేశారు. మొదటి విడతలో 100 నుంచి 150 బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మహిళా సంఘాలు కొనుగోలు చేసే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయం, నిర్వహణ ఖర్చు తదితర అంశాలన్నింటితో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

హర్యానా ప్రజల తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఏడు గ్యారెంటీల కాంగ్రెస్ గారడీని హర్యానా ప్రజలు తిరస్కరించి చెంపపెట్టులాంటి తీర్పునిచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హర్యానా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలు ఆ పార్టీని వెంటాడాయని తెలిపారు. కొందరిని కొంతకాలం నమ్మించ వచ్చేమో కానీ.. అందరినీ ఎల్లకాలం మోసం చేయలేరని తేలిపోయిందనీ, అబద్ధాల పునాదులపై రాజకీయం చేసే కాంగ్రెస్‌కు ఓటర్లు కర్రుకాల్చి వాతపెట్టారని పేర్కొన్నారు. బీజేపీని ఢీకొనే సత్తా ప్రాంతీయ పార్టీలకు తప్ప కాంగ్రెస్‌కు లేదని మరోసారి స్పష్టమైందని తెలిపారు. 2029లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో బలమైన ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ అని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు, తెలంగాణలో ఆరు గ్యారంటీలు అంటూ అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను నిలువునా కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఏడు గ్యారెంటీల పేరుతో హర్యానా ప్రజలను మభ్యపెట్టాలని చూసిన ఆ పార్టీని నమ్మలేదని తెలిపారు. హామీల అమలులో కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తోందని చెప్పడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. అబద్ధపు హామీలతో అధికారం సాధించి ఆ తరువాత ప్రజలను వంచిస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారని తాము మొదటి నుంచి చెబుతూనే ఉన్నామని గుర్తు చేశారు. ఒక్కో రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా ఒక్కో గ్యారెంటీ పెంచుకుంటూ గారడీ చేద్దామని చూసి.. కాంగ్రెస్ బొక్కాబోర్లా పడిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలయ్యాక కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు చిత్తుకాగితంతో సమానంగా మారిపోయిందని మండిపడ్డారు. సోషల్ మీడియా విస్తృతి రోజు రోజుకూ పెరిగిపోతున్న ఈ రోజుల్లో రాష్ట్రాలు వేరైనా ప్రజల నుంచి వాస్తవాలు దాచడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. కాంగ్రెస్‌తో హెూరాహెూరీ ఉన్న రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తోందని, ఆ పార్టీ ఓట మికి రాహుల్ గాంధీ బలహీనమైన నాయ కత్వం కూడా ఓ ప్రధాన కారణమని ధ్వజమె త్తారు. బీజేపీ ని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉన్నదనే విషయం ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను చూస్తే అర్థమై పోతుందన్నారు. మహారాష్ట్ర, జార్కండ్, ఢిల్లీ ఫలితాలు కూడా రెండు జాతీయ పార్టీలకు ఏమాత్రం ఆశాజనకంగా ఉండవని భావిస్తున్నట్టు కేటీఆర్ చెప్పారు. మొత్తంగా ఈ ఫలితాలను చూస్తుంటే 2029లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు సాధారణ మెజార్టీ సాధ్యం కాదన్నది స్పష్టంగా అర్థమవుతోందని వివరించారు. దేశంలో సమాఖ్య స్ఫూర్తిని, సమగ్రతను, సెక్యులరిజాన్ని కాపాడాలని కోరుకునే మేధావులు, ప్రజలంతా ప్రాంతీయ పార్టీలకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉంద న్నారు. హర్యానాలో కాంగ్రెస్ ఓటమితోనైనా రాహుల్‌గాంధీ బుద్ధి తెచ్చుకోవాలని కేటీఆర్ సూచించారు. చెప్పే మాటలకు చేస్తున్న పనులకు పొంతన లేనప్పుడు ఇలాంటి చెంపపెట్టులాంటి ఫలితాలు తప్పవని హెచ్చరించారు. బుల్డోజర్ రాజ్, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగ పరిరక్షణ పేరుతో రాహుల్ గాంధీ చేసిన డ్రామాలకు హర్యానా ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ ఈ వ్యవ హారాలు నడుస్తుంటే రాహుల్‌గాంధీ చూసీ చూడనట్టు వ్యవ హరించిన తీరును దేశం మొత్తం గమనిస్తోందన్నారు. గాలిలో దీపంలాంటి హామీ లతో రూపొందించే గ్యారెంటీ కార్డులకు ప్రజా క్షేత్రంలో కాలం చెల్లిందనే విషయాన్ని ఇప్పటికైనా కాంగ్రెస్ గుర్తించాలని తెలిపారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల హామీ ఇచ్చి, పది నెలలైనా ఒక్క గ్యారెంటీని సక్రమంగా అమలు చేయని కాంగ్రెస్‌కు ప్రజలు కర్రుగాల్చి వాత పెట్టడం ఖాయమని మండి పడ్డా రు. తెలంగాణలో సంక్షేమ రంగాన్ని సమాధి చేసి.. పదేండ్ల ప్రగతిని పూర్తిగా పాతరేసిన కాంగ్రెస్ పార్టీని ఆ పాపం వెంటాడటం తథ్యమని కేటీఆర్ హెచ్చరించారు.

రెగ్యులరైజేషన్‌కు ప్రతిపాదనలు

- కాంట్రాక్ట్ ఏఎన్ఎంలతో ఆర్వీ కర్ణన్ : టీయూఎంహెచ్‌ఈయూ వినతిపత్రం సమర్పణ



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల రెగ్యులరైజేషన్ కోసం ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ ఎంపీహెచ్ఏ (ఫిమేల్) సర్వీసులను క్రమబద్ధీకరించాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని కోఠిలో ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయూఎంహెచ్‌ఈయూ) గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. దసరా పండుగ నేపథ్యంలో వేతనాలను వెంటనే విడుదల చేయనున్నట్టు కమిషనర్ తెలిపారు. రూ.33 కోట్ల ఏరియర్స్ కూడా చెల్లించడానికి అంగీకరించినట్టు యూనియన్ నాయకులు తెలిపారు. అంతకుముందు హైదరాబాద్‌లో ప్రజావాణిలో యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆర్వీకర్ణన్‌ను కలిసి కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు 15 నుంచి 20 ఏండ్లు సర్వీసు పూర్తి చేసుకున్నారని తెలిపారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా డిస్ట్రిక్ట్ సెలెక్ట్ కమిటీ ద్వారా నియమితమై రాష్ట్రంలో 2వ ఏఎన్ఎంలు 3,958, ఈసీ ఏఎన్ఎంలు 644, ఎన్‌యూహెచ్ఎం ఏఎన్ఎంలు 841, ఆర్బీఎస్కే 269, అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు 1,083, హెచ్ఆర్డీ ఏఎన్ఎంలు 47, 104 సర్వీసుల ఏఎన్ఎంలు 20 మంది మొత్తం 6,862 మంది పని చేస్తున్నారని తెలిపారు. గతేడాది ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 4 వరకు సమ్మె చేస్తే డీహెచ్ చర్చల సందర్భంగా విరమణ ఒప్పందం జరిగిందని తెలిపారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు అధికారులతో కమిటీ వేసినా ఎన్నికలు రావడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఏఎన్ఎం పోస్టుల భర్తీ వెంటనే చేపట్టి కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, సమ్మెకాలపు వేతనాలను ఈసీఎన్ఎంలు, హెచ్ఆర్డీ ఏఎన్ఎంలకూ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ ఎరియర్స్ రూ.33.54 కోట్లు వెంటనే విడుదల చేయాలని, ఏఎన్ఎంల సమస్యలపై వేసిన కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే ముందు యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నా . అదీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె విరమణ సమయంలో ఏఎన్ఎంలకు రాతపూర్వకగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూనియన్ అధ్యక్షులు ఫసియొద్దీన్‌తో పాటు రాష్ట్ర కోశాధికారి ఎ.కవిత, రాష్ట్ర కార్యదర్శి కిరణ్మయి, రాష్ట్ర కమిటీ సభ్యులు సుగుణ, కె.సరోజ, పి.మంజుల, నాయకులు కుమారస్వామి, షీల, రమ, రాజేశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దసరా తర్వాత ఉద్యమాలు : భూపాల్

ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన అనంతరం భూపాల్ మీడియాతో మాట్లాడారు. దసరాలోపు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే దసరా తర్వాత ఉద్యమాన్ని మొదలు పెడతామని హెచ్చరించారు. ప్రజావాణిలో ఏడు సార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ ర్యాంకులకు కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు

- కేసీఆర్‌దే ఘనత : మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కన్వీనర్ కోటాలో ఆ ర్యాంకులకు ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే తొలిసారనీ, ఆ ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని వైద్యారోగ్యశాఖ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. వైద్య విద్యకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్‌గా చేసిన ఘనత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని చెప్పారు. నీట్‌లో 3 లక్షలకుపైగా ర్యాంకులు వచ్చిన విద్యార్థులకూ కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీ ఏ కేటగిరిలో 3.35 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో 2.89 లక్షల ర్యాంకు, బీసీ బీలో 2.27 లక్షలు, బీసీ సీలో 3.14 లక్షలు, బీసీ డీలో 2.13 లక్షలు, బీసీ ఈలో 2.24 లక్షల ర్యాంకులు సాధించిన వారికి ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే మొదటిసారని తెలిపారు. కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు ఎక్స్ వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణాలో ఉంటూ వైద్య విద్య చదివి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడం, తెలంగాణ బిడ్డలు డాక్టర్ కావాలనే కలను స్వరాష్ట్రంలోనే ఉండి సుసాధ్యం చేసు కోవాలని జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 5 నుంచి 34కు పెరిగిందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రయివేటుతో కలిపి మొత్తం మెడికల్ కాలేజీల సంఖ్య 20 నుంచి 60కి చేరిందని వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2850 నుంచి 8315కు పెరిగిందనీ, ఎంబీబీఎస్ చదవాలనుకునే విద్యార్థులకు అవకాశాలు గణనీయంగా పెరిగాయని అన్నారు.

గురుకుల విద్యావ్యవస్థపై భట్టికి అవగాహన లేదు

- ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌పై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి : డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

గురుకుల విద్యావ్యవస్థపై హైదరాబాద్ డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు అవగాహన లేదని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఎప్పుడైనా గురుకులాలను సందర్శించారా? అని ప్రశ్నించారు. ప్రతి గురుకులానికి ఒక జీవో ఉంటుందనీ, మాజీ సీఎం కేసీఆర్ ఎంతో శ్రమించి గురుకుల వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న గురుకులాల్లో అన్ని సామాజిక వర్గాల విద్యార్థులున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ తీసుకొచ్చిన సామాజిక న్యాయమేంటో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 10 లక్షల మంది విద్యార్థులతో ప్రభుత్వం ఆడుకుంటోందని విమర్శించారు. ఒక్కో విద్యార్థిపై కేసీఆర్ సర్కారు ఏడాదికి రూ.ఒక లక్ష ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మండలాల్లో ఉన్న గురుకులాలను రద్దు చేయాలని భావిస్తోందన్నారు. గత పదేండ్లలో తెలంగాణ విద్యావ్యవస్థ శిథిలమైందని, 21 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ శంఖుస్థాపన చేస్తామంటూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ముందుకు వస్తుందని తెలిపారు. అంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలను బంద్ చేస్తారా? అని ప్రశ్నించారు. 662 గురుకులాలకు బడ్జెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భట్టి చదివిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అందరికీ ఒకే హాస్టల్, డైనింగ్ లేదని గుర్తుచేశారు. స్కూల్స్ అంటే కోళ్ల ఫామ్స్ కాదనీ, ఒకే చోట 2,560 మంది విద్యార్థులు ఎలా ఉంటారని ప్రశ్నించారు. 60 మంది విద్యార్థులకు కేసీఆర్ పది ఎకరాల స్థలం కేటాయించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2,560 మందికి రూ. 25 కోట్లతో భవనాలు ఎలా నిర్మిస్తుందని సందేహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ శాఖలన్నింటినీ రద్దు చేస్తారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో విద్యార్థులు విమానాలు ఎక్కితే, రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక 28 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టారని ఎద్దేవా చేశారు. ఐఐఐటీ బాసరలో 8 వేల మంది విద్యార్థులున్నారని, అక్కడ అనేక ఇబ్బందులున్నాయని తెలిపారు.

గురుకులాల్లో చదివిన వారిలో 160 మందికి మెడికల్ సీట్లు వచ్చాయని చెప్పారు. విద్యార్థులు తమకు ఫ్యాకల్టీ కావాలని డిమాండ్ చేస్తుంటే, అక్కడ పని చేస్తున్న టీచర్లను ఒక్కరోజులో రెండు వేల మందిని తీసేశారని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాలపై జీవో లేకుండా డిప్యూటీ సీఎం భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఎలా ఇచ్చారని తప్పుపట్టారు. ఇప్పటి వరకు ఒక్క గురుకుల పాఠశాలకు రగ్గులు ఇవ్వలేదని, గురుకులాల్లో పని చేస్తున్న సిబ్బందికి జీతాలు రావడం లేదని తెలిపారు. ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌పై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

లాడ్జిలో కుటుంబం ఆత్మహత్యాయత్నం

- కోడలు వరకట్నం కేసు పెట్టిందన్న అవమానంతో.. విషం తాగిన ముగ్గురు
- గాంధీకి తరలింపు.. పరిస్థితి విషమం



నవతెలంగాణ–బేగంపేట్

కోడలు తమపై వరకట్న వేధింపుల కేసు పెట్టిందన్న అవమాన భారంతో పాటు పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విషయం తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఈ ఘటన సికింద్రాబాద్‌లో మంగళవారం జరిగింది. ప్రస్తుతం వారు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, బాధితుల బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగోల్‌లో నివాసముంటున్న భావనారాయణ– పద్మావతి దంపతుల కుమారుడు సృజన్. అతనికి ఈ ఏడాది ఫిబ్రవరి 14న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెంచిపల్లికి చెందిన కావ్యశ్రీతో వివాహం జరిగింది. అయితే, అత్తింటి వారు తనను వేధిస్తున్నారంటూ భర్త, అత్త, మామపై కావ్యశ్రీ చెంచుపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదైంది. పోలీసులు సృజన్‌కు, అతని తల్లిదండ్రులకు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు రావాలని చెప్పారు. కోడలు కేసు పెట్టడం వల్ల తమ పరువు పోయిందని, మరోవైపు పోలీసులు తమను అరెస్టు చేసేందుకు ఇంటికి వస్తారని భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ముగ్గురు సికింద్రాబాద్ ప్యాట్నీ సమీపంలోని తాజ్ –త్రీస్టార్ హోటల్లోని మూడో అంతస్తులో 308 గదిని బుక్ చేసుకుని ఈ నెల 5వ తేదీ నుంచి ఉంటున్నారు. ప్రతి రోజూ హోటల్ సిబ్బందితోనే టీ, టిఫిన్, భోజనాలు తెప్పించుకుని గదిలోనే తింటున్నారు. మంగళవారం ఉదయం టీ–కావాలంటూ ఎవరూ ఆర్డర్ ఇవ్వకపోవడంతో రూమ్ బాయ్ వెళ్లి గది తలుపు కొట్టినా స్పందన లేకపోవడంతో వెనుదిరిగి వచ్చాడు. కాగా, తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్టు కోడలికి వాట్సప్ ద్వారా సమాచారం ఇవ్వడంతో ఆమె చెంచుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చింది. దాంతో వారు మహంకాళి పోలీసులకు చెప్పగా.. వారు వెంటనే హోటల్‌కు వచ్చి గది తలుపులు బద్దలు కొట్టారు. అప్పటికే ముగ్గురు విషం తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. పోలీసులు వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ముగ్గురు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్, ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 09-10-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 231
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు వెల : 6.50

సత్యమే గెలిచింది

వినేశ్ ఫోగట్

ఎమ్మెల్యేగా మల్లయోధురాలు



జులనా : హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జులనా అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగట్ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థిపై 6,015 ఓట్ల తేడాతో ఆమె గెలుపొందారు. వినేశ్‌కు మొత్తం 65,080 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి యోగేశ్ కుమార్‌కు 59,065 ఓట్లు వచ్చాయి. గెలుపు ...10లో

కాశ్మీర్‌లో ఇండియా

హర్యానాలో బీజేపీ


తప్పిన ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు

ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ జమ్మూకాశ్మీర్‌లో ఇండియా బ్లాక్ , హర్యానాలో బీజేపీ విజయం సాధించాయి. జమ్మూకాశ్మీర్‌లో హంగ్ ఏర్పడుతుందన్న ఎగ్జిట్‌పోల్స్ అంచనా తప్పింది. అక్కడ ఎన్సీ-కాంగ్రెస్ కూటమి స్పష్టమైన ఆధిక్యత సాధించింది. 90 స్థానాలున్న జమ్మూకాశ్మీర్ శాసనసభలో ఇండియా బ్లాక్‌లోని ఎన్సీకి 42, కాంగ్రెస్‌కు 6, సీపీఐ (ఎం)కు ఒక స్థానం లభించాయి. బీజేపీ 29 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. స్వతంత్రులు ఏడు సీట్లలో గెలుపొందారు. 2014 ఎన్నికలలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పీడీపీ కేవలం మూడు స్థానాలకే పరిమితమైంది. జమ్మూకాశ్మీర్‌లో ఆమ్‌ఆద్మీ పార్టీ బోణీ కొట్టగా పీపుల్స్ కాన్ఫరెన్స్‌కు ఒక స్థానం దక్కింది. కుల్గాం స్థానంలో సీపీఐ (ఎం) నేత మహమ్మద్ యూసఫ్ తరిగామి విజయం సాధించారు.హర్యానాలోని మొత్తం 90 శాసనసభ స్థానాలలో బీజేపీ 48, కాంగ్రెస్ 37 స్థానాలు గెలుచుకున్నాయి. ఐఎన్ఎల్‌డీ రెండు స్థానాలు సాధించగా ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. హర్యానాలో కాంగ్రెస్ విజయం తథ్యమని అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసినప్పటికీ తీర్పు బీజేపీకి అనుకూలంగా వచ్చింది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ) బీఎస్పీతోనూ, దుష్యంత్ చౌతాలా నేతృత్వంలోని జననాయక్ జనతా పార్టీ (జేజేపీ), పార్లమెంట్ సభ్యుడు చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీతోనూ పొత్తు పెట్టుకొని బరిలో దిగినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. ఒంటరి పోరు సాగించిన ఆమ్‌ఆద్మీ పార్టీకి నిరాశ తప్పలేదు.

వివరాలు 10లో




అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 2024 — జమ్మూ కాశ్మీర్



పార్టీ	సీట్లు
ఎన్సీ	42
బీజేపీ	29
కాంగ్రెస్	6
పీడీపీ	3
జేపీసీ	1
సీపీఐ(ఎం)	1
ఆప్	1
ఇతరులు	7

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 2024 — హర్యానా



పార్టీ	సీట్లు
బీజేపీ	48
కాంగ్రెస్	37
ఐఎన్ఎల్‌డీ	2
ఇతరులు	3

మంచుకొండల్లో ఎగిరిన ఎర్ర జెండా



కుల్గాంలో తరిగామి విజయం

శ్రీనగర్ : దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గాం శాసనసభ స్థానంలో సీపీఐ (ఎం) అభ్యర్థి మహమ్మద్ యూసఫ్ తరిగామి వరుసగా ఐదోసారి విజయం సాధించారు. ఆయనకు 33,634 ఓట్లు లభించగా ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన నిషిద్ధ జమాతే ఇస్లామీ సభ్యుడు సయార్ అహ్మద్ రెషికి 25,796 ఓట్లు వచ్చాయి. పీడీపీ అభ్యర్థికి మహమ్మద్ అమిన్ ...11లో

ఏకమైన జాట్ వ్యతిరేక కులాలు
ప్రభుత్వ వ్యతిరేక ఓట్లలో చీలిక
హర్యానాలో గట్టెక్కిన బీజేపీ 10లో


మితిమీరిన ఆత్మవిశ్వాసం
రచ్చకెక్కిన కుమ్ములాటలు
జాట్ ఓట్లనే నమ్ముకొని భంగపడిన కాంగ్రెస్ 10లో

జమ్మూకాశ్మీర్‌లో పారని బీజేపీ పాచిక
ఎత్తుగడల్ని తిరస్కరించిన ఓటరు 10లో

ఈవీఎంలలో అవకతవకలు

హర్యానా ఫలితాలను అంగీకరించం : కాంగ్రెస్ నేతలు

ఈసీకి ఫిర్యాదు : జైరామ్ రమేశ్



చండీగఢ్: హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. కౌంటింగ్ ప్రారంభమైన గంట వరకు కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలోనే ఉన్నది. ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బీజేపీ అనూహ్యంగా ఆధిక్యంలోకి రావడం, ఆ తర్వాత తుది ఫలితాల్లోనూ బీజేపీ ఘన విజయం సాధించడం జరిగిపోయాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అనుమానం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, జైరాం రమేశ్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి ఎన్నికల ఫలితాలపై మాట్లాడారు. హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను తాము అంగీకరించడం లేదని తేల్చిచెప్పారు. ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని, ప్రజల ...10లో

కాంగ్రెస్‌కు నో ఎంట్రీ బోర్డులే

సత్యం, అభివృద్ధి, సుపరిపాలనదే విజయం : ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : గీతాభూమి (హర్యానా)లో సత్యం, అభివృద్ధి, సుపరిపాలన విజయం సాధించాయని ప్రధాని మోడీ పేర్కొన్నారు. అటు జమ్మూకాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడం భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువల విజయంగా అభివర్ణించారు. బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో పాల్గొన్న ప్రధాని మోడీ.. కాంగ్రెస్ దాని మిత్రపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భారత సమాజం, ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు ప్రపంచ వేదికగా కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.హర్యానాలో వరుసగా మూడోసారి బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టి ప్రజలు సరికొత్త చరిత్రను లిఖించారు. కాంగ్రెస్ ...11లో

మంత్రి సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోండి

మా కుటుంబ గౌరవానికి భంగం కలిగించారు

కోర్టులో సినీనటుడు నాగార్జున స్టేట్‌మెంట్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సినీనటుడు అక్కినేని నాగార్జున కోర్టుకు విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి కే తారకరామారావు, మంత్రి కొండా సురేఖ వాగ్వివాదంలో సినీనటుడు నాగార్జున కుటుంబం ప్రస్తావన వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన హైదరాబాద్ నాంపల్లి క్రిమినల్ కోర్టులో మంత్రి కొండా సురేఖపై తన న్యాయవాది ద్వారా ప్రయివేటు కేసు ఫైల్ చేశారు. దీనిపై నేరుగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంతో మంగళవారం నాగార్జున కోర్టుకు హాజరయ్యారు. దేని కోసం పిటిషన్ ఫైల్ చేశారని కోర్టు ఆయన్ని ప్రశ్నించింది. దీనిపై ఆయన తన వివరణ ఇచ్చారు. మంత్రి కొండా సురేఖ ఉద్దేశ్యపూర్వకంగా తన కుటుంబంపై అమర్యాదకరమైన వ్యాఖ్యలు చేశారనీ, దీనివల్ల తన పేరు ప్రతిష్ఠలు, గౌరవ మర్యాదలకు భంగం కలిగిందని వివరణ ఇచ్చారు. సినిమా రంగం ద్వారా తన కుటుంబానికి మంచి పేరు ప్రతిష్ఠలు ఉన్నాయనీ, దేశవిదేశాల్లో తమకు అభిమానులు ఉన్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయనీ, అనేక సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నామని ...11లో

భౌతికశాస్త్రంలో ఇద్దరికి నోబెల్

ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లతో మెషిన్ లెర్నింగ్ ఆవిష్కరణలు

హోప్‌ఫీల్డ్, జెఫరీ హింటన్‌కు పురస్కారం



స్టాక్‌హోం: భౌతికశాస్త్రంలో విశేష కృషి చేసినందుకు ఈ ఏడాది ఇద్దరికి నోబెల్ బహుమతి లభించింది. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లతో మెషిన్ లెర్నింగ్ ఆవిష్కరణలకు గానూ జాన్ జె. హోప్‌ఫీల్డ్, జెఫరీ ఈ.హింటన్‌కు ఈ అత్యున్నత ...11లో

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం

ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి పేరును తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ఖరారు చేసింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుత శాసనమండలి సభ్యులు నర్సిరెడ్డిని మరోసారి బరిలో నిలపాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. టీఎస్‌యూటీఎఫ్ ...11లో

చెరువుల గుర్తింపునకు హైడ్రా భారీ కసరత్తు

1971-72 సర్వే ప్రకారం ముందుకు

సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో
గొలుసుకట్టు చెరువులకు ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ నగరంలో అసలు ఎన్ని చెరువులుండేవి, ఇప్పుడు ఎన్ని ఉన్నాయి లెక్క తేల్చేందుకు హైడ్రా భారీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి ముందుకెళ్తొంది. మంగళవారం హబ్సిగూడలోని సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి హైడ్రా కమిషనర్, ఐజీ ఏవీ రంగనాథ్ వెళ్లారు. సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ టీసీ పరీడా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే దేబబ్రత పాలిట్, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన పాత మ్యాప్‌లను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. 1971 - 72 సర్వే ప్రకారం నగరంలో ఎన్ని చెరువులున్నాయి, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి, ప్రస్తుతం వాటి పరిస్థితి ఏంటని ఆరా తీశారు. నాలాల పరిస్థితి ఏమిటి, ఎంత విస్తీర్ణంలో ఉండేవి, ఇప్పుడు ఎంత మేర కబ్జా అయ్యాయో మ్యాప్‌ల పరిశీలన చేశారు. దశాబ్దాల కిందటి మ్యాప్‌లతో పాటు నేటి పరిస్థితిని సరిపోల్చుతూ చెరువులు, నాలాల వివరాలను పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా సర్వే ఆఫ్ ఇండియా అధికారులు వివరించారు. ఇప్పటికే హెచ్ఎండీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ నుంచి సేకరించిన చెరువుల జాబితాతో సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణలో సర్వే ఆఫ్ ఇండియాను కూడా భాగస్వామ్యం చేయడంతో ...11లో

ఈడీ విచారణకు మాజీ ఎంపీ అజహరుద్దీన్

హెచ్‌సీఏ అవకతవకలపై ఆరా

తప్పుడు ఆరోపణలు :హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు



హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హెచ్‌సీఏలో జరిగిన అవకతవకల వ్యవహారంలో ఆయనకు ఇటీవల ఈడీ నోటీసులు జారీ చేసింది. దీంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో విచారణకు వచ్చారు. సుమారు 10 గంటల పాటు ప్రశ్నించారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలు తప్పుడువని చెప్పారు.అయితే హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియానికి సంబంధించి జనరేటర్లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు సంబంధించి రూ.20 కోట్ల మేర అవకతవకలు జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో అజహరుద్దీన్‌కు ఈడీ నోటీసులిచ్చి విచారణకు రావాలని ఆదేశించింది.

ఉపాధ్యాయ పోస్టులకు 10,006 మంది ఎంపిక

65 రోజుల్లోనే డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి

నేడు ఎల్బీస్టేడియంలో నియామక పత్రాలు అందజేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి 10,006 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. 2,629 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులకు 2,515 మంది, 727 లాంగ్వేజ్ పండితుల (ఎల్పీ) పోస్టులకు 685 మంది, 182 ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) పోస్టులకు 145 మంది, 6,508 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు 6,277 మంది, 220 స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టులకు 103 మంది, 796 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టులకు 281 మంది చొప్పున 11,062 పోస్టులకు 10,006 మంది అభ్యర్థులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల 1,056 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం లేదని విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన వివరాలను అన్ని జిల్లాల డీఈవో కార్యాలయాలకు పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం సోమవారం అర్ధరాత్రి నుంచే పంపించింది. మంగళవారం ఉదయం నుంచి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు డీఈవో కార్యాలయాల నుంచి ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించడంతోపాటు ఫోన్ చేసి చెప్పారు. అన్ని జిల్లాల డీఈవో కార్యాలయాల వద్దకు బుధవారం ఉదయం అభ్యర్థులు చేరుకోవాల్సి ఉంటుంది. కలెక్టరేట్ల నుంచి హైదరాబాద్‌కు బస్సుల్లో బయలుదేరుతారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన ప్రతి అభ్యర్థి హాజరు కావాలనీ, ఎవరికీ మినహాయింపు లేదని డీఈవోలు స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా వీరికి నియామకపత్రాలను అందజేస్తారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జులై 18 నుంచి ఆగస్టు ఐదో తేదీ ...11లో

సంపాదకీయం

బతుకులు ఆగం చేయొద్దు



పుస్తెలు అమ్ముకుని, లక్షల రూపాయలు అప్పులు చేసి సొంతిల్లు నిర్మించుకుంటే నిర్దాక్షిణ్యంగా కూల గొడుతున్నారంటూ ప్రజలు ఆర్తనాదాలు చేస్తున్నారు. మరి నాడు పర్మిషన్లు ఎందుకిచ్చారంటూ అధికారులను నిలదీస్తున్నారు. దశాబ్దాల తరబడి నివసిస్తున్న వారిని ఇల్లూ వాకిలి వదిలి ఉన్నపళంగా పొమ్మంటే ఎలా పోతారు? వాటికి బదులు ఎక్కడో 30 కిలో మీటర్ల ఆవల డబుల్ బెడ్రూం ఇస్తామంటే ఎలా ఒప్పుకుంటారు? తమ ఉపాధిని పోగొట్టుకుని అంతదూరం ఎలా వెళతారు? అందుకే సుందరీకరణ పేరుతో మా బతుకుల ఆగం చేయొద్దని ప్రభు త్వాన్ని వేడుకుంటున్నారు. సరైన ప్రత్యామ్నాయం చూపించకుండా, అఖిలపక్షాలతో సమావేశమవ్వకుండా మూసీ విషయంలో ప్రభుత్వం ఇలా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరైనది కాదు.

> **ఇప్పుడే కాదు గతంలోనూ అనేక ప్రభుత్వాలు మూసీ ప్రక్షాళన కోసం కోట్లు ఖర్చు పెట్టాయి. ఫలితం మాత్రం శూన్యం. వందల కోట్లు మూసీలో కలిసిపోయాయి. ఇప్పుడు కూడా ఇంత పెద్ద ప్రాజెక్ట్ గురించి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లోగానీ, రాజకీయ పక్షాలతో గాని, నగర ప్రజాప్రతినిధులతో గానీ ప్రభుత్వం చర్చలు జరపలేదు. ఈ బఫర్ జోన్‌లోనే హైకోర్టు, సాలర్జంగ్ మ్యూజియం, ఉస్మానియా ఆసుపత్రి, బస్టాండ్ వంటి చారిత్రాత్మక కట్టడాలున్నాయి. మరి వాటిని కూడా కూల్చేస్తారా? అందుకే హైకోర్టు కూడా రేవంత్ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది.**

ఇప్పుడు రాష్ట్రమంతా మూసీ ప్రక్షాళనపైనే చర్చ. మూసీ ప్రక్షాళన అవసరమే. కానీ కండ్ల ముందే కూలి పోతున్న తమ ఇంటిని చూసుకొని ప్రజలు బోరున విలపిస్తున్నారు. మూసీ సుందరీకరణ పేరుతో జరుగుతున్న ఈ ప్రక్షాళన ఇప్పుడు సాధారణ ప్రజల గొంతుమీద కత్తిలా మారింది. వారి నిలువ నీడను ప్రభుత్వం అమాంతంగా ముంచేయబోతోంది. సామాన్యుల బతుకులు ఫణంగా పెట్టి చేసే ఈ అభివృద్ధి వల్ల ఎవరికి ప్రయోజనమో ఆలోచించాల్సిన తరుణమిది.

మూసీ నదిని హైదరాబాద్ నగర ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో అభివృద్ధి చేయడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు రేవంత్‌రెడ్డి అనేక సార్లు ప్రకటనలు చేశారు. దీని కోసం వేల కోట్ల బడ్జెట్ కూడా కేటాయించారు. దుర్గంధంగా మారిన మూసీ నదిని ప్రక్షాళన చేయడం స్వాగతించాల్సిందే. ఇందులో ఎలాంటి భిన్నాభిప్రాయం లేదు. అంతే కాకుండా ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ జిల్లాల రైతులు ఈ నీటితోనే పంటలు సాగు చేస్తున్నారు. ఈ మురికి నీటితో పండించిన పంటల వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. అందుకే మూసీ నదిని శుద్ధి చేయాలని రైతులతో పాటు వామపక్షాలు ఏండ్ల నుండి డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.

ఇప్పుడే కాదు గతంలోనూ అనేక ప్రభుత్వాలు మూసీ ప్రక్షాళన కోసం కోట్లు ఖర్చు పెట్టాయి. ఫలితం మాత్రం శూన్యం. వందల కోట్లు మూసీలో కలిసిపోయాయి. ఇప్పుడు కూడా ఇంత పెద్ద ప్రాజెక్ట్ గురించి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లోగానీ, రాజకీయ పక్షాలతో గాని, నగర ప్రజాప్రతినిధులతో గానీ ప్రభుత్వం చర్చలు జరపలేదు. ఈ బఫర్ జోన్‌లోనే హైకోర్టు, సాలర్జంగ్ మ్యూజియం, ఉస్మానియా ఆసుపత్రి, బస్టాండ్ వంటి చారిత్రాత్మక కట్టడాలున్నాయి. మరి వాటిని కూడా కూల్చేస్తారా? అందుకే హైకోర్టు కూడా రేవంత్ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది.

నిజానికి మూసీ నదికి వర్షాకాలంలో కొద్ది రోజులు మాత్రమే వరదలు వస్తున్నాయి. మిగతా ఏడాది మొత్తం నగరంలోని మురికి నీరే ప్రవహిస్తుంది. ఆ నీటిలో రెండు వంతుల మురికి నీరు మూసీలో నేరుగా కలుస్తుంది. దీని కారణంగా బస్తీ ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. దోమల ఉత్పత్తికి మూసీ ప్రధాన కేంద్రంగా మారింది. అందుకే సుందరీకరణ కంటే ముందే మూసీ నీటిని శుద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాస్తవానికి మూసి పరిసర బస్తీల్లోని అతి కొద్ది భాగం మినహా మెజారిటీ బస్తీలు ఏనాడు వరదల్లో మునగలేదు. 2020 నాటి మూసీ వరదల నాటి లెక్కలు తీస్తే ఈ విషయాలు బయటపడతాయి. నిజంగా ప్రభుత్వం ప్రజలను వరదల బారి నుండి కాపాడాలంటే కేవలం ముంపునకు గురయ్యే బస్తీలకే ప్రత్యామ్నాయం చూపించాలి. అలా కాకుండా ముంపుకు గురికాని బస్తీలను కూడా ఎందుకు తొలగిస్తున్నారు? మూసీని ప్రక్షాళన చేయడం వేరు, సుందరీకరణ చేయడం వేరు. సుందరీకరణకంటే ముందు ప్రభుత్వం శుద్దీకరణ, మురుగు నీటిని నిరోధించడం మీద శ్రద్ధ పెట్టాలి. మూసీ భూమిని కబ్జా చేసిన బడా బాబుల నిర్మాణాలను కూలగొట్టాలి. మరింత ఆక్రమణకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజాప్రయోజనాలకి, పర్యావరణానికి మొదటి ప్రాధాన్యమివ్వాలి. ఆ తర్వాతే సుందరీకరణ, రియల్ ఎస్టేట్, టూరిజం.

వాస్తవానికి మూసీ ప్రక్షాళన జరగాల్సిందే. దానికి అవసరమైన చర్యలు చేపట్టాల్సిందే. దాని కోసం పేదల ఇండ్లను కూల్చడం మాత్రం సరైనది కాదు. కార్పొరేట్ కంపెనీల వ్యాపారం కోసం పేదల ఇండ్లను తొలగించడం దారుణం. పైగా ఆ ప్రాంత ప్రజలతో, రాజకీయ పార్టీలతో చర్చించకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం అస్సలు మంచిది కాదు. మూసీ నదితో ముడిపడి, నది పరిసరాల్లో నివసిస్తున్న వేలాది మంది పేదలను అభివృద్ధిలో భాగస్వాములను చేయకుండా, వాళ్ల ఉపాధిని పట్టించుకోకుండా వారిని నగరం అవతలకు తరలించడం ప్రజా పాలన అనిపించుకోదని ప్రభుత్వం గుర్తు పెట్టుకోవాలి.

సామ్రాజ్యవాదులకు చెమటలు పట్టించిన 'చే'

కోట్లాది ప్రజలకు ఆయనొక స్ఫూర్తి ప్రదాత. యువతరానికి నిరంతర ప్రేరణ. సామ్రాజ్యవాదులకు సింహస్వప్నం. ఆయన బతికింది కేవలం 39 సంవత్సరాలే అయినా, వందల ఏండ్లకు సరిపడా పోరాట స్ఫూర్తిని అందించిన చిరస్మరణీయుడు. నేటికీ చాలామంది వారి దుస్తులపై, వాహనాలపై ఆయన చిత్రాన్ని ముద్రించుకుంటారు. ముద్దుగా 'చే' అని కూడా పిలుచుకుంటారు. అమెరికా, దానికి వంతపాడుతున్న పెట్టుబడిదారి దేశాలను, వారు ప్రోత్సహించే నియంతలకు చెమటలు పట్టించిన అగ్నికణం. ఆయనే ప్రపంచ సోషలిస్టు నేత ఎర్నెస్ట్ చేగువేరా. 1928 జూన్ 14న అర్జెంటీనా దేశంలోని "రొసారియా"లో వామపక్ష భావజాలం గల కుటుంబంలో



ఐదవ సంతానంగా జన్మించిన 'చే' కడదాకా పేదల కోసం పోరాడిన విప్లవవీరుడు. "నా కుమారుని నరాల్లో ప్రవహించే రక్తం ఐరిష్ తిరుగుబాటు దారులదై ఉండాలి" అని తన తండ్రి కోరుకున్నట్లుగా, ఆ ఆశయా లకు అనుగుణంగా పోరాట పటిమను అలవర్చు కున్న ధీరుడు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు సంపాదించుకున్న చేగువేరా వైద్య చదువు చదివే రోజుల్లోనే, మోటార్ సైకిల్‌పై దక్షిణ అమెరికా ఖండమంతా ప్రయాణించి, ఆనాటి సమాజంలో ఉన్న ధనిక, పేద అంతరాలు ప్రత్యక్షంగా చూసి చలించాడు. పేదల కష్టాలు కడతేర్చడానికి, సామ్రాజ్య వాదంపై విజయం సాధించడానికి "సాయుధ విప్లవం" ఒకటే మార్గమని తలిచాడు. పేద ప్రజల జీవన పరిస్థితులు మెరుగు పరచడానికి మెరుపుతీగై, పెట్టుబడిదారి వ్యవస్థపై మెరుపుదాడికి గొరిల్లా యోధుడై, అమెరికా వంటి దేశాలకు వణుకు పుట్టించాడు.

1954లో గౌటిమాలలో ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్న సామ్యవాద అనుకూల ప్రభుత్వంతో పనిచేశాడు. అయితే అమెరికా ఆ ప్రభుత్వాన్ని కూల దోయటచే, మెక్సికో చేరుకున్నాడు. ఆ సమయంలో తన సహచరులతో మెక్సికో చేరుకున్న ఫెడరల్ కాస్ట్రోతో పరిచయమై క్యూబాలో అమెరికా ప్రోత్సహిస్తున్న నియంత బటిస్టా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాస్ట్రో చేస్తున్న పోరాటానికి మద్దతుగా అడుగులేశాడు. 1956-59 మధ్య జరిగిన గట్టి పోరాటంలో బటిస్టాను గద్దె దింపి, క్యూబా విప్లవ ఉద్యమంలో మహోన్నత పాత్ర పోషించి, ఫెడరల్ కాస్ట్రో అధ్యక్షతన ఏర్పడిన సామ్యవాద ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రిగా, బ్యాంకు అధ్యక్షుడుగా సేవలందించాడు. అనేక దేశాలు పర్యటిస్తూ, భారతదేశాన్ని కూడా 1959లో సందర్శించాడు. అభివృద్ధి చెందుతున్న దేశాలపై అమెరికా పెత్తనాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. అలాంటి సామ్రాజ్యవాద దేశాలపై ఉక్కుపాదం మోపాలనే "చేగువేరా" నిరంతరం తపించాడు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో క్యూబా తరుపున పాల్గొని, దక్షిణ ఆఫ్రికాలోని జాతి వివక్షతపై, లాటిన్ అమెరికాలోని వివిధ దేశాల నియంతల పాలనపై, సామ్రాజ్యవాద దేశాల ప్రభావాన్ని గొంతెత్తి చాటాడు..వేలెత్తి చూపాడు. క్యూబా విప్లవానికి నాంది పలికాడు. రైతాంగ విప్లవాల నిర్మాణానికి దోహదం చేశాడు. కాస్ట్రో తరువాత క్యూబాలో అంతటి అధికారం, పట్టు కలిగిన బలమైన నేతగా ఉన్న సమయంలో, ఇతర పేద దేశాల్లో విప్లవాన్ని వ్యాప్తి చేయడానికి బయలుదేరాడు. కాస్ట్రో మాటను సైతం లెక్కచేయకుండా క్యూబాను వదిలి కాంగో వెళ్లాడు. తరువాత "బొలివియా" చేరి అక్కడ ప్రజాపోరాటాల్లో ఉన్న సమయంలో 1967అక్టోబర్ 9న బొలివియా సైన్యంచే చంపబడ్డాడు. "టైం మేగజైన్" ప్రకటించిన 20వ శతాబ్దపు అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో "చేగువేరా" ఒకడిగా నిలిచాడంటే మాటలు కాదు,యువతకు ఆయనొక ప్రపంచ ఐకాన్.

అమెరికాతో అంటకాగుతూ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రంలోని మోడీ సర్కార్‌పై చేగువేరా స్ఫూర్తితో యువత పోరాటం చేయాల్సిన అవసరమున్నది. ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రయివేటీకరిస్తూ, ప్రజలని మతోన్మాద ఉచ్చులో బిగిస్తూ, అదానీ, అంబానీ లాంటి కుబేరుల కోసమే పాలన సాగిస్తున్న మోడీని నిలువరించాల్సిన సమయమిది. నేడు నిత్యావసర వస్తువులు, కాయగూరలు, గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు పెరుగుతున్నాయంటే, కారణం బడా పారిశ్రామిక వేత్తలే కాదు, వారి మేలుకోసం తోడ్పడుతున్న సర్కార్ మోడీదేనన్న అంశం మరవరాదు. గ్రామాల నుంచి మొదలుకుని పట్టణాలు, నగరాల్లో యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్, ఆపై మహిళలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టలేని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నా, నిలదీయలన్నా చేగువేరాను ఆదర్శంగా తీసుకుని ఉద్యమించమే అనివార్యం. ఆయన సిద్ధాంతం, పట్టుదల నేటి యువతకు ఆదర్శం కావాలి. ఆయన చిత్రంతో ఉన్న దుస్తులను ధరించడం కాదు, ఆయన ఆశయాలైన సామ్రాజ్య వాదాన్ని ప్రతిఘటిస్తూ, సామ్యవాదాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పేదరిక నిర్మూలనకు, అవినీతి, అణచివేత ధోరణులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించేతత్వాన్ని యువత పెంపొందించుకోవాలి. వాస్త వాలు అవగాహన చేసుకుంటూ, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం, వలస కార్మికుల వెతలు భవిష్యత్తులో దరిచేరకుండా ఉండేలా ప్రజల్ని చైతన్యపరిచి ఉద్యమించాలి. అదే 'చే' నడిచిన దారి.

(నేడు చేగువేరా వర్థంతి)

- ఐ.ప్రసాదరావు, 9948272919

గాజా మారణకాండకు ఏడాది... తప్పుడు వార్తలతో మీడియా దాడి!



ఎం కోటేశ్వరరావు
8331013288

తమ్ముడు తనవాడైనా ధర్మాన్ని ధర్మంగా చెప్పాలన్న లోకోక్తి తెలిసిందే. వర్తమాన ప్రపంచంలో అలా జరుగుతోందా? నూటికి నూరుశాతం లేదు. పక్షపాత తీర్పులు, వైఖరులే వెల్లడౌతున్నాయి. గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమై అక్టోబరు ఏడవ తేదీతో ఏడాది గడిచింది. ప్రపంచ ప్రధాన స్రవంతి మీడియా ఇజ్రాయిల్ మీద హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడికి సంవత్సరం నిండింది అంటోంది. హమాస్‌దాడిని ఎవరూ సమర్థించటం లేదు. ఐక్యరాజ్య సమితి 1948లో ఇజ్రాయిల్‌ను ఏర్పాటు చేసిన తరువాత అప్పటి వరకు ఉన్న పాలస్తీనా ఉనికిలో లేకుండా పోయింది. ఏదో ఒకసాకుతో దానికి కేటాయించిన ప్రాంతాలన్నింటినీ ఆక్రమించుకోవటంతో పాటు వేలాది మందిని చంపి, లక్షల మందికి నిలువనీడ లేకుండా చేస్తూ పాలస్తీనా దేశం ఏర్పడకుండా ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికాతో సహా పశ్చిమదేశాలన్నీ మద్దతు ఇస్తున్నాయి. దానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేస్తున్న బృందాలలో హమాస్ ఒకటి. దాని దాడులు గతేడాదే ప్రారంభం కాలేదు. కానీ అది చేసిన దాడి సాకుతో గాజాలో ఏడాది కాలంగా ఇజ్రాయిల్ మారణకాండ సాగిస్తోంది. ఇప్పటి వరకు 42వేల మందిని చంపింది. పదివేల మంది జాడే లేదు. లక్ష మంది వరకు గాయపడ్డారు. లక్షలాది ఇండ్లను నేలమట్టం గావించారు. గాజాలోని 23లక్షల మందిని ఇండ్ల నుంచి వీధుల్లోకి నెట్టారు. మారణకాండ ఇంకా కొనసాగుతూనే వుంది. వెస్ట్‌బాంక్ ప్రాంతానికి విస్తరించారు. ఇదంతా ఎందుకంటే హమాస్ జరిపిన దాడిలో 815 మంది సాధారణ పౌరులతో సహా 1,195 మంది ఇజ్రాయిలీలు మరణించారు, ఆ సందర్భంగా కొందరు విదేశీయులతో సహా 251 మందిని బందీలుగా పట్టుకున్నారు, వారిలో కొందరిని విడుదల చేశారు, మరికొందరు మరణించగా మరో 95 మంది హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. దీనికి ప్రతీకారం అని చెబు తున్నారు. ఏ రీత్యా చూసినా ఇజ్రాయిల్ చర్య గర్హనీయం, అంతర్జాతీయ న్యాయస్థానంలో యుద్ధ నేరాల కింద దీనికి బాధ్యులైన వారిని శిక్షించాలి.

ఈ దారుణకాండ గురించి ప్రపంచ మీడియా వార్తలు ఇస్తున్న తీరు కూడా సభ్యసమాజం ఆమోదించేదిగా లేదు. అంతర్జాతీయ వార్తా సంస్థలన్నీ పశ్చిమ దేశాలకే చెందినవి కావటంతో అవి అందచేసిన తప్పుడు సమాచారాన్నే వాస్తవాలుగా చెబుతున్నారు. అయితే తప్పుడు, వక్రీకరణ, కుహనా వార్తలను ఇవ్వటం కొత్తగా జరుగుతున్నది కాదు. ప్రపంచం మీద ప్రచారదాడి జరుగుతున్నది. గాజాలో తలెత్తిన మానవ సంక్షోభ తీవ్రత అక్కడి నుంచి వార్తలు పంపుతున్న పశ్చిమదేశాల విలేకర్లలో ఎక్కడా కానరాదు. ప్రపంచానికి వారు అందచేస్తున్నవి తప్ప ప్రత్యామ్నాయ సంస్థలు లేవు. గాజాలో మరణించిన, గాయపడిన వారిలో నూటికి 80శాతం మంది నిరాయుధులైన మహిళలు, పిల్లలే ఎందుకు ఉన్నారో ఏ మీడియా అయినా చెబుతోందా? హమాస్ ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో చూడండి అంటూ అందచేస్తున్న వీడియోలలో ఒక శాతమైనా ఇజ్రాయిల్ దుర్మార్గాలకు సంబంధించి లేవంటే అతిశయోక్తి కాదు. వైమానికదాడులు, టాంకుల ఫిరంగి గుళ్లకు 128 మంది జర్నలిస్టులు మరణించగా వారిలో 123 మంది పాలస్తీనియన్లు, ఇద్దరు ఇజ్రాయిలీలు, ముగ్గురు లెబనీస్ ఉన్నారు. మరో 35 మంది గాయపడ్డారు. ఏకపక్షంగా జరుగుతున్న మారణకాండకు ఇదొక నిదర్శనం.ఎక్కడో ఏసి గదుల్లో కూర్చొని కంప్యూటర్ గ్రాఫిక్‌లు సృష్టిస్తున్నదెవరో, యుద్ధ రంగం లో ప్రాణాలకు తెగించి వాస్తవాలను నివేదిం చేందుకు పని చేస్తున్నదెవరో అర్థమవుతోంది. మేము సైతం అన్నట్లుగా సాధారణ పౌరులతో పాటు పాలస్తీనా జర్నలిస్టులు పనిచేస్తున్నారు, ప్రాణాలర్పిస్తున్నారు.

ఇజ్రాయిల్ మిలిటరీ, ప్రభుత్వ పెద్దలు అందిస్తున్న సమాచారాన్ని స్వయంగా చూసినట్లు పశ్చిమదేశాల విలేకర్లు, సంస్థలు చిత్రిస్తున్నాయి. ఐరోపాలో అతి పెద్ద మీడియా సంస్థ జర్మన్ యాక్సెల్ స్ప్రింగర్ అప్‌డే అనే ఒక యాప్‌ను రూపొందించింది. ఇజ్రాయిల్ ప్రతినిధులు చెప్పే కథనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాలస్తీనీయుల మరణాలను తగ్గించి చూపాలని తన సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు దాని అంతర్గత పత్రాల ద్వారా వెల్లడైందని ఇంటర్‌సెప్ట్ అనే పత్రిక పేర్కొ న్నది. అంతేకాదు మరీ తప్పనిసరైతే తప్ప పాలస్తీనియన్ల గురించి ప్రస్తావించవద్దని అమెరికా న్యూయార్క్‌టైమ్స్ పత్రిక కూడా తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. యజమానులే అలాంటి వైఖరి తీసుకున్న తరువాత నిజం రాసినా, చూపినా అవి పాఠకులు, వీక్షకుల వద్దకు చేరుకోవన్నది మీడియాలో పని చేసేవారందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. అందుకే హమాస్‌ను ఒక రాక్షసిగా, దాన్ని మట్టుపెట్టేందుకు పూనుకున్న అపరశక్తిగా, బాధిత దేశంగా ఇజ్రాయిల్‌ను చిత్రించారు. సెంటర్ ఫర్ మీడియా మోనిటరింగ్ (మీడియా పరిశీలక కేంద్రం) అనే సంస్థ అంతర్జాతీయ మీడియా ఛానల్స్ ప్రసారం చేసిన లక్షా 80వేల వీడియోలు, బ్రిటీష్ మీడియా సంస్థలు రాసిన 26వేల వ్యాసాలను వడగట్టి తేల్చింది కూడా ఇదే. అక్టోబరు ఏడు నుంచి జరుగుతున్న దాడులకు ముందు కూడా మీడియా తీరు ఇలాగే ఉంది, పాలస్తీనా కోసం పోరాడుతున్నవారిని ఉగ్రవాదులుగా చిత్రించించటం తెలిసిందే. ఇటలీ మీడియా 2019-21 సంవత్సరాల తీరుతెన్నులను ఐరోపా సమాఖ్య నిధులతో ఒక పరిశోధన చేసింది.మూడు పత్రికలను పరిశీలించగా అంతర్జాతీయ వార్తలలో 32శాతం ఇజ్రాయిల్ ప్రధాని, నరహంతకుడు నెతన్యాహు చుట్టూ తిరిగాయని తేలింది. గతేడాది కాలంగా సాగిస్తున్న మారణకాండ ఇటాలియన్ మీడియాకు పట్టలేదు. "గాజా నుంచి రాకెట్ల ప్రయోగం, గాజా నుంచి 430 రాకెట్లతో దాడి, ఇజ్రాయిల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉంది " ఇలాంటి శీర్షికలతో జనాన్ని తప్పుదారి పట్టించింది. దాని దుర్మార్గాలను సమర్ధించింది.

హమాస్ దాడిచేసి నలభైమంది పసిపిల్లల గొంతు కోసిందంటూ ఇజ్రాయిల్ అల్లిన అవాస్తవ కథనాన్ని యావత్ ప్రపంచ మీడియా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. చివరకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఖండిస్తూ మాట్లాడారు. ఇలాంటి ప్రకటనలు చేసే ముందు నిర్ధారణ చేసుకుంటే మంచిది లేకుంటే పరువు పోతుంది ముసలోడా అంటూ అతగాడి సిబ్బంది తరువాత జాగ్రత్త చెప్పినట్లు వార్తలొచ్చాయి. ఇప్పటికీ ఈ కట్టుకథ సామాజిక మాధ్యమాల్లో తిరుగుతూనే ఉంది, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు దాన్ని ఉదహరిస్తూనే ఉన్నారు. ముస్లింలు జీహాద్ ప్రకటించారు, ప్రపంచ మొత్తాన్ని కబళించేందుకు పూనుకున్నారు, తమ జనాభా సంఖ్యను పెంచుతున్నారు అంటూ సాగిస్తున్న అనేక కుట్ర కథనాలతో దశాబ్దాల తరబడి జరుపుతున్న గోబెల్స్ ప్రచారాన్ని బుర్రలకు ఎక్కించుకున్నవారిని ఇలాంటివి వెంటనే ఆకర్షిస్తాయి. అదేగనుక వాస్తవమైతే ఇజ్రాయిల్ చుట్టూ ఉన్నది ముస్లిం దేశాలే, అవన్నీ ఒక్కసారిగా దండెత్తి ఉంటే ఈ పాటికి అది అదృశ్యమై ఉండేది, పాలస్తీనియన్లు ఏడున్నర దశాబ్దాలుగా అష్టకష్టాలు పడి ఉండేవారు కాదు. కానీ అలా జరగలేదే ! అలాంటిది ముస్లింలు ప్రపంచం మొత్తాన్ని ఆక్రమిస్తారంటే నమ్మేవారికి బుర్రల్లో పదార్థం లేదన్నది స్పష్టం.ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ మారణాయుధాలను గుట్టలుగా పోసి ప్రపంచానికి ప్రమాదం తెచ్చిపెట్టాడన్న నాటి జార్జి డబ్ల్యూ బుష్, మీడియా ప్రచారాన్ని అమెరికాతో పాటు అనేక దేశాల్లో జనం నమ్మారు. తరువాత అది వాస్తవం కాదని అదే అమెరికా అంగీకరిం చాల్సి వచ్చింది. పాలకులతో పాటు మీడియా కూడా విశ్వసనీయతను కోల్పోయింది.



> **ఇజ్రాయిల్ మిలిటరీ, ప్రభుత్వ పెద్దలు అందిస్తున్న సమాచారాన్ని స్వయంగా చూసినట్లు పశ్చిమదేశాల విలేకర్లు, సంస్థలు చిత్రిస్తున్నాయి. ఐరోపాలో అతి పెద్ద మీడియా సంస్థ జర్మన్ యాక్సెల్ స్ప్రింగర్ అప్‌డే అనే ఒక యాప్‌ను రూపొందించింది. ఇజ్రాయిల్ ప్రతినిధులు చెప్పే కథనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాలస్తీనీయుల మరణాలను తగ్గించి చూపాలని తన సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు దాని అంతర్గత పత్రాల ద్వారా వెల్లడైందని ఇంటర్‌సెప్ట్ అనే పత్రిక పేర్కొ న్నది. అంతేకాదు మరీ తప్పనిసరైతే తప్ప పాలస్తీనియన్ల గురించి ప్రస్తావించవద్దని అమెరికా న్యూయార్క్‌టైమ్స్ పత్రిక కూడా తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది. యజమానులే అలాంటి వైఖరి తీసుకున్న తరువాత నిజం రాసినా, చూపినా అవి పాఠకులు, వీక్షకుల వద్దకు చేరుకోవన్నది మీడియాలో పని చేసేవారందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. అందుకే హమాస్‌ను ఒక రాక్షసిగా, దాన్ని మట్టుపెట్టేందుకు పూనుకున్న అపరశక్తిగా, బాధిత దేశంగా ఇజ్రాయిల్‌ను చిత్రించారు.**

అన్నెం పున్నెం ఎరుగని పసిపిల్లలను నిజంగా ఒక్కరిని చంపినా ఖండించాల్సిందే. ఆగస్టు 15నాటికి గాజాలో 42వేల మందిని ఇజ్రాయిల్ చంపితే వారిలో 17వేల మందికి పైగా పిల్లలు, పదకొండువేల మంది మహిళలు ఉన్నారు. ఏ పశ్చిమదేశాల మీడియా సంస్థలైనా దీన్ని గురించి ఎన్ని వార్తలనిచ్చాయి? ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన తరువాత కూడా ఇంకా హమాస్ గురించే అవి చెబుతున్నాయి.నలభై రెండువేల మందిని చంపి దాదాపు ఒక లక్ష మందిని గాయపరచి, పదివేల మందిని అదృశ్యం కావించిన యూదు దురహంకారులు పాలస్తీనియన్లను తిప్పికొట్టేందుకు చేసిన పనిగా అందమైన మాటలతో పచ్చి దుర్మార్గాన్ని పశ్చిమదేశాలు వర్ణిస్తున్నాయి. బిబిసి తీరును పరిశీలిస్తే గతేడాది అక్టోబరు 10 నుంచి డిసెంబరు రెండవ తేదీ వరకు 23సార్లు హమాస్ సాయుధులు ఇజ్రాయిలీలపై మారణకాండ జరిపారని వర్ణిస్తే ఒక్కసారే పాలస్తీనియన్ల మీద మారణకాండ పదప్రయోగం జరిగిందని తేలింది. అంటే దొంగే దొంగని అరచినట్లుగా బిబిసి తీరు ఉంది. ఈ తీరుకు నిరసనగా 2023 అక్టోబరులోనే ఇద్దరు ఆ సంస్థ జర్నలిస్టులు రాజీనామా చేశారు. గాజాపై దాడిని ఖండిస్తూ వెయ్యి మంది అమెరికా జర్నలిస్టులతో పాటు సంతకం చేసిన న్యూయార్క్ టైమ్స్ మాగజైన్ ఎడిటర్ జాజ్ హగ్స్ మీద యాజమాన్యం ఒత్తిడి తేవటంతో రాజీనామా చేసి తప్పుకోవాల్సి వచ్చింది. ఆ జాబితానుంచి పేరు తొలగించాలని అసోసియేటెడ్ ప్రెస్ విలేకరిని యాజమాన్యం ఆదేశించింది. ఇలా లాస్ ఏంజల్స్ టైమ్స్ వంటి అనేక పత్రికలు, మాగజైన్లు కూడా ఇజ్రాయిల్‌కు అనుకూలంగా ఒత్తిడి చేసి అనేకమంది జర్నలిస్టులను తొలగించటం, నోరు మూయించటం వంటి దుర్మార్గాలకు పాల్పడ్డాయి. పాలస్తీనియన్ల మీద తప్పుడు వార్తలు ఒక ఎత్తయితే వాల్‌స్ట్రీట్ జర్నల్ అనే ప్రముఖ అమెరికా పత్రిక రాసిన ఒక ఆధారం లేని వార్త కారణంగా గాజాలో నిరాశ్రయులకు అందాల్సిన 45 కోట్ల డాలర్ల సాయం నిలిచిపోయింది. గాజాలో ఐరాస నిర్వహిస్తున్న శిబిరంలో పనిచేస్తున్న పన్నెండు మంది సిబ్బందికి హమాస్‌తో సంబంధాలున్నాయని, వారంతా దాడుల్లో పాల్గొన్నారని ఆ పత్రిక కేవలం ఇజ్రాయిల్ కట్టుకథనే తనదిగా రాసింది.నిజానికి దానికి ఎలాంటి ఆధారాలు లేవు. అమెరికా సిఎన్ఎన్, బ్రిటన్ బిబిసిలో పనిచేస్తూ గాజా పరిణామాలపై వార్తలు ఇచ్చిన పదిమంది విలేకర్లు ఇజ్రాయిల్ అనుకూల వైఖరితో పనిచేసినట్లు వెల్లడించారు.న్యూస్ రూముల్లో ఉన్న సీనియర్లు జోక్యం చేసుకొని ఇజ్రాయిల్ చేసిన దుర్మార్గాలను తక్కువ చేసి చూపాలని ఒత్తిడి చేసినట్లు తెలిపారు.ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన చిత్రం ద్వారా బిబిసి భాషలో పాలస్తీనీయన్ల మీద వ్యతిరేకతను ఎలా రెచ్చగొట్టారో పరిశీలన ద్వారా వెల్లడైంది.

> **అన్నెం పున్నెం ఎరుగని పసిపిల్లలను నిజంగా ఒక్కరిని చంపినా ఖండించాల్సిందే. ఆగస్టు 15నాటికి గాజాలో 42వేల మందిని ఇజ్రాయిల్ చంపితే వారిలో 17వేల మందికి పైగా పిల్లలు, పదకొండువేల మంది మహిళలు ఉన్నారు. ఏ పశ్చిమదేశాల మీడియా సంస్థలైనా దీన్ని గురించి ఎన్ని వార్తలనిచ్చాయి? ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన తరువాత కూడా ఇంకా హమాస్ గురించే అవి చెబుతున్నాయి.నలభై రెండువేల మందిని చంపి దాదాపు ఒక లక్ష మందిని గాయపరచి, పదివేల మందిని అదృశ్యం కావించిన యూదు దురహంకారులు పాలస్తీనియన్లను తిప్పికొట్టేందుకు చేసిన పనిగా అందమైన మాటలతో పచ్చి దుర్మార్గాన్ని పశ్చిమదేశాలు వర్ణిస్తున్నాయి.**

తమ పత్రికలు ఎన్ని తప్పుడు కథనాలు, అవాస్తవాలు రాసినా అమెరికా యువత ముఖ్యంగా విద్యార్థులు పాలస్తీనా అనుకూల వైఖరి తీసుకోవటం గమనించాల్సిన అంశం. వారు మీడియా కథలను నమ్మటం లేదన్నది వాస్తవం.ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడుతున్నదని నమ్మిన కారణంగానే ఈ పరిణామం. ఇది అక్కడి పాలకవర్గాలకు ఆందోళన కలిగించే అంశం. ప్రచారదాడి ఎదురు తిరిగితే వారి పునాదులను కదలించే కదనశక్తిగా యువత మారుతుంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచి పర్యావరణ ఉద్యమ కార్యకర్త 21 సంవత్సరాల స్వీడిష్ యువతి గ్రేటా థన్‌బెర్గ్ పాలస్తీనా అనుకూల ప్రదర్శనలో పాల్గొన్నందుకు కోపెన్‌హాగన్ నగరంలో అరెస్టు చేశారు. మీడియా కూడా ఆమె మీద పెద్ద ఎత్తున విమర్శలకు దిగింది. యువతలో వచ్చిన ఈ మార్పును కూడా మూసిపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఒకసారి నీవు బాధితుడవై నందుకు గాను ఇతరుల మీద నిరంతరం దాడి కొనసాగిస్తానంటే కుదరదు, దేనికైనా ఒక హద్దు ఉంటుంది. దాన్ని మీరి గాజాలో పాలస్తీనియన్ల మీద ఇజ్రాయిల్ దుర్మార్గాలకు పాల్పడుతున్నది. పశ్చిమ దేశాల మీడియా దానికి మద్దతునిస్తున్నది. ■


మానసిక వికలాంగుల సంరక్షణ ఎవరిది?



ఎం.అడివయ్య
9490098713

మానసిక ఆరోగ్య సమస్యలపై అవగహన కల్పించడం కోసం వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ (డబ్ల్యూఎఫ్ఎంహెచ్)1992 అక్టోబర్ 10వ తేదీని ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంగా ప్రకటించింది. 1994 నుండి ఈ సంస్థ ప్రతి ఏడాది మానసిక ఆరోగ్యంపై నిర్దిష్టమైన థీమ్‌ను ప్రకటిస్తున్నది. మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణ, అందరికి మానసిక ఆరోగ్యం లక్ష్యంగా థీమ్స్ ఉంటున్నవి.ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవానికి ఆరోగ్య మంత్రిత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహనా పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ కృషి చేస్తున్నది. మానసిక వికలాంగులు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో పనిచేసే పరిస్థితులు లేకపోవడం వలన పనిలో పాల్గొనలేక పోతున్నరనేది వాస్తవం. జనాభాలో 60 శాతం మంది పనిచేస్తున్నందున ప్రభుత్వాలు, యాజమాన్యాలు కార్మికుల ఆరోగ్యం, భద్రతకు బాధ్యత వహించడం ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగు పర్చుకోవడం సులువు.కానీ, ఆది చేయాల్సింది ఎవరు?, మానసిక వికలాంగుల బాధ్యత ఎవరిది?

కోవిడ్-19 వలన ప్రజలు తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించిన విషయం తెలిసిందే. మానసిక వికలాంగులపై దీని ప్రభావం తీవ్రంగా పడటమే కాదు, సామాజిక, ఆర్థిక అసమానతలను సృష్టించింది. ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా మారడం వలన ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టలేదు. సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలు మనదేశంలో ప్రజల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేశాయి. మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం మౌలిక సదుపాయల కొరత, ఆరోగ్య నిపుణుల కొరత ఉంది. ప్రయివేటులో ఒక్క కౌన్సిలింగ్‌కు రూ.5వేల నుండి 10వేల వరకు ఖర్చు చేస్తున్న పరిస్థితి. ఇది సాధారణ ప్రజలకు భరించలేని భారం. బెంగళూరు లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్స్ చేసిన నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే- 2018 రిపోర్ట్ ప్రకారం మన దేశంలో మానసిక రుగ్మతలు కలిగిన వారిలో 83శాతం మంది చికిత్స పొందలేక పోతున్నారు. మానసిక వైద్యుల సంఖ్య రోజురోజుకూ తగ్గడం ఆందోళన కలిగించే అంశం. ప్రజలకు అవసరమైన వైద్యసేవలే కాదు, వారిని మానసికంగా ధృడపరిచేందుకు మానసిక వైద్యులు కూడా ఇప్పుడున్న పరిస్థితిలో చాలా అవసరమన్న విషయం కేంద్రం గుర్తించడం లేదు. ఈ వైద్యుల సంఖ్య మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 0.05 ఉంటే కేరళ రాష్ట్రంలో 1.2 గా ఉంది. 2021లో ప్రతి లక్ష మందికి ముగ్గురు మానసిక వైద్యులను పెంచాలని ప్రభుత్వం నిర్ణయం చేసినా అది అమలుకు నోచలేదు.



> **కేంద్ర ప్రభుత్వం మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం-1987కు సవరణలు చేస్తూ మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ 2017ను ఆమోదించింది. దీని ద్వారా దేశంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మానసిక ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్య సేవలందించడం లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. చట్టం ప్రకారం మానసిక ఆరోగ్య సంరక్షణ, అమానవీయమైన, అవమానకరమైన పరిస్థితుల నుండి రక్షణ పొందడం, సమానత్వం, వివక్షత లేకుండా హక్కులు పొందడం, న్యాయ సహాయం పొందే హక్కు చట్టం కల్పించింది.కానీ మనదేశంలో చట్టం అమలులోకి వచ్చి ఏడేండ్లవుతున్న మానసిక ఆరోగ్య సంరక్షకులకు ఎలాంటి ప్రయోజనం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు మెంటల్ హెల్త్ కేర్‌ను అమలు చేయడానికి కనీసం ప్రయత్నాలు కూడా చేయడం లేదు.**

కేంద్ర ప్రభుత్వం మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం-1987కు సవరణలు చేస్తూ మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ 2017ను ఆమోదించింది. దీని ద్వారా దేశంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మానసిక ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్య సేవలందించడం లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. చట్టం ప్రకారం మానసిక ఆరోగ్య సంరక్షణ, అమానవీయమైన, అవమానకరమైన పరిస్థితుల నుండి రక్షణ పొందడం, సమానత్వం, వివక్షత లేకుండా హక్కులు పొందడం, న్యాయ సహాయం పొందే హక్కు చట్టం కల్పించింది.కానీ మనదేశంలో చట్టం అమలులోకి వచ్చి ఏడేండ్లవుతున్న మానసిక ఆరోగ్య సంరక్షకులకు ఎలాంటి ప్రయోజనం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు మెంటల్ హెల్త్ కేర్‌ను అమలు చేయడానికి కనీసం ప్రయత్నాలు కూడా చేయడం లేదు. మానసిక ఆరోగ్య సమీక్షా కమిషన్ నేతృత్వంలో నిరంతరం సమీక్షలు చేయాలి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రభుత్వ అనుమతితో మానసిక ఆరోగ్య సమీక్షా బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆత్మహత్యలను నేరంగా పరిగణించడం,, ఆత్మహత్యలకు పాల్పడే వ్యక్తులను మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నట్లుగా భావించాలి. చట్టంలోని నిబంధనలు ఉల్లంఘిస్తే 6నుంచి 24నెలలు జైలు శిక్ష, రూ.50వేల నుండి రూ.5లక్షల వరకు జరిమానా విధించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

ఆర్థిక సర్వే 2023-24లో మొదటిసారిగా మానసిక ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేసింది. జాతీయ మానసిక ఆరోగ్య సర్వే 2015-16 రిపోర్ట్ ప్రకారం దేశంలో 10.6శాతం మంది పెద్దలు మానసిక రుగ్మతలతో బాధపడు తున్నారని, 70 శాతం మందికి వైద్యం అందుబాటులో లేదని పేర్కొంది. గ్రామీణ ప్రాంతంలో 6.9శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.3శాతం, మెట్రో పాలిటన్ పట్టణాల్లో 13.5 శాతం మంది ప్రజలు మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నది ఈ నివేదిక తెలియజేసింది. ఎన్‌సిఈఆర్‌టీ నిర్వహించిన మానసిక ఆరోగ్యం, పాఠశాల విద్యార్థుల శ్రేయస్సు సర్వేలో కోవిడ్ 19 కారణంగా యువతలో మానసిక ఆరోగ్యం బలహీనంగా ఉందని, 11శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యలతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, 14శాతం మంది తీవ్ర భావోద్వేగానికి గురవుతున్నారని పేర్కొన్నది. పేదరికం, ఒత్తిడితో కూడిన జీవన విధానం కూడా మానసిక ఆరోగ్యన్ని ప్రభావితం చేస్తున్నది. జాతీయ మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం, నేషనల్ టెలిమెంటల్ హెల్త్ ప్రోగ్రామ్, మానసిక ఆరోగ్య సిబ్బందిని పెంచడం, అడోలెసెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్, పెర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ లాంటి వాటిని గ్రామస్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఆశా వర్కర్స్, అంగన్‌వాడీ స్థాయిలోనే మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా మానసిక రుగ్మతలను ముందే గుర్తిస్తే నివారించే అవకాశం ఉంది. మానసిక ఆరోగ్య పాఠ్యాంశాలను అభివృద్ధి చేయడం, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలో విద్యార్థులు, అధ్యాపకులలో అవగాహనా పెంచడానికి కృషి చేయాల్సిన అవసరం ఉన్నది. మానసిక ఆరోగ్య సంరక్షకుల సేవల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. కమ్యూనిటీ ఆధారిత పునరావాస కార్యక్రమలను విస్తృత పరచాలి.మానసిక ఆరోగ్య రుగ్మతల ప్రభాల్యం పెరుగుకుండా ఉండేందుకు కృషి చేస్తూనే తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం అవసరం. ప్రతి జిల్లా కేంద్రంలో మానసిక వికలాంగుల పునరావస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ హాస్పిటల్‌సలో మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం వైద్యులను నియమించాలి. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారానే మానసిక ఆరోగ్య రుగ్మతల నిర్మూలన సాధ్యమవుతుంది. మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్-2017అమలు కోసం ఐక్యంగా ఉద్యమాలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది. ■

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
బుధవారం | అక్టోబర్ 09, 2024 | www.navatelangana.com

గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి పటిష్ట ప్రణాళిక

- ప్రభుత్వ లక్ష్యాల మేరకు ప్రజలకు సేవలు అందించాలి
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



విద్యుత్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలనందించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ అధికారులతో విద్యుత్ శాఖ పనితీరుపై, విద్యుత్ శాఖ సిఎండి వరుణ్ రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాబోయే కాలానికి అనుగుణంగా విద్యుత్ వినియోగం ఎంత ఉన్నా అందించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. గరిష్ట డిమాండ్ ఉన్నా విద్యుత్ సరఫరా అందించామని ఆయన అన్నారు. ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలు, వరదల సమయంలో అర్ధరాత్రి సైతం లెక్క చేయకుండా నీళ్లల్లో పనిచేసిన ప్రతి ఒక్క విద్యుత్ ఉద్యోగిని ఆభినందించారు. ఆపత్కాల సేవలు వేల కట్టలేవని ఆయన అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలకు స్పందించి, త్వరితగతిన పరిష్కరించాలని ఉపముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఉందని, ప్రభుత్వ దృష్టికి సమస్యలు ఉంటే తీసుకురావాలని అన్నారు.

రాబోయే భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని 2029-2030 వరకు గ్రీన్ ఎనర్జీ 20,000 మెగా వాట్ల ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం పడకుండా కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గృహ జ్యోతికి సంబంధించి 200 యూనిట్‌ల లోపు వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఉమ్మడి ఖమ్మం సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 26 లక్షల వినియోగదారులకు లబ్ది చేకూరిందని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి పోలం బాట కార్యక్రమం చేపడుతున్నారని, వంగిన పోల్‌లు, వదులుగా వేలాడుతూ ఉన్న లైన్‌లు ఉండకూదని, అన్నింటిని సరిచేయాలని సూచించారు. లైన్ మెన్‌లకు ప్రజలతో నేరుగా సంబంధాలు ఉంటాయని, వారి ప్రవర్తన బాగుండాలని అప్పుడే ప్రజలతో సత్ సంబంధాలు మెరుగు పడుతాయని, వారిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని ఆయన తెలిపారు.విద్యుత్ శాఖలో పదోన్నతులు కల్పించామని, ఖాళీలను పూర్తి చేయడానికి త్వరలో నియామక ప్రకటన వెల్లడిస్తామని తెలిపారు. ఎటువంటి విద్యుత్ ఫిర్యాదులకైనా 1912కి ఫోన్ చేయాలనీ ప్రజలను కోరారు. విద్యుత్ శాఖ ఉద్యోగస్తుల పిల్లల గురించి ఒక పథకాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు.

ఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ శాఖకు రూ.30 కోట్ల నష్టం వాటిల్లిందని, అర్ధరాత్రి సైతం లెక్క చేయకుండా నీళ్లల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేశామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు చాలా వరకు తగ్గించామని ఆయన అన్నారు. తండాలలో విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సిఎండి అన్నారు. ఓవర్ లోడ్ ఉన్న చోట 43% సామర్థ్యాన్ని పెంచామన్నారు. ప్రజల సమస్యలను, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి ఏర్పాటు చేశామని తెలిపారు. బ్రేక్ డౌన్‌లు నెలకొన్నప్పుడు వెంటనే పున్నరుద్ధరించడానికి రియల్ టైం డాటా అక్విజిషన్ ద్వారా సమాచారం వెంటనే సంబంధిత అధికారికి వెళుందని, వెంటనే పున్నరుద్ధరణ చర్యలు చేపడతారని అన్నారు.

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదల్లో ఆత్యంత ధైర్య సాహసాలతో విద్యుత్ సరఫరా అందించిన విద్యుత్ సిబ్బందిని అభినందించారు. విద్యుత్ వినియోగం అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. పంట పొలాల్లో వంగిపోయి ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని అన్నారు. ఎప్పుడు ఫోన్ చేసినా కింది స్థాయి సిబ్బంది స్పందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. లైన్‌మెన్‌ల పని తీరుపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. అనంతరం సిఎండి, భారీ వర్షాలకు అర్ధరాతి సైతం లెక్కచేయకుండా మెరుగైన సేవలు అందించిన అధికారులకు మెమెంటో, ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మాలోతు రాందాస్ నాయక్, ఇంఛార్జ్ డైరెక్టర్(హెచ్ఆర్‌డి) బి.అశోక్ కుమార్, ఇంఛార్జ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్) టి.సదర్‌లాల్, ఇంఛార్జ్ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.తిరుపతిరెడ్డి, ఇంఛార్జ్ డైరెక్టర్ ఆపరేషన్ టి.మధుసూదన్, సీజియంలు కె.రాజుచౌహాన్, కె.కిషన్, కె.ఎన్. గుట్ట, బికం సింగ్, సర్కిళ్ల ఎస్ఈలు పాల్గొన్నారు.



వరద బాధితులను ఆదుకోవాలి

- 10న అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతంలో వరద బాధితులను ఆదుకోవాలని, తాత్కాలిక నష్టం జరిగిన వారికి 3 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, పూర్తి నష్టం జరిగిన వారికి ఐదు లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. స్థానిక బీరప్ప టెంపుల్ దగ్గరలో సీపీఐ(ఎం), సీఐటీయు ఆధ్వర్యంలో వరద బాధితుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరదలు వచ్చి నెల రోజులు కావస్తున్నా ఇప్పటికీ నష్ట పరిహారం చెల్లించకపోవడం సరైనది కాదన్నారు. నష్ట పరిహారం చెల్లించేందుకు ఈనెల 10న అన్ని పార్టీలను కలుపుకుని రౌండ్ టేబుల్ సమావేశం కాలవ ఒడ్డులోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తుశాకుల లింగయ్య, శీలం వీరబాబు, కృష్ణ, సాయిలు, జెట్టి కృష్ణ, బీరప్ప, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

- నలుగురికి గాయాలు

నవతెలంగాణ- సత్తుపల్లి

గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న లారీ ఒకటి మున్సిపల్ కార్మికులను ఢీకొట్టిన ఘటన సత్తుపల్లిలో మంగళవారం ఉదయం జరిగింది. స్థానిక బాలాజీ థియేటర్ ఎదురుగా అశ్వారావుపేట వైపు వెళ్తున్న గ్రానైట్ రాళ్ల లారీ డివైడర్‌ను ఢీకొని పారిశుధ్య కార్మికుల ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పారిశుధ్య కార్మికులు ఇడుపులపాటి వెంకటేశ్వరరావు, వెంకటమ్మ జూనియర్ సీతమ్మ, మరియమ్మలకు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ఆసుపత్రికి చేరుకొని గాయపడిన పారిశుద్ధ కార్మికులను పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్ల బియ్యం దందా



ఖమ్మంరూరల్ టు కాకినాడ....!



- పేదల బియ్యం బొక్కుతున్న పంది కొక్కులు....!
- ప్రతి నెలా వేల క్వింటాళ్ల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు..!
- అధికారుల కనుసన్నలలోనే...?
- లబ్ధిదారులతో వేలిముద్రలు...?
- కిలోకి నాలుగు రూపాయల చొప్పున అందజేత...
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన డీలర్లపై కేసులు నిల్...?

> ప్రతి నెలా ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం ఖమ్మంరూరల్ మండలంలో పేదలకు బదులు పంది కొక్కుల పాలవుతున్నాయి. పేదలకు అందించాల్సిన బియ్యాన్ని అర్ధరాత్రి సమయాల్లో అడ్డదారిలో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అది కూడా ఈ ప్రాంతంలోకి కాదు సుమ.. ఖమ్మంరూరల్ నుండి కాకినాడ పోర్ట్‌కు జోరుగా అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రతి నెలా వేల క్వింటాళ్ల పేదల నోటికాడి బియ్యంతో రూ.లక్షలు పోగేసుకుంటున్నారు. గోదాంల నుండి వచ్చే బియ్యం బస్తాలను వేరే బస్తాల్లోకి తిరగగొట్టి లారీల్లో కాకినాడకు తరలిస్తున్నారు...ఇదంతా సాక్షాత్తు సివిల్ సప్లయ్ శాఖా అధికారుల కనున్నలలోనే జరుగుతుందన్నా ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.... ఖమ్మంరూరల్ నుండి కాకినాడకు తరలిస్తున్న బియ్యంపై లారీ లోడ్ల వారీగా సివిల్ సప్లయ్ శాఖా అధికారులకు డీలర్లు ముడుపులు అందించడంతోనే డీలర్లపై ఎలాంటి కేసులు ఉండవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలో 28 గ్రామ పంచాయతీలకుగాను మొత్తం 40 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వాటిలో 3,05,561 మంది లబ్దిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 3 లక్షలా 53వేల 267 క్వింటాల బియ్యం దుకాణాలకు వెళ్తుంది. ప్రతి నెల ప్రభుత్వం డీసీఎంహెచ్ గోదాంకు బియ్యం పంపించడం జరుగుతుంది. అట్టి బియ్యాన్ని గోదాంలనుండి లారీల ద్వారా గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు చేరవేస్తారు. కాని రేషన్ దుకాణంలో ఉన్న రేషన్ కార్డుల లబ్దిదారులకు మాత్రం అట్టి బియ్యం చేర్చకుండా సంబంధిత రేషన్ డీలర్లు దొడ్డిదారిన బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఖమ్మంరూరల్ టు కాకినాడ....!

మండలంలోని 40 రేషన్ దుకాణాలకు ప్రతి నెలా వచ్చే 3 లక్షలా 52 వేల 267 క్వింటాళ్ల బియ్యంలో సుమారు పదిశాతం బియ్యం మాత్రమే లబ్దిదారులకు చేరుతున్నాయి. మిగిలిన 90 శాతం బియ్యం లబ్దిదారులకు అందించకుండా డీలర్లు అర్ధరాత్రి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అది కూడా గోదాంల నుండి డీలర్ల షాపులకు తరలిన బియ్యం బస్తాలను తిరగగొట్టి వేరే బస్తాల ద్వారా లారీల్లోకి లోడ్ చేసి ఖమ్మంరూరల్ మండలం నుండి కాకినాడకు తరలిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ప్రధానంగా డీలర్లకు గోదాం నుండి షాపులకు వచ్చిన రెండు రోజులు మాత్రమే లబ్దిదారులకు బియ్యం అందించి అయిపోయాయని చేతులెత్తేస్తారు. అనంతరం ఉన్న బియ్యాన్ని లబ్దిదారులకు ఇవ్వకుడా వారితో వేలిముద్రలు వేయించుకుని బియ్యం బదులు వారికి కిలోకి రూ.4 చొప్పున డబ్బులు అందిస్తున్నారు. సుమారు ఓ రేషన్‌షాపుకు 150 క్వింటాల బియ్యం వస్తే అందులో 50 క్వింటాళ్ల బియ్యం లబ్దిదారులకు అందిస్తారు. మిగిలిన బియ్యం లబ్దిదారులకు ఇవ్వకుండా వారితో వేలిముద్ర వేయించుకుని కిలోకి రూ.4 రూపాయలు అందిస్తారు. అట్టి బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లో కిలో రూ.14 రూపాయల చొప్పున విక్రయిస్తారు. అప్పుడు కిలోకి రూ.10 చొప్పున క్వింటాకు రూ.వెయ్యి రూపాయలు మిగులుతాయి. ఈ చొప్పున వంద క్వింటాలకు రూ.లక్ష రూపాయలు మిగిలిచ్చుకుంటారు.ఈ విధంగా ప్రతి నెలా మండలంలో డీలర్ల నుండి 3 లక్షల క్వింటాళ్ల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రూ.30 కోట్లు రూపాయలను దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెల 10వ తేదీ లోపు బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి బియ్యం మొత్తం లబ్దిదారులకు అందించామని రికార్డులు సరి చేసుకుంటూరన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా ప్రతి నెల పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



సివిల్ సప్లయ్ శాఖ అధికారుల కనుసన్నలలోనే దందా....?

ఖమ్మంరూరల్ నుండి కాకినాడకు ప్రతినెలా డీలర్ల నుండి లక్షల క్వింటాళ్ల బియ్యం అర్ధరాత్రి సమయంలో బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నా సంబంధిత సివిల్ సప్లయ్ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నతలెత్తుంది. ఎందుకంటే ఈ బ్లాక్ మార్కెట్ బియ్యం దందా అంతా సంబంధిత శాఖాధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. డీలర్లు బ్లాక్ మార్కెట్ తరలించే బియ్యంకు సంబంధించి లారీ లోడ్ల వారీగా అధికారులకు మామూళ్ల ముట్టచెప్పడంతోనే ఈ దందాకు అడ్డు అదుపులేకుండా పోతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల అండదండలు ఉండటం మూలంగానే రూరల్ మండలంలో డీలర్లపై ఎలాంటి కేసులూ ఉండవనే విమర్శలున్నాయి. ఈ బ్లాక్ మార్కెట్ దందాపై కలెక్టర్ దృష్టి సారించి పేదల బియ్యం పేదలకు చెందెలా సివిల్ సప్లయ్ శాఖాధికారులు డీలర్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఈ విషయమై సివిల్ సప్లై డీటీ విజయ్‌బాబును వివరణ కోరగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

గంజాయి క్రయవిక్రయాల 'గుట్టురట్టు'

- 11మంది అరెస్టు: ఒక స్విఫ్ట్ డిజైర్ కారు, 2 మోటారుసైకిళ్లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం
- అమ్మినా, కొనుగోలు చేసినా పీడీ యాక్టు నమోదు చేస్తాం
- విలేకర్ల సమావేశంలో ఏసీపీ అనిశెట్టి రఘు

నవతెలంగాణ-సత్తుపల్లి



గంజాయి క్రయ, విక్రయాలపై సత్తుపల్లి పోలీసులు గుట్టురట్టు చేశారు. గత 20రోజులు కిందట గంజాయితో పట్టుబడిన వ్యక్తుల నుంచి ఇన్ని రోజులుగా కూపీ లాగిన పోలీసులకు 11మంది ద్వారా 82మంది గంజాయిని కొనుగోలు చేసి పీల్చుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ 82మందిలో 71మంది మేజర్లు కాగా 11మంది మైనర్లు ఉండటం బాధాకరం. గంజాయిని ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు, దానిని ఎవరెవరికి అమ్మారు, గంజాయికి రవాణాకు ఉపయోగించిన వాహనాలు, సమాచారం తెలుసుకొనేందుకు వాడిన సెల్‌ఫోన్లు తదితరాంశాల వివరాలను మంగళవారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ అనిశెట్టి రఘు విలేకర్లకు వివరించారు. ఏసీపీ రఘు తెలిపిన వివరాల ప్రకారం... 20రోజుల కిందట పాశం వెంకట శివరామకృష్ణ (కిష్టారం), కొమ్ము మనోవర్ధన్ (సత్తుపల్లి), ఆరుమళ్ల తరుణ్‌కుమార్ (నారాయణపురం, ప్రస్తుతం సత్తుపల్లి), వేల్పుల పుల్లారావు (సత్తుపల్లి) అనువారు ఏపీలోని చింతలపూడి మండలం, సీతానగరం గ్రామంలో ఓ మోటారుసైకిలును దొంగిలించి దానిపై ఆంధ్రా-ఒడిస్సా బోర్డరు ఆవులపాకలో ఉంటున్న భగవాన్ వద్దకు వెళ్లి 3కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన గంజాయిని వాళ్ల పీల్చడం, ఖర్చుల కోసం గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లలో పెట్టి రూ. 500లకు అమ్మడం లాంటివి చేపట్టారు. ఈ క్రమంలో కిష్టారంకు చెందిన కువ్వారపు దివాకర్ గంజాయిని పైన తెలిపిన వారివద్ద కొనుగోలు చేసి స్నేహితులకు అమ్ముతూ తెలిసిన వారిని శివరామకృష్ణ వద్దకు పంపడం జరుగుతోంది. ఈ క్రమంలో శివరామకృష్ణ తన వద్ద ఉన్న గంజాయిని తాళ్లమడకు చెందిన నున్నా నవీన్, సత్తుపల్లికి చెందిన వెలిశాల వినయ్ అనువారికి 500గ్రాములు (అరకేజీ) అమ్మడం జరిగింది. 10రోజుల తరువాత శివరామకృష్ణ (పండు), కొత్తపల్లి రత్నబాబు (జనార్ధనవరం-ఏలూరు జిల్లా), కువ్వారపు నితిన్‌కుమార్, కొమ్ము మనోవర్ధన్ (మను)-ద్వారకాపురి, సత్తుపల్లి), రామాల కార్తిక్ (నాని-కిష్టారం), పాలకుర్తి రాజేశ్(కిష్టారం), అనే వీరంతా ఒక స్విఫ్ట్ డిజైర్ కారును అద్దెకు తీసుకొని ఓడిస్సా బోర్డరులోని ఆవులపాకకు వెళ్లి అక్కడ ఉన్న భగవాన్ వద్ద నుంచి 4కిలోల గంజాయిని కొనుగోలు చేసి వస్తున్న క్రమంలో వాహనాల తనిఖీలు ఎక్కువగా ఉండటాన్ని గమనించి ఆ గంజాయిని భద్రాచలం దగ్గరలో దాచి వచ్చారు. ఈ దాచిన గంజాయిని గత నెల 6న కారు, మోటారు సైకిలుపై తీసుకొని వస్తుండగా సమాచారం మేరకు సత్తుపల్లి మండలంలోని మేడిశెట్టివారిపాలెం అడ్డరోడ్డు వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. వారి వద్దనుంచి 5కేజీల 845 గ్రాముల గంజాయితో పాటు ఒక స్విఫ్ట్ డిజైర్ కారు, 2 మోటారుసైకిళ్లు, 5 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీన పర్చుకున్నారు, కిలో గంజాయి ధర రూ.25వేల చొప్పున పట్టుబడిన గంజాయి ధర రూ. 1,46,125లు ఉంటుందని ఏసీపీ రఘు తెలిపారు. గంజాయి నిరోధక చట్టాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నేపధ్యంలో గంజాయిని కొనుగోలు చేసినా, అమ్మినా, పీల్చినా పీడీ యాక్టు నమోదు చేయడం జరుగుతుందని ఏసీపీ రఘు హెచ్చరించారు. గంజాయి క్రయ, విక్రయాల సమాచారాన్ని పోలీసులకు చేరవేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచడంతో పాటు రివార్డులు అందజేయడం జరుగుతుందని ఏసీపీ రఘు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ తెల్లబోయిన కిరణ్, వేంసూరు ఎస్సై ఎస్. వీరప్రసాద్ పాల్గొన్నారు.

గ్రానైట్ కార్మికుడి మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బబ్లూకుమార్ (36) కొంతకాలంగా వెంకటగిరిలోని ఓ గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు సోమవారం కటింగ్ మిషన్‌తో రాయిని కటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రాయి మీదపడి బబ్లూకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సంఘటనపై మృతుడి భార్య విమలాదేవి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

తల్లంపాడు శివారు నరసింహాపురం గ్రామానికి చెందిన ఉపేందర్, సుజాత దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఉపేందర్ పనికి వెళ్లడం లేదని ఆదివారం రాత్రి ఇంట్లో భార్యాభర్తలకు ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణతో మనస్తాపం చెందిన సుజాత సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

ఐకెపి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-వేంసూరు



తెలంగాణ అతిపెద్ద పండుగలో ఒకటి బతకమ్మ పండుగని, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రోత్సహించడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో పాటు కోలాటం బతకమ్మ ఆటలు ఆడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సోమిరెడ్డి వెల్ది జగన్మోహన్‌రావు, రాఘవరెడ్డి, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సమన్వయం లేకపోతే ఎలా?

- పైలాన్ ఆవిష్కరణ నిర్మాణ స్థలం విషయంలో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

నవతెలంగాణ - బోనకల్

పైలాన్ ఆవిష్కరణ నిర్మాణ స్థలంపై మీ మధ్య సమన్వయం లేకపోతే ఎలా అంటూ జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు గంటల నుంచి ఏం చేస్తున్నారంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని లక్ష్మీపురం రెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 401లో గల 25 ఎకరాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూలు స్థలాన్ని, పైలాన్ నిర్మించే స్థలాన్ని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ మంగళవారం పరిశీలించారు. తొలుత అధికారులు ఇంటిగ్రేటెడ్ నిర్మించే స్థలాన్ని కాకుండా ప్రైవేటు వ్యక్తుల స్థలాన్ని చూపించారు. అక్కడే జిల్లా కలెక్టర్ ఆర్అండ్‌బి ఎస్ఈ బి.హేమలత, ఈఈ జి.తానేశ్వర్, మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదే సమయంలో మరోచోటకు వెళ్దామని హేమలత, మండల తహసిల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఎక్కడకంటూ ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే స్థలానికి అంటూ సమాధానం చెప్పగా ఇప్పటివరకు చూసిన స్థలం ఎవరిది అంటూ తీవ్ర అసహనంతో ప్రశ్నించారు. ఇది పట్టా భూమిని సమాధానం చెప్పారు. దీంతో జిల్లా కలెక్టర్ తీవ్ర అసహనంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే స్థలం ఎక్కడ అంటూ అసహనం వ్యక్తం చేశారు. మరో కొద్ది దూరంలో ఉందని సమాధానం చెప్పారు. దీంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ మీరు వచ్చి మూడు గంటలు అవుతుంది అప్పటినుంచి మీరు ఏం చేస్తున్నారంటూ మందలించారు. మీ మధ్య సమన్వయం లేకపోతే ఎలా అంటూ మందలించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించే స్థలం దగ్గరకి వెళ్దాం పాండి అంటూ కిలోమీటర్ల దూరంలో గల ఇంటిగ్రేటెడ్ స్థలం నిర్మించే స్థలానికి వెళ్లారు. అక్కడ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 11వ తేదీన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పైలాన్ నిర్మాణ స్థలం, బహిరంగ సభ నిర్వహించే ప్రదేశాన్ని ఎస్ఈ, ఈఈలతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి ఏటూరి సోమశేఖర శర్మను అడిగి తెలుసుకున్నారు. దీంతో పైలాన్ నిర్మించే స్థలాన్ని వారు కలెక్టర్‌కి చూపించారు. దీంతో కలెక్టర్ పలు సూచనలు చేస్తూ వారికి ఆదేశాలు జారీ చేశారు. బహిరంగ సభ వేదిక తూర్పు వైపు ఉండే విధంగా నిర్మించాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా 500 మంది విద్యార్థులు వస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి ఏటూరి సోమశేఖర్ శర్మ కలెక్టర్‌కు వివరించారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ విద్యార్థులందరికీ, కార్యక్రమానికి వచ్చే వారందరికీ సరిపోయే విధంగా టెంట్లు వేయాలని వారిని ఆదేశించారు. శంకుస్థాపన జరిగే రోజు ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని వారిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ స్కూలును నిర్మిస్తున్నామని, ఇది బాలికలకా, బాలురుకా అనేది నిర్ణయం జరగలేదని ఆ తర్వాత ప్రభుత్వం నిర్ణయిస్తుందని తెలిపారు. ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉండే విధంగా ఈ నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన పనులు ప్రస్తుతం వేగవంతంగా జరుగుతున్నాయని శంకుస్థాపన అనంతరం మరింత వేగంగా నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు అని తెలిపారు. ఈనెల 11వ తేదీన డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్అండ్‌బి డిఈ గొంగడ శంకర్ రావు, ఎంపీడీవో మిట్టపల్లి రవికుమార్, ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య, మధిర విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌ల నిర్మాణాలెప్పుడు..?

- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- కళ్లేదుటే వృథాగా పోతున్న నీరు
- రైతుల ఆశలు అడియాశలు

నవతెలంగాణ-కల్లూరు



గత ప్రభుత్వం ఎన్నికల ముందు వృథాగా పోతున్న నీటిని వినియోగిస్తూ చివరి ఆయకట్టుకు సకాలంలో నీరు అందించేందుకు వాగులపై చెక్‌డ్యాములు నిర్మించాలని గత ప్రభుత్వం మండలంలో మూడు చెక్ డ్యాముల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి టెండర్లు పిలిచింది. ఇప్పుడు ఆ చెక్ డ్యాములు నిర్మిస్తారా లేదా అని రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

మండల పరిధిలోని యజ్ఞ నారాయణపురం గ్రామ సమీపంలోని పెద్దవాగుపై చెక్ డ్యామ్ నిర్మాణం కోసం సుమారు నాలుగు కోట్ల రూపాయలు గత ప్రభుత్వం 2023 ఆగస్టు నెలలో మంజూరు చేస్తూ నిర్మాణానికి అనుమతించింది. యజ్ఞ నారాయణపురం గ్రామం పుణ్యపూర్ మేజర్‌కు చివరి ఆయకట్టులో ఉంది. ప్రతి సంవత్సరం నాగార్జునసాగర్ జలాలు సకాలంలో అందక రైతులు పంటలు సక్రమంగా పండక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి సమీపంలో పెద్దవాగు ఉంది. ఈ వాగుకి వర్షాలు పడితే కల్లూరు నుండి వచ్చే వరద ఈ వాగు ద్వారానే నీరు పారుతుంది. వధాగా పోయే నీటిని సద్వినియోగం చేసుకునేందుకు చెక్ డ్యాం ఎంతగానో ఉపయోగపడుతుంది. పుణ్యపూర్ మేజర్ నుండి మైనర్ కాలవ సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవునా ఉండి యజ్ఞ నారాయణపురానికి సాగునీరు రావాల్సి ఉంటుంది. ఈ విధంగా మధిర బ్రాంచ్ కాలవ నుండి యజ్ఞ నారాయణపురానికి సాగునీరు సరఫరా కావాలంటే పుణ్యపూర్ మేజర్‌లో 5 కిలోమీటర్లు, మైనర్ కాలవ నాలుగు కిలోమీటర్లు ద్వారా సరఫరా అయితేనే సాగునీరు వస్తుంది. ఈ విధంగా సాగునీరు అందాలంటే సకాలంలో రాక పంటలు ఎండిపోతూ ఇబ్బందులు పడుతున్నారు. పెద్దవాగుపై చెక్ డ్యాం నిర్మించాలని ఎప్పటినుండో రైతులు ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకుపోతున్నారు. గత ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ప్రత్యేక కృషితో యజ్ఞనారాయణపురం పెద్దవాగు పై చెక్ డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి అనుమతి తీసుకొచ్చారు. దీంతో తమ చిరకాల సమస్య తీరిపోతుందని రైతులు ఆనందపడ్డారు. అప్పుడే టెండర్లు కూడా పిలిచారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పిలిచిన టెండర్లను తెరవక ముందే రద్దు చేసినట్లు ఆయకట్టు రైతులు అంటున్నారు. ఈ వాగుపై చెక్ డ్యాం నిర్మిస్తే లింగాల, చెన్నూరు గ్రామాలకు బ్యాక్ వాటర్ ద్వారా గ్రౌండ్ లెవెల్ లో భూగర్భ జలాలు పెంపొందించే అవకాశం ఉంటుంది. అదే విధంగా ఎత్తిపోతల పథకం పెడితే చెన్నూరుకు కూడా నీరు సరాఫరా చేసే అవకాశం ఉంటుందని, దాని ద్వారా చుట్టుపక్కల ఉన్న చెరువులు నింపుకోవడానికి అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే చెక్ డ్యాం నిర్మాణ పనులు చేపట్టాలని, పంటలు ఎండిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. అదే విధంగా మండలంలోని తాళ్లూరు వెంకటాపురం వాగు పైన రెండు కోట్ల రూపాయలతో చెక్ డ్యాం నిర్మాణానికి మంజూరు చేయించారు. పేరువంచ గ్రామంలో వాగుపైన చెక్ డ్యాం నిర్మాణానికి 1.86 కోట్లు మంజూరు చేయడం జరిగింది. కొత్త ప్రభుత్వం రావడంతో ఈ నిర్మాణాలన్నీ తాత్కాలికంగా నిలిచిపోయాయి.



చెక్ డ్యామ్ నిర్మాణం వెంటనే చేపట్టాలి
రైతు రావి సూర్యనారాయణ, యజ్ఞానారాయణపురం

పెద్దవాగుపై చెక్‌డ్యామ్ నిర్మించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి. సాగర్ జలాలు విడుదల చేసి పది రోజులు దాటుతున్నా నేటి వరకు మా గ్రామానికి సాగునీరు రాలేదు. పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయి. అదే చెక్ డ్యాం నిర్మిస్తే పంటలకు పుష్కలంగా నీరు లభిస్తుంది. ఆ దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టి సాగునీరు సరఫరా చేయాలి.

చెక్ డ్యాం నిర్మిస్తే 500 ఎకరాలకు మేలు
రైతు పువ్వాళ్ళ వెంకటేశ్వరరావు, యజ్ఞనారాయణ పురం



చెక్ డ్యాం నిర్మాణం వల్ల యజ్ఞ నారాయణపురం, చెన్నూరు, గ్రామాల్లోని ఆయకట్టు రైతులకు సుమారు 500 ఎకరాలు చివరాయకట్టుకి సాగునీరు అందించే అవకాశం ఉంటుంది. వెంటనే చెక్ డ్యాం నిర్మాణ పనులు చేపట్టి ప్రతి సంవత్సరం పంటలు ఎండిపోకుండా ఆదుకోవాలి.

ఐద్వా జిల్లా కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా మెరుగు రమణ, బండి పద్మ

నవతెలంగాణ-ఖమ్మం



అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఖమ్మం జిల్లా 12వ మహాసభ హవేలీలోని నాగార్జున ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ మహాసభలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మెరుగు రమణ, బండి పద్మ ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షురాలుగా మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, షేక్ మెహరున్నీసా బేగం గార్లు, సహాయ కార్యదర్శులుగా పయ్యావుల ప్రభావతి, పి.నాగసులోచన ఆఫీస్ బేరర్స్‌గా శీలం కరుణ, జొన్నలగడ్డ సునీత, పెండ్యాల సుమతి, బెల్లం లక్ష్మి, గుడిమెట్ల రజిత, కత్తుల అమరావతి ఎన్నికైనారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి హాజరై కమిటీ ఎన్నిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన మెరుగు రమణ, బండి పద్మ ఖమ్మం సుందరయ్య భవన్లో కమిటీ సభ్యులతో పాటు ఈ కింది తీర్మానాలను విడుదల చేశారు. మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, హింస, అరికట్టాలి. పసివయసు నుంచి పండు ముసలి వరకు మహిళల మీద ప్రతిరోజు అత్యాచారాలు జరుగుతున్నాయని, వీటికి మూలం మద్యం, డ్రగ్స్, సెక్స్ సాహిత్యం, సినిమాలు, పబ్బులు వీటిని ప్రభుత్వం నిషేధించాలని మహిళలకు రక్షణ కల్పించాలని హింసకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ తీర్మానంలో పేర్కొన్నారు.

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలి. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిన నేటికీ చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించలేదని మోడీ ప్రభుత్వం చట్టం చేశామని చెబుతున్న అమలుకు నోచుకోవడం లేదని వెంటనే మహిళా సాధికారతకు పార్లమెంటులో 33% రిజర్వేషన్ బిల్లును ఆమోదించింది. అమలు చేయాలని 12వ మహాసభ డిమాండ్ చేసింది. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి. బిజెపి అధికారంలోకి వచ్చాక డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సాధారణ ప్రజల మీద నిత్యావసర వస్తువుల రేట్లు అన్ని పెంచి భారం మోపిందని అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు 130 డాలర్ల నుండి 70 డాలర్లకు తగ్గినా, డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించడం లేదని వీటి ధరల పెరుగుదల వల్ల సాధారణ ప్రజలు నిత్యావసర వస్తువులను కొని తినలేక అనేక కుటుంబాలు అర్ధాకలితో, మహిళలు రక్తహీనత తోటి బాధపడుతున్నారని పెరుగుతున్న ధరలను నియంత్రించాలని 12వ మహాసభ తీర్మానం ఆమోదించింది.

ఎన్నికలకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మహాసభ మరో తీర్మానంలో పేర్కొన్నది. ఈ మహాసభలు అత్యంత ఉత్సాహపూరితంగా 250 మంది ప్రతినిధులతో జరిగింది. ప్రారంభానికి ముందు సంఘం సీనియర్ నాయకురాలు ఏలూరు జయమ్మ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంఘంలో పనిచేసి అమరులైన వారికి పూలమాలలు వేసి నివాళులర్పించి మహాసభను ప్రారంభించి కమిటీ ఎన్నిక వరకు దిగ్విజయంగా మహాసభను నిర్వహించారు.

దుర్గాదేవికి కుంకుమ పూజలు

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని అల్లీపూరం కొత్తగూడెం సీపీఐ కార్యాలయం ఎదుట దేవి నవరాత్రులను పురష్కరించుకుని మహిళలు కుంకుమ పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. కొత్తగూడెంలో గత 20 సంవత్సరాలుగా దేవి నవరాత్రులు, బతుకమ్మ, సంక్రాంతి, ముగ్గుల పోటీలు, క్రికెట్, కబడ్డీ తదితర ఆటల పోటీలు పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కుంకుమ పూజ సామగ్రి దాతలు భూమా సాయిచందు, తోట నవీన్, ఉపేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరారపు యశ్వంత్, లక్కా రోహిత్, దంతాల శ్రీకాంత్, షేక్ మాబు, భూమా రాంమూర్తి, తుపాకుల పేరమ్మ, మాకనబోయిన పార్వతి పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది పెండింగ్ బిల్లులు
మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంకు వినతి

నవతెలంగాణ-ఖమ్మం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పోలీస్ సిబ్బందికి గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న టిఏలు, డీఏలు, సరెండర్ లీవ్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీసు అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సూరిశెట్టి శ్రీనివాసరావు, ఎస్బిసిఐ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ ఏసోబు, జాయింట్ సెక్రెటరీ జానీమియా, ట్రెజరర్ కె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి దేవాలయంలో
ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-వైరాటౌన్

స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో ఖమ్మం నగరానికి చెందిన శ్రీ జయ విలాసిని డెవలపర్స్, కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే.రాంబాబు, విజయ దంపతులకు ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న బతుకమ్మ ఆట పాట కార్యక్రమంలో డాక్టర్ రాంబాబు దంపతులు బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు తిరుపతిరావు, తిరుపతి శ్రీనివాసరావు, గోవిందరావు దేవాలయ భక్తులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో
మధిర వారికి ప్రాధాన్యత



నవతెలంగాణ-మధిర

హైద్రాబాద్‌లో సోమవారం జరిగిన పీఆర్‌టియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో మధిర నుండి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా డీ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎస్.కె మదార్, రాష్ట్ర కార్యదర్శిగా టి.కృష్ణా రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు మండల శాఖ పక్షాన వారికి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణ రెడ్డి, పోలె సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.వి రవికుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మాజీ సర్పంచ్ శీలం కోటిరెడ్డికి పితృవియోగం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని రామానుజవరం మాజీ సర్పంచ్ సేలం కోటిరెడ్డి తండ్రి శీలం నాగిరెడ్డి(75) సోమవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు గోపాల్పేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్ రావు, పొన్నం కృష్ణయ్య, సీపీఐ(ఎం) నాయకులు పులి వెంకట నరసయ్య, కోసూరు వెంకటేశ్వర్లు, కందుల నారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మహా అన్నదాన కార్యక్రమంలో
పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-మధిర

పట్టణంలో 18వ డివిజన్లో దేవి ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్న ప్రసాదా వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ కోనాథని కుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పారుపల్లి విజయ్ కుమార్, మొండితోక కూడా సుధాకర్, రంగా శ్రీనివాసరావు, తన్నీరు రామకృష్ణ, సిద్ధంశెట్టి సందీప్, గుండె మెడ బాలాజీ, బాహటం శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ వైద్యుడు మృతి
నారాయణపురంలో విషాదం

నవతెలంగాణ-తల్లాడ

రెండు నిమిషాల్లో ఇంటికి చేరేలోపే ఓ గ్రామీణ వైద్యుడిని మృత్యువు కబళించింది. ఈ సంఘటన తల్లాడ రాష్ట్రీయ రహదారిపై ఆర్సీఎం చర్చి వద్ద, సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం, నారాయణపురం గ్రామంలో నివాసముండే గ్రామీణ వైద్యుడు బొగ్గుల కృష్ణారెడ్డి(42) తల్లాడలో వైద్య వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. క్లినిక్ బంద్ చేసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా, ఆర్సిఎం చర్చి వద్ద రాష్ట్రీయ రహదారిపై నుండి కుడి వైపునకు మలుపు తిప్పగా, నారాయణపురం వైపు నుండి తల్లాడ వస్తున్న యాక్టివా, గ్రామీణ వైద్యుడి ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో గ్రామీణ వైద్యుడు బొగ్గుల కృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వైద్యం కోసం ఖమ్మం హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. యాక్టివాపై ఉన్న పఠాన్ హుస్సేన్, గోపి గాయపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా రామన్నపాలెం నుండి, బతుకుతెరువు కోసం వచ్చిన బొగ్గుల కృష్ణారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో నారాయణపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుల వృత్తులకు ప్రోత్సాహం



- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- పాలేరు జలాశయంలో చేప పిల్లలు విడుదల

చెరువులు, కుంటల్లో చేప పిల్లలు విడుదల

నవతెలంగాణ -కూసుమంచి

ఇందిరమ్మ రాజ్యంలో కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా చేప పిల్లలను అనేక చెరువులు, కుంటలలో విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలో పర్యటించి, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మెన్ మువ్వా విజయ్ బాబు, తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి పాలేరు జలాశయంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... పాలేరు రిజర్వాయర్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక చెరువులు, కుంటలు, నీటి వనరులలో కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఉచితంగా చేప పిల్లలు విడుదల చేస్తున్నామని అన్నారు. జలాశయం సామర్థ్యం మేర మరో 5 లక్షల చేప పిల్లలు, రొయ్య పిల్లలు విడుదల చేయాలని స్థానిక మత్స్యకారులు కోరారని, వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలిస్తూ పూర్తి సామర్థ్యం మేర జలాశయంలో చేప పిల్లలు విడుదల చేస్తామని అన్నారు.

సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన వరదల్లో మత్స్యకారులు వినియోగించే వలలు, తెప్పలు కొట్టుకొని పోయాయని, మత్స్యకారులకు తీవ్ర నష్టం జరిగిందని, త్వరలోనే ప్రభుత్వం తరపున ఆదుకుంటామని అన్నారు. పేదల ముఖంలో నవ్వు చూడాలనేదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు కట్టిన రివాల్వింగ్ ఫండ్ విడుదల జరిగేలా చూస్తానని అన్నారు.

రేకుల షెడ్డుల్లో మహిళలు చేప పిల్లలు అమ్ముతున్నారని, హైవే పక్కన షాప్ పెట్టుకుంటామని కోరారని, దానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తానని మంత్రి హామీఇచ్చారు. వరదల కారణంగా దెబ్బతిన్న ఇండ్లకు కొంత పరిహారం అందించామని, నదీ ప్రవాహం సమీపంలో ఉన్న ప్రజలు



మరోచోట ఇల్లు కట్టుకుంటామని కోరారని, మరో చోట ఇండ్ల స్థలం అందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ... పాలేరు రిజర్వాయర్ 1700 హెక్టార్ల విస్తీర్ణంలో ఉందని, దీనిలో 7 లక్షల చేప పిల్లల విడుదల చేశామని అన్నారు. జలాశయంలో మరో 6 లక్షల చేప పిల్లలు విడుదల చేయాలని మంత్రి సంబంధిత అధికారులకు సూచించారని, చేప పిల్లలతో పాటు రొయ్యలు కూడా విడుదల చేస్తున్నామని అన్నారు.

అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జిలను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. రివాల్వింగ్ ఫండ్ అంశం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ గణేష్, మత్స్య శాఖ ఉప సంచాలకులు ఆర్.లక్ష్మీ నారాయణ, ఇన్‌చార్జి జిల్లా మత్స్య శాఖ అధికారి శివ ప్రసాద్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్య సంఘం ప్రతినిధులు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పారదర్శకంగా లబ్ది చేకూరుస్తున్నాం

కూసుమంచి : ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ పారదర్శకంగా లబ్ది చేకూర్చడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి/షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... పేద ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలను ఇందిరమ్మ రాజ్యంలో మరింత మెరుగ్గా అమలు చేస్తున్నామని అన్నారు. కూసుమంచి మండలంలో 40 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకం క్రింద ఒక్కో జంటకు లక్షా 116 రూపాయల చొప్పున మొత్తం 40 లక్షల 4 వేల 640 రూపాయలను పారదర్శకంగా అందజేశామని మంత్రి తెలిపారు. అదే విధంగా ఆపదలో ఉన్న 84 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద మొత్తం 26 లక్షల 58 వేల 500 రూపాయల చెక్కులను పంపిణీ చేశామని, అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ జి. గణేష్, కూసుమంచి మండల తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జల్లేపల్లి గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి

తిరుమలాయపాలెం : కుటుంబ కార్డు ద్వారా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం మండలంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి జల్లేపల్లి గ్రామంలో ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.20 లక్షల అంచనాతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని పొంగులేటి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జల్లేపల్లి గ్రామంలో పంచాయతీ సొంత భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషకరమని అన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

అక్టోబర్ నెలాఖరు నాటికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



చేస్తామన్నారు. కుటుంబ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. రూ. 2 లక్షల వరకు రుణాలు ఉన్న కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారు భయపడాల్సిన అవసరం లేదని, త్వరలోనే అర్హులందరికీ రుణమాఫీ సొమ్ము జమ చేస్తామని అన్నారు. అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో పంచాయతీ భవనం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన చోట నూతన భవనాలు మంజూరు చేస్తామని, పురోగతిలో ఉన్న భవనాలను మంత్రి సహకారంతో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం తిరుమలాయపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో 35 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం క్రింద ఒక్కో జంటకు లక్షా 116 రూపాయల చొప్పున మొత్తం 35 లక్షల 4 వేల 60 రూపాయలను అందజేశారు. అదే విధంగా మండలానికి చెందిన 48 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మొత్తం 17 లక్షల 28 వేల రూపాయల చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ గణేష్, తహశీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్ సాహెబు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి

- భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-కామేపల్లి

సీతారామ ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ మద్దులపల్లి శాఖ మహాసభ గుండా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ శాఖ సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారిన రైతాంగ సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తే ఖమ్మం జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు దొరుకుతాయని రైతులు రెండు పంటలు పండించుకోవచ్చని ఈ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలని గత పాలకులకు ప్రభుత్వాలకు వినతి పత్రాలు ఇచ్చినా కూడా చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. సీతారము ప్రాజెక్టు కాలువ భూనిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం నూతనశాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు. రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీనివాస్, కుందూరు వెంకటరెడ్డి, అడపా రామనాథం, సకినాల శ్రీనివాస్, కోఆపరేటివ్ డైరెక్టర్ పద్మ, రాజశేఖర్, అంగడాల సైదులు, లాల్యా తండ శాఖ కార్యదర్శి లావుడియా వీరన్న, శ్రీహరి, దుగ్గి అనంత రాములు, నాగేంద్రబాబు, అరం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) బలోపేతం కోసం కృషి చేస్తా..
సీపీఐ(ఎం) మద్దులపల్లి గ్రామ శాఖ
నూతన కార్యదర్శి అడప ఉపేందర్

సీపీఐ(ఎం) బలోపేతం కోసం కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం అని మద్దులపల్లి నూతన గ్రామ శాఖ కార్యదర్శి అడప ఉపేందర్ అన్నారు. మద్దులపల్లి గ్రామశాఖ తమను మూడోసారి ఏకగ్రీవంగా శాఖా కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు తాను బాధ్యతగా పనిచేస్తానన్నారు. పార్టీ సిద్ధాంతాలు తూచా తప్పకుండా పాటిస్తానన్నారు.



పేద ప్రజలకు అండగా ఉండేది సీపీఐ(ఎం)

- రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్

నవతెలంగాణ-ఖమ్మం

పేద ప్రజలకు అండగా ఉండేది సీపీఐ(ఎం) మాత్రమేనని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జిల్లా సెంటర్ ఆఫీసు శాఖ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం వర్కర్స్ శాఖ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా శాఖా మహాసభలకు హాజరైన యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ దేశంలో ఆకలి, దుర్భర దారిద్ర్యం, పేదరికం ఒక పక్క పెరుగుతుంటే అంబానీ, అదానీలకు కోట్ల రూపాయల ఆర్థిక సహాయం ప్రభుత్వం చేస్తుందని, పేదలను పట్టించుకోకుండా ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం జరుగుతుందని, దీని వలన దేశం విచ్ఛిన్నం జరిగే అవకాశం ఉందన్నారు. సీపీఐ(ఎం) నిరంతరం ఉద్యమిస్తూ, ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తూ, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. పార్టీ జిల్లా సెంటర్ శాఖలు జిల్లాలో వున్న పార్టీ శాఖలకు ఆదర్శంగా ఉండాలని కోరారు. నూతన శాఖా కార్యదర్శులుగా రమేష్, రాధాకృష్ణలు ఎన్నికయ్యారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, ఆర్.ప్రకాష్, సభ్యులు కె.వి.నవీన్, నాదెండ్ల శ్రీనివాస్, పగడాల నాగేశ్వరరావు, తుశాకుల లింగయ్య, పి.కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, ఆంజనేయులు, సందీప్, వీరభద్రం, వెంకటమ్మ, కోటేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముదాం శ్రీనివాసరావు
- భవన నిర్మాణ కార్మికుల భారీ ప్రదర్శన

నవతెలంగాణ-వేంసూరు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటానికి కార్మికుల సిద్ధంగా ఉండాలని భవన నిర్మాణ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ముద్దం శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు సీఐటియు ఆధ్వర్యంలో తమ సమస్యలపై చలో తహసీల్దార్ కార్యాలయం కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కేంద్రం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ ఎంఏ రాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముద్దం మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు లబ్ది చేకూరే ప్రమాద బీమా సహజ మరణ శాశ్వత



అంగవైకల్యం పొందిన కార్మికులకు అందజేసే బీమా ప్రైవేటు సంస్థలకు అప్పగించటం మూలంగా కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వీటిని అడ్డుకున్నందుకు కార్మికులు ఐక్యంగా పోరాటం చేయవలసిన సమయం వచ్చిందని అన్నారు. ఇప్పటికే వెల్ఫేర్ బోర్డు ద్వారా అందవలసిన సంక్షేమ పథకాలు కొన్ని నెలలుగా పెండింగ్లో ఉండటం ఆన్లైన్ పనిచేయకపోవడం మూలంగా అనేకమంది భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వాలను రెన్యువల్ చేసుకునే అవకాశం కోల్పోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు, జిల్లా నాయకులు మల్లూరు చంద్రశేఖర్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అరవపల్లి జగన్మోహన్రావు, మండల యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.





ఎర్ర రమేష్ ఆధ్వర్యంలో
30వ డివిజన్‌లో మహా అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా 30వ డివిజన్ సుందరయ్య నగర్‌లో మంగళవారం సుమారు 2000 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మహా అన్నదాన కార్యక్రమం దాత శ్రీ భవాని రియల్ ఎస్టేట్ అధినేత ఎర్ర రమేష్ సహకారాన్ని పూర్తిగా అందించినారు. ఎర్ర రమేష్ చేతుల మీదుగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ వారికి ఇక్కడ యువ కమిటీకి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, సీపీఐ ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి నూనె శశిధర్, సీపీఐ(ఎం) త్రీ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు షేక్ హిమామ్, రంగు హనుమంత చారి, ఎర్ర నగేష్, మద్ది శ్రీను, మహిళా సంఘం నాయకురాలు షేక్ కులసనా బేగం, రంగు పుష్పావతి, తంగేళ్లపల్లి బలరాం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-తల్లాడ

విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మిట్టపల్లి, కలకోడిమ గ్రామాలలో బుధవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ సుందర్ కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం కోరారు.

ఉపాధ్యాయ ఉద్యోగానికి 'చింతలచెరువు' ఎంపిక

- నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోనున్న నియామక ఆర్డర్

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోనే గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు చింతలచెరువు వెంకటనారాయణ కుమారుడు చింతలచెరువు నరసింహారావు ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దివ్యాంగుల కోటాలో నరసింహారావు ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యాడు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాదులో నియామక పత్రాలను అందజేయనున్నారు. అందులో చింతలచెరువు నరసింహారావు కూడా ముఖ్యమంత్రి నుంచి నియామక పత్రాన్ని అందుకోనున్నారు.

నరసింహారావుని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన నాయకులు మాదినేని వీరభద్రరావు, ఏడునూతల లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, తమ్మారపు లక్ష్మణ్, పొన్నం రాంబాబు, కోట కాటయ్య, నల్లమోతు వాణి, కళ్యాణపు శ్రీనివాసరావు, కళ్యాణపు బుచ్చియ్య వల్లం కొండ సురేష్, పుచ్చకాయల వలరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | అక్టోబర్ 09, 2024 | www.navatelangana.com

క్రీడాకారుడిని అభినందించిన బాడీ బిల్డింగ్ జిల్లా అధ్యక్షుడు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఇటీవల హైదరాబాద్‌లోని బాలానగర్లో జరిగిన రాష్ట్రస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో బంగారు పతకం సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు మహంతి వెంకట కృష్ణాజి, సుధా జ్యువెలర్స్ అధినేతని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు టి.వసంతరావు ప్రముఖ సీనియర్ న్యాయవాదులు అభినందించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ... గోవాలో ఈనెల 14 నుంచి 18 వరకు జరిగే జాతీయ స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో మహంతి వెంకట కృష్ణాజీ పాల్గొని బంగారు పతకం సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రానుపోను ఖర్చులకు రూ.5000 పారితోషకం అందించారు. గతంలో కూడా ఈ క్రీడాకారుడు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో కూడా పలుమార్లు పాల్గొని రాణించడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేసారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జీవి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారున్ని పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, పట్టణ ప్రముఖులు, రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, పట్టణ ప్రముఖ సంఘ సేవకుడు గాదె మాధవరెడ్డి, తదితరులు అభినందించారు.

ఏపీ ట్రైకార్ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు



నవతెలంగాణ-దమ్మపేట

ఆంధ్రప్రదేశ్ నూతన ట్రైకార్ చైర్మన్‌గా నియమితులైన బొరగం శ్రీనివాస్‌ను అశ్వారావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కాట్రం స్వామిదొర ఆధ్వర్యంలో మంగళవారం కలిశారు. బుట్టాయిగూడెం గ్రామంలోని శ్రీనివాస్ నివాసంలో అశ్వారావుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరఫున ఏపీ ట్రై కార్ చైర్మన్‌గా నియమితులైన బొరగం శ్రీనివాస్‌ని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట, అశ్వరావుపేట మండలాల టిడిపి పార్టీ అధ్యక్షులు ఎండి వలి పాషా, నార్లపాటి శ్రీనివాసరావు, దమ్మపేట సొసైటీ వైస్ చైర్మన్ కట్టం ఎర్రప్ప, ములకలపల్లి మాజీ ఎంపీపీ కేసరి లక్ష్మణరావు, టిడిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్



నవతెలంగాణ-జూలూరుపాడు

ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, హామీలకే ప్రభుత్వం పరిమితమైందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి యాస నరేష్ అన్నారు. మంగళవారం వెంగాన్నపాలెం గ్రామ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యాస నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, తక్షణమే రుణమాఫీ కానీ రైతులందరికీ నేరుగా ఎటువంటి ఆంక్షలు లేకుండా వారి ఖాతాలో రుణమాఫీలు వెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీలు పూర్తిస్థాయిలో అమలు కాక మహిళలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇండ్లు లేని వారికి ఇండ్లు ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రజలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం వెంగన్నపాలెం గ్రామ శాఖ సెక్రెటరీగా బొల్లు లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి, కడియాల సత్యనారాయణ, లక్ష్మయ్య డి.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తోగ్గూడెంలో అక్రమ క్వారీలు నిలిపి వేయాలని వినతి

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

తోగ్గూడెం ఏజెన్సీ ప్రాంతంలో రాజ్యాంగం కల్పించిన గిరిజన చట్టాలు అపహాస్యమవుతున్నాయని సేవాలాల్ సేన అభ్యంతరం వ్యక్తం చేసింది. మంగళవారం సేవాలాల్ సేన మండలాధ్యక్షుడు జర్పుల పరమేష్ నేతృత్వంలో నాయకులు మండల పంచాయతీ అధికారి బొగ్గ నారాయణకు సమస్యలతో కూడిన వినతి పత్రం ఎంపీడీఓకు అందించారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. తోగూడెంలో కొద్దిమంది గిరిజనులను మచ్చిక చేసుకున్న గిరిజనేతరులు క్వారీల ఏర్పాటుతో కోట్ల వ్యాపారం నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనుమతి లేని క్వారీలతో నిత్యం వ్యాపారం చేస్తున్నా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్రకు పరిమితమవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఎన్ని క్వారీలకు గ్రామపంచాయతీ తీర్మానాలు ఇచ్చిందో, వివరాలు తెలపాలని కార్యదర్శి, ఎంపీఓలకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివ నాయక్, శ్రీను నాయక్, రమేష్ నాయక్, సంతోష్‌లు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌గా పత్రికా విలేఖరి శ్రీను సెలెక్ట్

- అభినందనల వెల్లువ



నవతెలంగాణ-ఇల్లందు

మన తెలంగాణ టౌన్ రిపోర్టర్, పట్టణంలోని మార్గదర్శిని ప్రియదర్శిని పాఠశాలలో గత 25 ఏళ్లుగా మ్యాథమెటిక్స్ టీచర్‌గా పనిచేస్తున్న కుంచాల శ్రీను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టీచర్ పోస్టుల డీఎస్సీ పరీక్ష నిర్వహణలో మ్యాథమెటిక్స్ విభాగంలో జిల్లా 12వ ర్యాంకు సాధించి మ్యాథమెటిక్స్ స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా సెలెక్ట్ అయ్యారు. బుధవారం హైదరాబాదులో సీఎం చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రం అందుకోనున్నారు. ఈ సందర్భంగా కుంచాల శ్రీనుకు అభినందనలు వెలువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ డీవి, పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు, పట్టణ పుర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. శుభ సందర్భంగా తోటి ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల బృందం శ్రీనుకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

12న పామాయిల్ సాగుపై అవగాహనా సదస్సు

- విజయవంతం చేయండి : టీజీ ఆయిల్ ఫెడ్



నవతెలంగాణ-అశ్వారావుపేట

తెలంగాణ ఆయిల్ఫెడ్ ఆధ్వర్యంలో నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో నిర్వహిస్తున్న పామాయిల్ పరిశ్రమలో రూ.30 కోట్లు వ్యయంతో నూతనంగా నిర్మించిన 2.5 మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఈ నెల 12వ తేదీన ప్రారంభిస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న పామాయిల్ సాగు పై అవగాహనా సదస్సుకు ఆయిల్ ఫాం సాగు దారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టీజీ ఆయిల్ ఫెడ్ రాష్ట్ర కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనను ఆయిల్ఫెడ్ డీవో బాలక్రిష్ణ అశ్వారావుపేటలో బహిరంగ పరిచారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభోత్సవం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన, రాష్ట్ర వ్యవసాయ, కో- ఆపరేషన్స్, హేండ్లూం, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చే నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం పరిశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక పై పామ్ ఆయిల్ సాగు దారులకు (రైతులకు) పామ్ ఆయిల్ సాగు పై ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ ఫాం రీసెర్చ్ (ఐఐఓపీఆర్) శాస్త్రవేత్తలు, ఉద్యాన శాస్త్రవేత్తలు చే అవగాహన సదస్సు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, టీజీ ఆయిల్ ఫెడ్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషాలు పాల్గొంటున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఆయిల్ పామ్ కంపెనీలు, పామ్ ఆయిల్ రైతులతో పాటు ఆంధ్రప్రదేశ్ పామాయిల్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆయిల్ పామ్ రైతులు పాల్గొంటున్నందున రైతు సోదరులు, పుర ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమంను జయప్రదం చేయాలని టీజీ ఆయిల్ఫెడ్ పిలుపునిచ్చింది.

సుకుమా అడవుల్లో ఎదురుకాల్పులు

- మావోయిస్టు మృతి



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్గఢ్ సుక్మా జిల్లా గల భెజ్జీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పామలూరు గ్రామంలోని జంగిల్-హిల్‌లో పోలీసు-మావోయిస్టుల నడుమ జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. 6/10/2024న భెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు కొంట, కిస్టారం ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారనే సమాచారంతో డీఆర్‌జీ బస్తర్ ఫైటర్, 206 కోబ్రా, 208 కోబ్రా, 131 సిఆర్పిఎఫ్ 212 సిఆర్పిఎఫ్ జాయింట్ పార్టీ దబ్బక్కకొండ గ్రామాలకు చేరుకుంది. పాములూరు, సింఘనమడ్గు, నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కోసం సమీప ప్రాంతానికి బయలు దేరారు. ప్రచారం సందర్భంగా సోమవారం సాయంత్రం పామలూరు గ్రామ అటవీ-కొండలో పోలీసు-మావోయిస్టు ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక మగ మావోయిస్టు మృతదేహంతో పాటు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు మృతదేహాన్ని గుర్తించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఘటన జరిగిన ప్రాంతం చుట్టూ భద్రతా దళాల సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది.

కిన్నెర పర్యాటక ప్రాంతంలో సౌకర్యాలు మెరుగుపరచాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ రూరల్

కిన్నెరసాని పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. మంగళవారం కిన్నెరసాని అభయారణ్యాన్ని సందర్శించారు. ప్రాజెక్ట్ పార్కు నందు చేయవలసిన అభివృద్ధి పనులు, పర్యాటకులకు కల్పించవలసిన సౌకర్యాలపై కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పార్కు నందు పిల్లలు ఆడుకోవడానికి జారుడు బండ, వెదురుతో నీడ సౌకర్యం, పరిసల్ బోటింగ్, బాత్రూంల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. పర్యాటకులకు భోజనాలు చేయటానికి కోతుల బెడద లేకుండా షెడ్ చుట్టూ మెస్ ఏర్పాటు చేయాలని సూచించారు. డ్వాక్రా సంఘాల ద్వారా క్యాంటీన్ ఏర్పాటు చేసి తక్కువ ఖర్చుతో స్నాక్స్, టిఫిన్లు, భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా వెలగ, మారేడు, కరక్కాయ, మేడి, అల్లనేరేడు, బంక నక్కేరు తాండ్ర వంటి మొక్కలు వరుస క్రమంలో నాటించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పెరుకులేషన్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన పూర్తి ప్రతిపాదనలు వారం రోజులలో పంపాలని అటవీ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పరిధి పలు సంక్షేమ వసతి గృహాలను సందర్శించారు. అధికారులకు తమ సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి, తహసీల్దార్ జి.వివేక్, ఎంపీఓ నారాయణ, ఏఈ సురేష్, సెక్షన్ ఆఫీసర్ కిషన్, ఏపీవో పోరండ్ల రంగా, ఆర్ఐ హచ్చు, కార్యదర్శి శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో 38 ఖాళీలు

- విద్యార్థుల నుండి దరఖాస్తుల ఆహ్వానం
- ఐటీడీఏ పీఓ బి.రాహుల్



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

2024-25 విద్యా సంవత్సరంనకు గాను బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మాత్రమే చెందిన అర్హులైన 06, 07, 08, 09వ తరగతి గిరిజన విద్యార్థినీ, విద్యార్థులను నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి దరఖాస్తులకు విద్యార్థుల కులం, నివాసం, ధ్రువీకరణ, తల్లిదండ్రుల ఆదాయం మీ సేవ ద్వారా జారీ అయిన ధ్రువీకరణ పత్రములు జతపరిచి ఈనెల 20వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు ఉపసంచాలకులు గిరిజన సంక్షేమ శాఖ ఐటిడిఏ భద్రాచలం కార్యాలయం నందు సమర్పించాలని ఆయన అన్నారు. మొత్తం 38 ఖాళీ అయిన సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, 06వ తరగతిలో 21, 07వ తరగతిలో 07, 8వ తరగతిలో 08, 9వ తరగతిలో 02 సీట్లు ఖాళీగా ఉన్నవని అన్నారు. ఇట్టి ప్రవేశములకు ఎంపిక లాటరీ పద్ధతిలో ఈనెల 22వ తేదీ నాడు ప్రాజెక్టు అధికారి ఐటీడీఏ భద్రాచలం కార్యాలయం నందు ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలుపుతూ మరిన్ని వివరములకు ఉపసంచాలకులు గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ భద్రాచలం కార్యాలయం నందు కార్యాలయం పని వేళలు నందు సంప్రదించాలని ఆయన అన్నారు.

కేటీపీఎస్ బొగ్గు వ్యాగిన్‌లో మృతదేహం లభ్యం



నవతెలంగాణ-పాల్వంచ

కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) 5, 6 దశలకు బొగ్గు సరఫరా చేస్తున్న వ్యాగన్‌లో మృతదేహం ప్రత్యక్షమైంది. వివరాల్లోకి వెళితే రుద్రంపూర్ నుంచి కేటీపీఎస్‌కు బొగ్గు సరఫరా జరిగింది. మంగళవారం తెల్లవారు జామున బొగ్గు వ్యాగన్ కేటీపీఎస్ 5, 6 దశలకు చేరుకుంది. విధుల్లో ఉన్న సిబ్బంది బొగ్గును గ్రిడ్డు వద్ద దిగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో బొగ్గు గడ్డ నుంచి పడకుండా ఉండటంతో గ్రిడ్డును క్లీన్ చేస్తున్న క్రమంలో మనిషి చేయి కనబడింది. ఈ విషయాన్ని సిబ్బంది అధికారులకు తెలియజేశారు. సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని చూడగా బొగ్గుతోపాటు శవం వచ్చినట్లు గుర్తించారు. విషయాన్ని ఎస్పీఎఫ్ పోలీసులకు, సెవిల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పట్టణ ఎస్ఐ సుమన్ గ్రిడ్ ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా, సుజాతనగర్ మండలం సీతంపేటకు చెందిన గుగులోతు రమేష్‌గా మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం శవపరీక్ష నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిగా తరలించి, కేసు నమోదు తయారు చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- రూ.5.78కోట్ల రుణాలు పంపిణీ



నవతెలంగాణ-దమ్మపేట

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం టీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల ఆవరణంలో ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం సహాయక బృందాలకు మంజూరు చేసిన నిధుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జారే హాజరై మాట్లాడారు. ముందుగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా నియోజకవర్గ మహిళలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని 57 గ్రామాలలో ఉన్న 1333 స్వయం సహాయక బృందాలకు ముందుగా మంజూరైన మీసేవ సెంటర్లు, పాడి పరిశ్రమ, మహిళలకు కుట్టు మిషన్లు, పెరటి కోళ్ల పెంపకం, మైక్రో ఎంటర్ప్రైజెస్, చేపల పెంపకం, ఫుడ్ కోర్ట్, అమ్మ ఆదర్శ పాఠశాలలు మొదలగు యూనిట్‌లకు మంజూరైన రూ.5.78 కోట్లకు సంబంధించిన చెక్కును సంబంధిత సంఘాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని స్వయం సహాయక బృందాలకు బ్యాంక్ లింకేజ్ ద్వారా ప్రభుత్వం రూ.30 కోట్ల రూపాయలు కేటాయించిందని ప్రతి స్వయం సహాయక బృందాల అభివృద్ధికి ఈ నిధులు కేటాయించటం జరుగుతుందని అన్నారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం అవ్వాలని, ఈ నిధులు సక్రమంగా వినియోగించుకుని మంచి గుర్తింపు తెచ్చుకుంటే తన నిధుల నుంచి మరొక రూ.1కోటి రూపాయలు అదనంగా స్వయం సహాయక బృందాల అభివృద్ధికి అందిస్తానని జారె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, అధికారులు, స్వయం సహాయక బృందాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు వితరణ



నవతెలంగాణ-చర్ల

మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం వ్యవస్థపకులు డాక్టర్ డీఎస్ కుమార్ సారధ్యంలో ఆయన కుమారులు స్వర్గీయ రాహుల్ జయంతి సందర్భంగా మండలంలోని మారుముల గిరిజన గ్రామం అయిన రామచంద్ర పురంలోని 34 కుటుంబాలకు రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం అధ్యాపక బృందం మంగళవారం సుమారు రూ.90 వేల విలువ చేసే నిత్యావసర సరుకులయిన మంచినూనె, కందిపప్పు తదితర వస్తువులతో పాటు కూరగాయలను, దుస్తులను, చీరలను, దుప్పట్లను, చెప్పులను వితరణ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం ప్రధానోపాధ్యాయులు వర్మ రాజు మాట్లాడుతూ రాహుల్ విద్యాలయం వ్యవస్థాపకులు డా.డీఎస్ కుమార్, డా.ప్రతిభ దంపతుల కుమారుడు రాహుల్ జయంతి రోజు ఈ వితరణ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. వర్షాలు విపరీతంగా రావడంతో రామచంద్రపురం గ్రామస్తులు దాదాపు నెలరోజుల పాటు వారి గ్రామానికే పరిమితం అయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిసిన వెంటనే చలించిపోయి ఆ గ్రామస్తులకు మన వంతుగా సహాయం చేయాలని డా.కుమార్ చెప్పటంతో ఆయనతో పాటు మా ఉపాధ్యాయ బృందం, మా విద్యార్థులు అందరూ సహకరించడంతోనే ఈ కార్యక్రమం విజయవంతం అయిందని అన్నారు. కాగా గత నెలలో సైతం రాహుల్ విద్యాలయం ఖమ్మం వరద బాధితులకు లక్ష రూపాయలు వితరణ ఇవ్వడం తెలిసినదే. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ఉపాధ్యాయ బందంను, సహకరించిన విద్యార్థులను రాహుల్ విద్యాలయం వ్యవస్థాపకులు డాక్టర్ డీఎస్ కుమార్, డాక్టర్ ప్రతిభలతో పాటు ఎడ్యుకేషనల్ డైరెక్టర్ టివీపీసీ శాస్త్రి, తల్లిదండ్రులు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం ఉప ప్రాధనోపాధ్యాయులు ఎం.వి.ఎల్.ఎన్. నరసింహారావు, గుమ్మడి భారతి, ఉపాధ్యాయులు గురజాల రామారావు, బిట్రగుంట క్రాంతి కుమార్, షేక్ ఉస్మాన్, కొంగూరి ప్రదీప్, మీసాల మాధురి, ఇనప్కోళ్ల శ్రావణి, ఆనంద్, తిరుమల రావు, హరి ప్రసాద్, మడకం చందు, అమీనా,మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రకటించారు. మణుగూరు లారీ యూనియన్ కార్యాలయంలో పూజలు నిర్వహించారు. లారీ ఓనర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. అనంతరం సభ్యుల పేర్లను ప్రకటించారు. గౌరవాధ్యక్షులు పెంట్యాల దశరథం, అధ్యక్షులు మల్లేటి బాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మేరెడ్డి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.నాగేశ్వరావు, ఎస్.ఆర్.కె.రాము, సహాయ కార్యదర్శి అడప స్వామి (తాతబ్బాయి) కె.వెంకట సోములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జె.వెంకన్న, బాబు, బి.భాస్కర్, కోశాధికారి పిన్నపురెడ్డి జైపాల్ రెడ్డి, కమిటీ సభ్యులుగా తూపూడి గోవిందు, జి.మురళీకృష్ణ, ఉప్పలయ్య, ఎం.శ్రీను, ఎస్.సంజీవ రెడ్డి, ఎం.రాజు, ఆర్.వి.ఎం చావా అచ్యుత్ రావు, చిగురుపాటి నాగేశ్వరరావు, వి.సాయి, ఆడిట్ కమిటీ సభ్యులుగా పి.నరేష్ రెడ్డి, టీ.శాంతి కుమార్, రిజ్వాన్ నూతన కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించి అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిరినకి నవీన్, లారీ ఓనర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణంలో జరిగే ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా పట్టణ కార్యదర్శి సందకూరి లక్ష్మి కోరారు. మంగళవారం భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని, గొల్లగూడెంలో ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ అందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేసి బతుకమ్మ ఆటలు పూర్వకాలంలో అన్ని రకాల పూలతో ఆడే వారన్నారు. తంగేడు పువ్వు, గొబ్బి పూలు, మందార పూలు అన్ని రకాల పూలతో అందరూ కలిసిమెలిసి ఉండే విధంగా ఆటలు ఆడుతూ పాటల పాడుతూ ఎంతో ఆహ్లాదంగా ఈ బతుకమ్మ ఆటలు ఆడేవారని తెలిపారు. పండుగకు వారం రోజులు ముందు చుట్టాలు, కొత్త అల్లుళ్ళు ఎంతో ఆనందంగా పండగను జరుపుకునే వారు ఇప్పుడు అలాంటివన్నీ అంతరించిపోతున్నాయని ఆవేద వ్యక్తం చేశారు. కాగిత పూలతో బతుకమ్మలాడుతూ బతుకమ్మల పేర్లతో ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రభుత్వాల విధానపై, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు భవిష్యత్తు కార్యాచరణను ఈ నెల 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెం క్లబ్‌లో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఆ మహాసభల్లో అనేక రకాల సమస్యలపై గుర్తించి కార్యాచరణ రేపటి ఉద్యమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా టౌన్ అధ్యక్షులు అన్నవరపు ఇందిరా, జే.శ్రీలక్ష్మీ శైలజ, సునీత, దుర్గమ్మ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తులసమ్మ చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

- సీపీఐ (ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మారుమూల గిరిజన గ్రామాల రైతాంగానికి వరప్రదాయిని అయినటువంటి తులసమ్మ చెరువుకు నిధులు కేటాయించి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పౌల్లూరిపేట గ్రామంలో పార్టీ 12వ శాఖా మహాసభ దుమ్ముగూడెం పీఏసీఎస్ డైరెక్టర్ ఉబ్బా భద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. మహాసభలో పాల్గొన్న పుల్లయ్య పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తులసమ్మ చెరువు మరమ్మతులు చేపడితే పౌల్లూరిపేట, గంగవరం, కొత్త నారాయణరావుపేట గ్రామాలకు చెందిన ఆదివాసీ రైతులకు సాగునీరు అందుతుందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని అయన డిమాండ్ చేశారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు ఉచితంగా త్రీఫేస్ విద్యుత్ భద్రాచలం ఐటీడీఏ ద్వారా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే కొంతమంది పట్టా భూములలో వ్యవసాయ బోర్లు దింపి త్రీఫేస్ కరెంటు కోసం డీడీలు తీయడం జరిగిందని వారికి కూడా ఉచితంగా త్రీఫేస్ విద్యుత్ అందజేయాలన్నారు. అనేక సంవత్సరాల నుండి కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు రావడంలేదని వారందరికీ వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ మహాసభలో నూతన శాఖ కార్యదర్శిగా మడివి అర్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరియం ప్రసాద్, సీతారామయ్య, సుబ్బయ్య మాజీ వార్డ్ సభ్యులు ఉబ్బా రాజులు, నాగేశ్వరరావు, రాజబాబు, సరియం వెంకటేశ్వర్లు, రామారావు, మడకం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు మహిళలకు ముందస్తు వెసులు బాటు కల్పించాలి



నవతెలంగాణ-మణుగూరు

ఈ నెల 10వ తేదీన భద్రాద్రి స్టేడియం నందు సింగరేణి యాజమాన్యం నిర్వహించే సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు ఏరియా నందు వివిధ గనుల, డిపార్ట్ మెంట్‌లలో మహిళా ఉద్యోగులకు, మహిళా కార్మికులకు సద్దుల బతుకమ్మకు ముందస్తు వెసులు బాటు కల్పించాలని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి తెలిపారు. మంగళవారం యస్ఓ టూ జీఎం శ్యామ్ సుందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. తెలంగాణలో మహిళలందరూ అత్యంత గొప్పగా చేసుకునే పెద్ద పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మస్తాన్, మునిగేల నాగేశ్వర రావు, వినయ్ కుమార్, బత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ ఏఈఈగా రాకేశ్ చౌదరి



నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట ఆర్అండ్‌బీ ఏఈఈగా మన్నిని రాకేశ్ చౌదరి విధుల్లో చేరారు. టీజీ పీఎస్సీ ఇటీవల చేపట్టిన ప్రభుత్వం ఉద్యోగ నియామకాల్లో ఖమ్మం జిల్లా వేంసూరు మండలం తుంబూరుకు చెందిన రాకేశ్ చౌదరి ఆర్అండ్‌బీ శాఖలో ఉద్యోగం సాధించారు. నూతనంగా ఉద్యోగం చేరిన ఈయన మొదటి పోస్టింగ్‌ను ఆర్అండ్‌బీ అశ్వారావుపేట సబ్ డివిజన్‌లో అశ్వారావుపేటలోని డివిజనల్ కార్యాలయంలో మంగళవారం డీఈఈ శ్రీనివాస్ సమక్షంలో విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఈ పోస్ట్‌లో ఏఈఈ గణేష్ అదనపు బాధ్యతలు చేస్తున్నారు.

భక్తులకు చీరెలు పంపిణీ

జూలూరుపాడు : జూలూరుపాడు న్యూ కాలనీలో బతకమ్మ పండుగ జరుపుకుంటున్న భక్తులకు చీరెలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల కమిటీ, జిల్లా నాయకులు వేలంగి తిరపతి, మండల అధ్యక్షులు బుడిపూడి ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు రామారావు, మండలవర్కింగ్ ప్రెసిడెంట్ బుడిపూడి ప్రతాప్, మండల గౌరవ అధ్యక్షులు పనితి వెంకటేశ్వర్లు, మండల సహాయ కార్యదర్శి వేలంగి సుందర్రావు, మండల కో కన్వీనర్ పత్తిపాటి యోహాను, మండల కమిటీ సభ్యులు తొగరి నాగయ్య,. దర్శనాల రామకృష్ణ, దర్శనాల నరేష్, దర్శనాలు నాగేశ్వరరావు, దర్శనాలు రాము, తదితరులు పాల్గొన్నారు.

టీజీఎన్‌పీడీసీఎల్ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-దమ్మపేట

ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రివర్యులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అధ్యక్షతన ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విద్యుత్ శాఖ రివ్యూ మీటింగ్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు విద్యుత్ అధికారులతో కలిసి అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గం వ్యవసాయ ఆధారిత నియోజకవర్గం అయినందున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురైనప్పుడు ఖమ్మం లేదా కొత్తగూడెం తీసుకు వెళ్ళవలసి వస్తుందని అందువల్ల రైతులపై ఆర్థిక భారం పడటంతో పాటు కొన్ని కొన్ని సందర్భాలలో మరమ్మతులు ఆలస్యం అవుతున్నందున పంటకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని అన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోనే ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులు చేసే విధంగా కృషి చేయాలని, ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా పలుచోట్ల సిబ్బంది కొరత ఉండి చిన్న చిన్న సమస్యలు వస్తున్నాయని వాటిని అధిగమించాలంటే పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి తెలియజేస్తూ జారె వినతి పత్రం అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | అక్టోబర్ 09, 2024 | www.navatelangana.com

సాధన చేయడం ద్వారా మంచి ఫలితాలు

- రీజినల్ స్థాయి సాంస్కృతిక పోటీల ప్రారంభ కార్యక్రమంలో జీఎం



నవతెలంగాణ-ఇల్లందు

ప్రతి మనిషిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, ఆ కళను గుర్తించి సాధన చేయడం ద్వారా మంచి ఫలితాలు పొంద వచ్చునని జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ అన్నారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మంగళవారం రీజినల్ స్థాయి సాంస్కృతిక (మణుగూరు, ఇల్లందు ఏరియా) పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండలను సైతం కరిగించే శక్తి ఒక పాటకు మాత్రమే ఉందని, ప్రతేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి పాటలు ఎంతో సహాయ పడినవని, మంచి సంగీతం మన మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని అన్నారు. చాలా మందికి ఉదయం లేవగానే మూడ్ ఆఫ్‌గా ఉంటారు. వీటన్నింటిని దూరం చేయడానికి ప్రకాశవంతంమైన రోజుని ప్రారంభించడానికి సంగీతం సహాయపడుతుందన్నారు. సానుకూల పాటలు, అంత సూక్ష్మమైన సంగీతం అన్నీ డోపమైన్ హార్మోన్‌ను పెంచుతాయన్నారు. ఈ హార్మోన్ మనలో ఆనందాన్ని నింపుతుంది. కొంతమందికి, 'ప్రేరణాత్మక' సంగీతాన్ని వినడం జీవితంలో వారికి మరింత ప్రేరణనిస్తుంది. ఇది కూడా మంచి పద్ధతి. ఆందోళన, ఒత్తిడిని తగ్గించడంలో సంగీతం కూడా గొప్పగా సహాయపడుతుంది. అలాగే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. సంగీతం ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ను తగ్గిస్తుంది. సంతోషం హార్మోన్ డోపమైన్‌ను పెంచుతుంది. ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఈ క్రీడలను నిర్వహిస్తుందని యువ ఉద్యోగులు క్రీడలతో సాంస్కృతిక కార్యక్రమాలలో మక్కువ చూపి క్రీడలలో రాణించి ఇల్లందు ఏరియాకు మంచి పేరును తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజిఎం పర్సనల్ జీవీ మోహన్ రావు, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రతినిధ్య సంఘం తరుపున అన్వర్, క్రీడల గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, క్రీడల సమన్వయకర్త రమేష్ సింగ్ ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-ఇల్లందు



సింగరేణి పాఠశాల ఆవరణలో సింగరేణి సేవా సమితి సభ్యులు, ఉద్యోగుల కుటుంబాల మహిళలకు బతుకమ్మ-ఆట పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పండుగా తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అన్నారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మ పండుగ అన్నారు. అదే విధంగా ఈ నెల 10వ తేదిన సింగరేణి యాజమాన్యం జేకే కాలనీ గ్రౌండ్ నందు నిర్వహించే బతుకమ్మ సంబరాలు కార్యక్రమానికి సింగరేణి సేవా సమితి సభ్యులు, ఉద్యోగుల కుటుంబాల మహిళలు, పట్టణ ప్రాంత మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జివి మోహన్ రావు, సేవా జాయింట్ సెక్రటరీ సులక్షణ, సీనియర్ పర్సనల్ అధికారి కె.సాయి స్వరూప్, సేవా సమితి సభ్యులు సాంబయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్లుగా జిల్లా అథ్లెట్లు

- 23 పతకాలు గెలుపొందిన క్రీడాకారులు

నవతెలంగాణ-కొత్తగూడెం



తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హన్మకొండ, జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీలలో జరిగిన 10వ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు 30 మంది పాల్గొని మొత్తం 23 పతకాలు సాధించారని, ఇందులో 7 బంగారు పతకాలు, 10 రజిత పతకాలు, 6 కాంశ్య పతకాలు, 53 పాయింట్లుతో ఓవరాల్ చంపియన్షిప్ సాధించి తెలంగాణ రాష్ట్ర జానియర్ అథ్లెటిక్స్ చాంపియన్లుగా నిలిచారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి కె.మహిధర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు గెలుపొందిన క్రీడాకారులును చీఫ్ కోచ్ పి.నాగేందర్, కోచ్‌లు ఎం.నరేశ్, డి.మల్లికార్జున రావు, జన్ను గిరిప్రసాద్, ఎం.కృష్ణలను జిల్లా క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరి కె.సారంగపాణి, ప్రముఖ అథ్లెటిక్స్ కోచ్ ద్రోణాచార్య అవార్డ గ్రహిత నాగపురి రమేశ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అద్యక్షులు గొట్టపు రాధాకృష్ణ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి రాజేందర్ ప్రసాద్‌లు అభినందించారు. విజేతల వివరాలు.... భద్రాచలంకు చెందిన ఎస్‌కె. అఫ్రీన్ షాట్ పుట్, త్రోలో బంగారు పతకం, జావెలిన్ త్రో లో కాంశ్య పతకం, పాల్వంచకు చెందిన బి.సిద్ధి వినయ, హై జంపులో బంగారు పతకం, కొత్తగూడెంకు చెందిన ఏ.వందన హెప్టాత్లోన్‌లో బంగారు పతకం, ఎం.పవన్, హై జంపులో బంగారు పతకం, ఎం.సంగీత త్రీ కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో బంగారు పతకం, భద్రాచలంకు చెందిన టి.శ్రీతేజ 200 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం, ఎం.శ్రీవిద్య దౌర 80 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం సాధించారని చెప్పారు. పాల్వంచకు చెందిన ఆర్.అభినవ నాయక్ 200 మీటర్లు,110 మీటర్ల హర్డిల్స్‌లో రెండు రజిత పతకాలు, బి.డీకేష్ సౌమిత్ 400 మీటర్ల హర్డిల్స్‌లో, 110 మీటర్ల హర్డిల్స్ రెండు రజిత పతకాలు, కొత్తగూడెంకు చెందిన సిహెచ్.వేదశ్రీ ట్రైయాతలాన్‌లో రజిత పతకం, ఎం.సింధు 400 మీటర్ల హర్డిల్స్‌లో రజిత పతకం, ఎం.ఇందు 1500 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం, ఆర్.ప్రణయ నాయక్ 80 మీటర్ల హర్డిల్స్‌లో రజిత పతకం, పర్కాల గండికి చందిన పి.వెంకటేశ్వర రావు హై జంప్‌లో రజిత పతకం, కాచనపల్లికి చెందిన పి.కరుణ హై జంప్‌లో రజిత పతకం, ఎం.టబు 800 మీటర్ల పరుగుపందెంలో రజిత పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో కాంశ్య పతకం, పి.ఉషారాణి 5 కిలో మీటర్ల పరుగు పందెంలో కాంశ్య పతకం, ఎం.అఖిల్ 1500, 800 మీటర్ల పరుగు పందెంలో రెండు కాంశ్య పతకలు, బి.గణేష్ హై జంపులో కాంశ్య పతకం గెలుపొందారని మహిధర్ వెల్లడించారు.

జీఓ 76 ద్వారా ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో జీఓ నెం-76 ఆన్‌లైన్ ద్వారా ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం పట్టణంలో ఎన్నో ఏళ్ళుగా నివాసముంటున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జీఓ 76 ప్రవేశ పెట్టగా సుమారు 2 వేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుతో పాటు ప్రభుత్వానికి కొంత డబ్బు కూడా చెల్లించారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పట్టాల పంపిణీ ప్రక్రియను నిలిపివేశారన్నారు. ఎన్నికలు జరిగి 10 నెలలు దాటినా నేటికీ పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభిక పోవడంతో గృహాల కొనుగోలు, అమ్మకాలు పూర్తిగా నిలిచి పోవడంతో ప్రజలు ఆర్థికంగా నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, హరి కృష్ణ, మురళి, తనుష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ



తెలంగాణా రాష్ట్ర మార్క్ ఫెడ్ పాలకవర్గం సభ్యులు రాష్ట్ర వ్యవసాయం, సహకార శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్ సెక్రటరియేట్‌లో తెలంగాణ మార్క్ ఫెడ్ డైరెక్టర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావుతో పాటు రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మెన్ మార గంగారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ వి.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా తుమ్మలను శాలువా, బొకేలతో సన్మానించారు.

ఇన్ ఫార్మర్ నెపంతో గిరిజనుని హత్య

- బీజాపూర్ జిల్లాలో ఘటన

నవతెలంగాణ-చర్ల



సరిహద్దు ఛత్తీస్గడ్ బీజాపూర్ జిల్లా భూపాలపట్నంలోని పోషడ్‌పల్లి గ్రామంలో ఇన్ ఫార్మర్ నేపంతో ఓ గిరిజన్‌ని మావోయిస్టులు హత మార్చారు. సోమవారం రాత్రి బమన్‌పూర్ పంచాయతీ పోషడ్‌పల్లి గ్రామంలో మావోయిస్టులు తాటి కన్నయ్య అనే గిరిజన వ్యక్తిని హతమార్చారు. ఈ ఘటనతో గ్రామస్తుల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. భూపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని జరిగిన ఈ ఘటన అధికారికంగా ధ్రువీకరించబడలేదు.

దంతవాడ జిల్లాలో నలుగురు మావోయిస్టులు లొంగుబాటు



ఛత్తీస్గడ్ దంతేవాడ జిల్లాలో పోలీసులు ప్రవేశపెట్టిన లోన్ వర్రాటు ప్రచారానికి ఆకర్షితులై నలుగురు మావోయిస్టులు లొంగి పోయారు. లొంగిపోయిన వారి లో ఇద్దరి పై రూ.4 లక్షల రివార్డ్, మరో ఇద్దరి పై రూ.2 లక్షల రివార్డ్ ఉందని పోలీసులు తెలిపారు. లొంగిపోయిన వారికి ఛత్తీస్గఢ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పునరావాస పథకం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో దుర్గామాత అలంకారణ

నవతెలంగాణ-పాల్వంచ



పట్టణంలోని ఆదర్శ నగర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత అమ్మవారికి మంగళవారం అనగా మంగళవారం రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరించారు. ప్రతిరోజు అమ్మవారి మండపం వద్ద నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కడలి శ్రీనివాసరావు ఇనపనూరి హిమవరుణ్, తాటికొండ రామకృష్ణ, పాకనాటి నరేష్ కొండ్రాటి దుర్గాప్రసాద్, కల్లూరి ప్రదీప్, మామిడి జగదీష్, పాకనాటి సురేష్ చంద్ర వెంకటేశ్వరరావు, పేటేటి నరేష్, ఆలస్యం వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా దశమ్ బాబు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కారంపూడి దశమ్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 7, 8 తేదీలలో పీఆర్‌టీయూ 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు హైద్రాబాద్‌లో ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. సమావేశంలో భద్రాచలం పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కారంపూడి దశమ్ బాబును రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈయన మండలంలోని ఎంపీపీఎస్ వైట్ నాగారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. నియామకం పట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంశీ మోహన్, డి.శ్రీనివాసరావు, బి.మల్లికార్జున్ రావు, నాగరాజు, కేజియ, పలువురు పీఆర్‌టీయూ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేశారు.



ఎస్సైకి గోల్డ్ మెడల్ ప్రదానం

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు మండల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్‌కి వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ జా గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. వరంగల్ జిల్లాలో నిర్వహించిన పోలీసు డ్యూటీ మీట్‌లో ఆయనకు ఈ ఉత్తమ పురస్కారం లభించింది. పోలీస్‌కు సంబంధించిన ప్రోగ్రాం ఎబిలిటీ సబ్జెక్టులో రాష్ట్రంలోనే ప్రథమునిగా నిలిచారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా గోల్డ్ మెడల్ పురస్కారాన్ని అందుకున్న ఎస్సై రాణా ప్రతాప్కి ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు.

మిగిలి ఉన్న పోడుదారులకు పట్టాలివ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి

ఎన్నికలకు ముందు ప్రభుత్వం మిగిలిఉన్న పోడుసాగుదారులకు పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసిందని, ఆ వాగ్దానం మేరకు వెంటనే వారికి పోడుపట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని మాధారంలో జరిగిన శాఖామహాసభలో ఆయన మాట్లాడారు. గత పాలకవర్గాల మాదిరిగా ఇప్పటి ప్రభుత్వం పోడు భూమికి అధికారుల నిర్లక్ష్యం వల్ల చాలామంది సాగుదారులకు హక్కుపత్రాలు రాలేదని, నేటికీ వారిపై ఫారెస్టు అధికారుల నిర్బంధం సాగుతుందని, పట్టాలు రాలేదని సాకు చూపించి ఫారెస్టు అధికారులు సాగుదారుల నుంచి బలవంతంగా భూములు లాక్కునే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ఇలాగే సాగితే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలకు సిద్ధంకాక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామాల్లో సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయని, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి పంచాయతీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు ఊకంటి రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, గౌరి నాగేశ్వరరావు, రావుజా, వినోద్, వెంకట్రావు, ఇందిర, నీలా, నాగబాబు, సత్యం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మాధారం సీపీఐ(ఎం) శాఖాకార్యదర్శిగా ఊకంటి నియామకం

మాధారంలో జరిగిన సీపీఐ(ఎం) శాఖా మహాసభలో శాఖాకార్యదర్శిగా ఊకంటి రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఊకంటికి పలువురు జిల్లా, మండల నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఊకంటి రవికుమార్ మాట్లాడుతూ మాధారం పంచాయతీ పరిధిలో ప్రజల సమస్యలపై పోరాటాలు సాగిస్తామని, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.

మణుగూరును పంచాయతీగా ఏర్పాటు చేయాలి

- పేద ప్రజలకు ఉపాధి హామీ పనులు అమలు చేయాలి

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు మున్సిపాలిటీ రద్దుచేసి పంచాయతీలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు డిమాండ్ చేశారు. బండారుగూడెం సీపీఐ(ఎం) శాఖ మహాసభ సందర్భంగా జెండాను ఎగరవేసిన అనంతరం మాట్లాడుతూ మణుగూరు మున్సిపాలిటీ కారణంగా ఉపాధి హామీ పనులు అమలు కావడం లేదన్నారు. ప్రధానంగా భూగర్భగనులు మూసివేత గురైన తర్వాత బాపనకుంట, మణుగూరు, కొండాపురం, అన్నారం, రాయి గూడెం, కమలాపురం గ్రామాలతో పాటు పట్టణంలోని 20 వార్డులలో అనేకమంది పేదలకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని ఉన్నారని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత డ్రైనేజీ, రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని అన్నారు. సిల్ట్ తొలగించకపోవడం వలన వర్షాలు వస్తే మురుగు రోడ్లపై ప్రవహిస్తుందన్నారు. వెంటనే అంతర్గత డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయాలని బ్లీచింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. కట్ట వాగులో పేరుకుపోయిన సిల్ట్ తొలగించాలని, పెరిగిన పిచ్చి మొక్కలను వ్యర్థాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించి బాగు చేయాలన్నారు. సింగరేణి వరదల నివారణకు సిఎస్ఆర్ నిధులు మున్సిపాలిటీకి పది లక్షల రూపాయలు కేటాయించిందన్నారు. మున్సిపాలిటీ అధికారులు వినియోగించి లేక పోయారని దాని కారణంగానే మణుగూరు ముంపు గురైందన్నారు. ఈ మహాసభలలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు సత్రపల్లి సాంబశివరావు, బొల్లం రాజు, పల్లపు నాగేశ్వరరావు, సంకినేని వెంకట్రావు, ముత్తయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బండారుగూడెం శాఖ కార్యదర్శిగా బొల్లం రాజు

బండారుగూడెం శాఖ కార్యదర్శిగా బొల్లం రాజును సీపీఐ(ఎం) శాఖ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఆయన ఎన్నిక సందర్భంగా పట్టణంలోని ప్రముఖులు, రాజకీయ నాయకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా బొల్లం రాజు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి యువత, మహిళలపై కేంద్రీకరించి పని చేస్తానని అన్నారు.



ఉత్సాహంగా బతుకమ్మలాడిన అంగన్వాడీ టీచర్లు

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలోని కళ్యాణపురం సెక్టార్ పరిధిలో గల మిట్టగూడెం అంగన్వాడి 1 సెంటర్లో మంగళవారం ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆ సెక్టార్ సూపర్వైజర్ సావిత్రి హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అశ్వాపురం, కళ్యాణపురం సెక్టర్ల పరిధిలోని టీచర్లు అందరూ బతుకమ్మలను వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పండగ వాతావరణంలా బతుకమ్మలాడిన టీచర్లను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్శిక రాజమ్మ అంగన్వాడీ టీచర్లు నాగమణి, మాలతి, అరుణకుమారి, మల్లికాంబ, భారతి, అన్నపూర్ణ, అరుణ, లలిత పాల్గొన్నారు.

శాంతినగర్, పగిడేరు సీపీఐ(ఎం) శాఖా కార్యదర్శుల ఎన్నిక

నవతెలంగాణ-మణుగూరు





పగిడేరు పంచాయతీ శాంతినగర్ గ్రామ సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా రెంటాల చిన్న నరసయ్యను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. కుంజా నరసయ్య (రాజన్న) నివాసంలో కుంజ కృష్ణకుమారి ప్రాంగణంలో మూడవ మహాసభ మంగళవారం జరిగింది. సీనియర్ పార్టీ సభ్యులు, ప్రజా వైద్యులు రెంటాల చిన్న నరసయ్య ఎన్నిక కావడం పట్ల అన్ని వర్గాల ప్రజల నుండి హర్షం వ్యక్తం చేశారు. పార్టీ క్రియాశీలక ఉద్యమాలలో ప్రజలు పాల్గొంటానని, ప్రజలను భాగస్వామ్యం చేస్తానని ఆయన అన్నారు. ముఖ్యంగా మహిళలు, యువతలో పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

పగిడేరు శాఖ కార్యదర్శిగా కుంజా నరసింహారావు

పగిడేరు సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా కుంజా నరసింహారావును పార్టీ శాఖ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. కుంజా యుగంధర్ ఇంటి వద్ద (కుంజా కృష్ణకుమారి) ప్రాంగణంలో జరిగిన శాక మహాసభ నూతన కార్యదర్శిని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శి ఎన్నికైన నరసరావును గ్రామంలోని ప్రజలు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ధాన్యలక్ష్మి అవతారంలో అమ్మవారు దర్శనం

- బాలకాండ పారాయణంతో మారుమోగిన భద్రగిరి
- నేడు విజయలక్ష్మి రూపంలో...

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



శ్రీ సీతారామచంద్ర స్వామివారి సన్నిధిలో కొలువుతీరి ఉన్న శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారికి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 5వ రోజు మంగళవారం అమ్మవారు ధాన్యాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అష్టలక్ష్మి అలంకరణలు సామూహిక కుంకుమార్చనలతో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన సామూహిక కుంకుమ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారి సహస్ర నామాలతో జపం చేస్తూ సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ధాన్యలక్ష్మి అలంకారం పురస్కరించుకుని బాలకాండ పారాయణం చేయగా పట్టణ వ్యాప్తంగా దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మైకుల ఫలితంగా భద్రగిరి మొత్తం బాలకాండ పారాయణంతో మార్మోగింది. శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ధాన్యలక్ష్మి అవతారం విశిష్టతను ఆలయ అర్చకులు వివరిస్తూ అన్ని రకాల ధాన్యాలను ప్రసాదించేది ఈ అమ్మే, ఈ అమ్మని ఆరాధిస్తే ఈతి బాధలన్ని తొలగి సమయానికి తగు వానలు కురిసి దేశం సస్యశ్యామలంగా సుభిక్షంగా ఉంటుందని తెలియజేశారు. అంతేకాకుండా వ్యవసాయ ప్రధానమైన దేశ సౌభాగ్యం కోసం ధాన్యాలక్ష్మీ అమ్మవారిని సేవించాలని ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే యాత్రికులకు స్వామివారి అన్న ప్రసాద అవకాశాన్ని ఆలయ అధికారులు కల్పించగా సీతారాముల నిత్య కళ్యాణంలో సైతం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా ఆరో రోజైన నేడు విజయలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇయ్యనున్నారు.

నాచారం నూతన శాఖా కార్యదర్శిగా చెన్నకేశవులు

నవతెలంగాణ-దమ్మపేట



మండల పరిధిలోని నాచారం ఆసన్నగూడెం సీపీఐ(ఎం) నూతన శాఖ కార్యదర్శిగా ఆబోతు చెన్నకేశవులు ఎన్నికయ్యారు. అమరజీవి కామ్రేడ్ మోరంపూడి పుల్లా రావు నగరంలో నాచారం ఆసన్న గూడెం గ్రామ శాఖా మహాసభ కొండారు యల్ల మంద అధ్యక్షతన జరిగింది. ఈ క్రమంలో మొట్ట మొదట పార్టీ జెండాను సీనియర్ సభ్యులు యంత్రాతి అప్పారావు ఎగుర వేశారు. అనంతరం సభలో మండల కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ అమరజీవి, పార్టీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని వారి చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలు అవలంబిస్తూ పేద ప్రజలను, కార్మికులను, రైతులను, శ్రమజీవులు మొత్తాన్ని దివాలా తీస్తుందని అటువంటి ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పార్టీ సభ్యులందరూ ప్రజలలో ఉండి ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలని అనేక హామీలు ఇచ్చి ఒక్క ఆర్‌టిసి బస్సు మహిళా ప్రయాణికుల విషయం తప్ప అన్నిట్లో ఫెయిల్ అయిందని అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2,500, వృద్దులకు రూ.4వేల పింఛన్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కారన్నారు.

భవిష్యత్తులో ప్రజా పోరాటాలు నిర్వహించి ప్రజల తరఫున పని చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నిత్యం ప్రజల్లో ఉండి శాఖ సభ్యులు పనిచేయాలని తెలిపారు. ఈ మహాసభలో మోరంపూడి రామ్ మోహన్‌రావు, బేతిని కుటుంబరావు, యంత్రాతి సత్యనారాయణ, కోమటి వెంకటేశ్వరరావు, పిల్లి నాయుడు, అప్పారావు, కొండారు ఎల్లమంద శాఖలలోని సభ్యులు పాల్గొన్నారు.

టమాటాకు రెక్కలు... వినియోగదారులకు చుక్కలు

- అదే బాటలో ఉల్లిపాయలు

నవతెలంగాణ-అశ్వాపురం



టమాటాకు రెక్కలు వచ్చినట్లు ధరలు విపరీతంగా పెరిగి ఆకాశాన్ని అంటడంతో మార్కెట్ కెళ్ళిన వినియోగదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. నిత్యజీవితంలో వంటకాల్లో టమాటా తప్పనిసరిగా మారడంతో భోజన ప్రియులకు టమాటా కరువై ముద్ద దిగడం లేదనడంలో ఎటువంటి సందేహం లేదు. గత కొన్ని రోజులుగా మార్కెట్లో టమాట ధర ఏకంగా రూ.100కు చేరడంతో సామాన్య ప్రజలు టమాట కొనలేక ఇబ్బందులు పడక తప్పడం లేదు. అయితే ఈ ధరలు మరో నెల రోజులపాటు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని మార్కెట్లలోని వ్యాపారులు బహిరంగంగానే చెబుతున్నారు. మరో నెల 15 రోజుల్లో స్థానికంగా లోకల్ టమాట వచ్చే అవకాశాలు ఉండడంతో ఇక్కడి దిగుబడులు చేతికి వస్తే తప్ప ధరలు దిగే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఇలాగే టమాట ధర కొనసాగితే సామాన్యుడి కూరల్లో టమాటా దరిచేరలేని పరిస్థితి నెలకొని ఉందని నిరుపేదలు అంటున్నారు. ఇక టమాటా ధర ఇలా కొనసాగుతుంటే ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తుందని పలువురు అంటున్నారు. ఒక వారం రోజుల కిందటి వరకు రూ.40 నుండి 50లకు పరిమితమైన ఉల్లిపాయల ధర మరో రూ.20 పెరిగి 70కి చేరుకుంది. దీంతో ఉల్లిపాయల కొనాలంటే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దినసరి కూలీ పనులు చేసుకొని కాలం వెల్ల తీసుకునే వారికి ఈ ధరల పెరుగుదల కత్తి మీద సాములా తయారైందని రోజువారి కూలీలు అంటున్నారు. పెరిగిన ధరలపై అధికారులు దృష్టి సారించి టమాట, ఉల్లి ధరలను అదుపులోకి తీసుకురావాలని ప్రజల కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | అక్టోబర్ 09, 2024 | www.navatelangana.com

స్వాతంత్ర్య సమర యోధురాలు సామ్రాజ్యం మృతి

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధురాలు మందడపు సామ్రాజ్యం(90) మంగళవారం మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ సీనియర్ నాయకులు సూర్యదేవర పామీదత్ లు కలిసి ఎర్రజెండా కప్పి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.సామ్రాజ్యం భర్త మందడపు పుల్లయ్య సిపిఐ నాయకులు గా పనిచేశారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సొసైటీ డైరెక్టర్ కొంగర రామారావు, సిపిఐ శాఖ కార్యదర్శి, సిపిఐ నాయకులు గుడిధ కృష్ణ, వంగాల నరసింహ, ఏలూరి రమేష్, సిపిఎం నాయకులు మందడపు శ్రీనివాసరావు, పారుపల్లి పూర్ణచంద్రరావు, మందడపు రామారావు, కాంగ్రెస్ నాయకులు గంగసాని రాఘవరావు తదితరులున్నారు.

దసరా సెలవులకు వెళ్తున్నారా..
జాగ్రత్తలు పాటించండి



- ఎస్‌హెచ్‌ఓ ఎస్సై యయాతి రాజు

నవతెలంగాణ - అశ్వారావుపేట

దసరా సెలవులకు స్వగ్రామాలకు, బంధువుల ఇండ్లకు వెళ్లే స్థానికులు తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌హెచ్‌ఓ ఎస్సై యయాతి రాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గృహాలకు పకడ్బందీగా తాళాలు వేసుకుని వెళ్లాలన్నారు. ఇరుగుపొరుగు వారికి ఊరు వెళ్తున్నట్లు సమాచారం ఇవ్వాలి. విలువైన నగలు, ఆభరణాలు వెంట తీసుకుని వెళ్ళాలి. బ్యాంక్ లాకర్ లలో భద్రపరుకోవాలని, అవకాశం ఉన్నోళ్ళు ఇంటి పరిసరాలు కనపడే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పలు భద్రతా పరం అయిన సూచనలు చేసారు.

బడుగుల కోసం పాటు పడిన వ్యక్తి గుర్రం వెంకటేశ్వర్లు

- తుమ్మల వెంకటరెడ్డి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతూ తుది శ్వాస విడిచిన వ్యక్తి అమరజీవి గుర్రం వెంకటేశ్వర్లు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తమ్మల వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో అమరజీవి గుర్రం వెంకటేశ్వర్లు 14వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన వర్ధంతి సభలో తుమ్మల వెంకటరెడ్డి మరియు గుర్రం పుల్లారావు మాట్లాడుతూ.... గుర్రం వెంకటేశ్వర్లు వెంకటాపురం మండలంలో సీపీఐ(ఎం) బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు దావూద్, వాసు, మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను, చారి, ఆదినారాయణ, రాములు, పుల్లారావు, నాగేశ్వరరావు, మాణిక్యం, ప్రసాద్, రాము, కృష్ణా పాల్గొన్నారు.

కార్మికులను పరామర్శించిన సీఐటీయూ నాయకులు కొలికపోగు

గాయపడిన వారికి రూ. 25వేలు సాయం అందించాలి

నవతెలంగాణ-సత్తుపల్లి

లారీ ఢీకొన్న ఘటనలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్తుపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను మంగళవారం సీఐటీయూ జిల్లా నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు కలుసుకొని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల పక్షాన సీఐటీయూ అండగా ఉంటుందని సర్వేశ్వరరావు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణ సాయం కింద కార్మికుల కుటుంబాలకు రూ.25వేలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

19 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక

నూతన ఉపాధ్యాయులకు టీఎస్ యుటిఎఫ్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-కల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ఉద్యోగాల భర్తీలో కల్లూరు మండలం నుండి 19 మంది ఉపాధ్యాయులుగా ఎంపికై రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదగా బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేజి స్టేడియంలో ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకోబోతున్నారు. మండలంలోని చిన్న కోరుకొండ గ్రామానికి చెందిన 8 మందికి ఎస్జిటి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారు నియామక పత్రాలు అందుకోబోతున్నారు. ఒకే గ్రామం నుండి ఉపాధ్యాయ పోస్టులకు ఎనిమిది మంది ఎంపిక కావడంతో ఆ గ్రామంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఉపాధ్యాయ బాధ్యతలు చేపట్టపోతున్న వారికి టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షులు రాయల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కే.విజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

నూతన పద్ధతులను అలవర్చుకోవడమే నిజమైన నైపుణ్యం
డీడీ విజయలక్ష్మి



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

నూతన పద్ధతులను అలవర్చుకోవడమే నిజమైన నైపుణ్యమని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మీ అన్నారు. జిల్లాలోని అన్ని గిరిజన సంక్షేమ వసతి గృహాల వంట సిబ్బందికి వ్యక్తిగత ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నూతన పద్ధతులను అలవర్చుకోవడంపై మండల పరిధిలో గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో 10 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీ విజయలక్ష్మీ మాట్లాడారు. నూతన పద్ధతులలో నాణ్యమైన రుచికరమైన వంటలు, తయారు చేయడం పరిశుభ్రత పాటించడంపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీడీఓ జహీరుద్దీన్, సత్యవతి, రాంబాబు, శ్యామ్, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, హాస్టల్ వార్డెన్ రమాకుమారి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం గోవింద్‌తండాకు చెందిన బానోత్ భజన్ అనే వ్యక్తి కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. గోవింద్‌తండాకు చెందిన బానోత్ భజన్ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. 4 నెలల క్రితం కుటుంబ సభ్యులు అతనిని ఖమ్మం ప్రభుత్వం అసుపత్రిలో చూపించగా అక్కడ అపరేషన్ సైతం జరిగింది. ఈనెల 2వ తేది మళ్లి కడుపు నొప్పి రావటంతో దానికి తాళలేక భజన్ ఇంట్లో ఉన్న కలుపుమందు సేవించి వాంతులు చేసుకుంటున్నాడు. దీనిని గమనించి కుటుంబ సభ్యులు బాధితుడిని ఖమ్మంలోని ప్రయివేటు అసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీనికి సంబంధించి మృతుని కుమారుడు అశోక్‌కుమార్ ఇచ్చిన పిర్యాదు మేరకు కారేపల్లి పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

తెలంగాణ రాష్ట్ర బతుకమ్మ పండుగ ఉత్సవాలలో భాగంగా భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని మహిళా ఉద్యోగులు ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించినట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ సతీమణి మనీషా అన్నారు. మంగళవారం ఐటిడిఏ కార్యాలయం ఆవరణలో మహిళా ఉద్యోగులు ఐటీడీఏ నివాస గృహ సముదాయంలోని మహిళలు వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలను మహిళలతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ కార్యాలయం ఉద్యోగులు, మహిళలు అందరూ పూలతో అందమైన బతుకమ్మలను ఏర్పాటు చేసి సాంప్రదాయ పద్ధతిలో వేడుకలను నిర్వహించినట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి మణెమ్మ, ఐటిడిఏ మహిళా ఉద్యోగులు మాధవి నివాస గృహం మహిళలు, సుధారాణి, మణికుమారి, స్వాతి మరియు చిన్నారి బాలికలు పాల్గొన్నారు.

స్వగ్రామంలో అభివృద్ధి పనులు పరిశీలించిన భట్టి



నవతెలంగాణ-వైరా

మండలంలోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామం స్నానాల లక్ష్మీ పురంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో 3 కోట్ల 20 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన కళ్యాణ మండపంతో పాటు పలు అభివృద్ధి పనుల ఏర్పాట్లను భట్టి విక్రమార్క మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఏర్పాటు చేసిన మ్యాప్‌ను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులు ఏదునూరి సీతారాములు, దొడ్డ పుల్లయ్య, మల్లు రామకృష్ణ, అడుసుమిల్లి గణేష్, సూరపనేని నాగేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏసీపీ రెహమాన్, ఎండోమెంట్ డిఇ, ఎండోమెంట్ ఏసి, ఈవో చంద్రశేఖర్ శర్మ, ఎస్సై వంశీకృష్ణ, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రాఘురామిరెడ్డి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరై ఆడిపాడారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అధునాతన సౌకర్యాలతో అంకుర హాస్పిటల్

120 పడకలతో నేడు మంత్రులతో ఖమ్మంలో ప్రారంభం

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రజల ముందుకు
- విలేకరుల సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం

అత్యుత్తమ, అధునాతన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలతో ప్రజలకు అంకుర ఆసుపత్రిలో వైద్యసేవలను అందిస్తున్నామని అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్ తెలిపారు. స్త్రీలు, పిల్లలకు సంబంధించిన అంశాల్లో అంకుర ఆసుపత్రి ప్రత్యేకమైన వైద్య చరిత్ర కలిగి ఉండని చెప్పారు. ఖమ్మంలో మంగళవారం ఓ హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంకుర హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ దేశవ్యాప్తంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటుగా మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో 14 కేంద్రాల్లో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అన్నీ బ్రాంచిలో మొత్తం 1800 పడకలు ఉన్నాయని తెలిపారు. అందులో భాగంగా ఎన్నో సంవత్సరాలుగా ఖమ్మంలో విశిష్ట సేవలు అందిస్తున్న అంకుర ఆసుపత్రి రోగులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్న ఉద్దేశంతో కొత్త ప్రదేశానికి మార్చి 120 పడకల ఆసుపత్రిగా దాన్ని తీర్చిదిద్దడం జరిగిందన్నారు. బుధవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల చేతుల మీదుగా ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయ, ఎంఎల్ఏలు బ్రహ్మానందరెడ్డి, నిమ్మల రామానాయుడు రానున్నట్లు తెలిపారు. సరికొత్త అత్యాధునిక సాంకేతికతతో అన్నీ వయస్సుల మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణను అందించడానికి అంకుర బృందం నిరంతరం శ్రమిస్తుందన్నారు. డిజిటల్ పద్ధతిలో అంకుర సేవలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఖమ్మంలో 24 పడకల ఎన్ఐసీయు (నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్), 18 పడకల పీఐసీయు (పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) ఉన్నాయని తెలిపారు. వాటిద్వారా అకాల , నవజాత శిశువులకు అవసరమయ్యే అత్యంత క్లిష్టమైన సంరక్షణను అందించనున్నట్లు తెలిపారు. తమ ఆసుపత్రిలో నిపుణులైన శిశువైద్యులు, ప్రసూతి వైద్యులు, గైనకాలజిస్టు , శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది క్లిష్టమైన సంరక్షణ సేవలు అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ఖమ్మంలో కేంద్రంలో 9ఎం ఫెర్టిలిటీ సౌకర్యం ఉందన్నారు. సంతానోత్పత్తి విషయంలో ప్రపంచ సగటులను అధిగమించి అధిక విజయాల రేటును అంకుర కలిగి ఉందన్నారు. ఖమ్మంలో ఈ సదుపాయం ఉండటం అనేది ఇన్ఫెర్టిలిటీ నివారణలు కోరుకునే దంపతులకు



ఒక వరంలా మారనుందన్నారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా చైల్డ్-ఫ్రెండ్లీ, మహిళలు, గర్భిణీ స్త్రీలకు ప్రశాంతమైన వాతావరణంలో వైద్య సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. గర్భిణీ స్త్రీలు విలాసవంతమైన, సౌకర్యవంతమైన సూట్లు, అధునాతన పిండం ఔషధ సంరక్షణ , అధిక నాణ్యత గల ప్రినేటల్, పెరినాటల్ కేర్ సౌకర్యాలు అందించనున్నట్లు తెలిపారు. చైల్డ్ బర్తింగ్ క్లాసెస్, గర్భిణులకు యోగా, ఆహారం, బ్రెస్ట్ ఫీడింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు తమ ఆసుపత్రిలో ఉన్నాయన్నారు. గర్భధారణను సౌకర్యవంతమైన, మరపురాని అనుభూతిగా మార్చడానికి తమ బృందం నిరంతరం శ్రమిస్తోందన్నారు. పెయిన్లెస్ డెలివరీ, వాటర్ బర్సింగ్తో సహా సహజ ప్రసవం సిజేరియన్ వంటి అన్ని రకాల ప్రసవాలు మహిళల వ్యక్తిగత అవసరాలను బట్టి నిపుణుల సంరక్షణతో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో అంకుర ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రాకేష్ చల్లగుళ్ల, డాక్టర్లు దుర్గాప్రసాద్, సందీప్ రెడ్డి, స్పందన పూజ తదితరులు పాల్గొన్నారు.

గంగారం పల్లెప్రకృతి వనంలో మొక్కలు 'నరికివేత'

- కోనోకార్పస్‌ను తొలగించమంటే ఏకంగా పార్కును సర్వనాశనం చేసిన గ్రామ పంచాయతీ సిబ్బంది

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం గంగారంలోని పల్లెప్రకృతి వనంలోని మొక్కలన్నీ మంగళవారం నరికివేతకు గురయ్యాయి. పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన కోనో కార్పస్ మొక్కలను తొలగించమని గ్రామ పంచాయతీ సిబ్బందికి అధికారులు చెబితే ఏకంగా పార్కులోని వివిధ రకాల మొక్కలను నరికి పార్కును సర్వనాశనం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులతో గంగారంలో ఎకరం విస్తర్ణంలో 2021, జులై 11న రూ.6.83లక్షలతో పల్లెప్రకృతి వనం ప్రారంభమైంది. ఆ పార్కులో వివిధ రకాల వృక్ష జాతులు, పూల జాతులను నాటారు. నాలుగేండ్ల క్రితం నాటిన ఆ మొక్కలన్నీ ఏపుగా పెరిగి పార్కు పచ్చదనంతో కళకళలాడుతోంది. కోనో కార్పస్ మొక్కలను తొలగించాలన్న అధికారుల ఆదేశాల మేరకు ప్రకృతి వనంలోని కోనో కార్పస్ మొక్కలతో పాటు మిగతా రకాలను కూడా గ్రామ పంచాయతీ సిబ్బంది నరికివేశారు. సిబ్బంది తెలియక చేశారా..? లేక కావాలని చేశారా..? అనే విషయాలపై అధికారులు



విచారిస్తే గాని తెలిసే అవకాశం ఉంది. ప్రకృతి వనంలోని మొక్కలన్నీ నరికేసి పార్కును ఎడారిగా మార్చడంపై గ్రామస్తులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. దీనిపై సంబంధిత ఏ అధికారిని వివరణ కోరినా మాకేం తెలియదంటూ సమాధానాలు చెప్పడం గమనార్హం.

నా భద్రత కంటే క్షతగాత్రుని ప్రాణాలు ముఖ్యం

- మరోమారు మానవత్వం చాటుకున్న మంత్రి పొంగులేటి
- కరుణగిరిలో రోడ్డు ప్రమాదం
- కాన్వాయ్ ఆపి క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించిన మంత్రి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

'అరె బాబు ఏమైంది... దెబ్బలు బాగా తగిలనట్లున్నాయి...ఏం కాదులే నేనున్నా(రోదిస్తున్న క్షతగాత్రునితో)... ముందు అతన్ని కారు ఎక్కించండి.... ఎవరమ్మా అక్కడ (పోలీసు సిబ్బందిని) త్వరగా కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లండి.....ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా ఆ కారుకు పోలీస్ ఎస్కార్ట్‌ను పంపండి' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.... తిరుమలాయపాలెం మండల పర్యటనను ముగించుకుని మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఖమ్మంలోని తన క్యాంపు ఆఫీసుకు మంత్రి పొంగులేటి వస్తున్న సమయంలో కరుణగిరి వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దీనిని



గమనించిన మంత్రి తన కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రుని దగ్గరకు వెళ్లి రామర్శించారు. వెంటనే రక్తపు మరకలతో ఉన్న అతనిని కిమ్స్ ఆసుపత్రికి తరలించమని ట్రాఫిక్ సీఐ సాంబశివరావును ఆదేశించడమే కాకుండా తన కోసం వచ్చిన ఎస్కార్ట్ వాహనాన్ని ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా బాధితుని వెంట పంపాలని సూచించారు. వెంటనే సీఐ తన సిబ్బంది ద్వారా బాధితున్ని ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

రూ. 33కోట్లతో పూర్తయిన పవర్ ప్లాంట్ నిర్మాణం

- 12న తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం
- పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి

నవతెలంగాణ-సత్తుపల్లి

అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో రూ. 33కోట్లతో చేపట్టిన పవర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయిందని, ఈనెల 12న వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభం కానుందని తెలంగాణ పామాయిల్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం సత్తుపల్లిలోని రైతు చల్లగుళ్ల నరసింహారావు గృహంలో రామచంద్రప్రసాద్ ఆ సంఘ బాధ్యులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఢిల్లీనుంచి ఇండియన్ ఆయిల్‌పాం రీసెర్చ్ (ఐఓపీఆర్) శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు, ఆంధ్రా ప్రాంతం నుంచి కూడా పామాయిల్ రైతులు తరలి రానున్నట్లు ఆయన చెప్పారు. గతంలో పామాయిల్ గెలల ధర రూ. 13, 14వేల వరకు ఉండేదని, మంత్రి తుమ్మల కృషివల్ల కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం తగ్గించాక టన్ను రూ. 17వేల నుంచి 18వేల వరకు పలికే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పామాయిల్ సంఘం తరపున మంత్రి తుమ్మలకు ధన్యవాదాలు తెలిపారు. 12న జరిగే పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో జిల్లా వ్యాప్తంగా పామాయిల్ రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర బాధ్యులు గురవారెడ్డి, మాజీ ఛైర్మెన్ కందిమళ్ల కృష్ణారావు, డైరెక్టర్లు వేంపాటి లక్ష్మీనారాయణ, కృష్ణార్జునరావు, బండి గురునాథరెడ్డి, చీకటి చిట్టిరావు, వెల్ది జగన్మోహనరావు, రైతులు మోరంపూడి జగన్, కొప్పుల నరేందర్‌రెడ్డి, దేవగిరి అక్కిరెడ్డి, ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమావేశం

నవతెలంగాణ-వైరా

2024 - 25 సంవత్సరానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిర్వహణపై మంగళవారం స్థానిక రైతు వేదికలో మండల స్థాయి అధికారుల, ధాన్యం సేకరణ టీమ్‌తో అవగాహనా సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సరస్వతి, ఏపిఎం శ్యాం కుమార్, ఎంపిఓ జ్యోత్స్నా దేవి తదితరులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వరి సన్నారకం ధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇస్తున్నందున వైరాలో ధాన్యం కొనుగోలు చాలా పకడ్బందీగా జరగవలసిన అవసరం ఉందని అన్నారు. మండలంలోని వైరా విశాల సహకార పరపతి సంఘం, గరికపాడు, పూసల పాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా అదే విధంగా డిసిఎంఎస్ ద్వారా ఈ ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆయా సొసైటీ సీఈవోలు వారి గ్రామాల పరిధిలో ధాన్యం కొనుగోలు చేయాల్సిన స్థలాన్ని ముందే ఏర్పాటు చేసుకొని ఆ స్థలంలో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే అవకాశం ఉండే విధంగా తయారు చేయాలని సూచించారు. ఈ సంవత్సరం వైరా మండలంలో 20 సెంటర్లను గుర్తించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వైరా మండల గ్రామ పంచాయతీ సెక్రటరీలు డీసీఎంఎస్, పిఎసిఎస్ సీఈఓలు, వారి సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, సైదులు, వెంకట నరసయ్య, రాజేష్, కీర్తి శిరీష, అదేవిధంగా సొసైటీ సభ్యులు అప్పారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

12 మంది మావోయిస్టుల మృతదేహాలు అప్పగింత

వివరాలు వెల్లడించిన బస్తర్ ఐజి సుందర్లాల్

నవతెలంగాణ-చర్ల



సరిహద్దు చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ - దంతేవాడ జిల్లాల సరిహద్దులో జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల 12మంది మృతదేహాలను ఇప్పటి వరకు వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు బస్తర్ రేంజ్ ఐజి పి.సుందరరాజ్ తెలిపారు. 31 మంది మావోయిస్టు మృతదేహాల్లో 22 మందిని గుర్తించినట్లు తెలిపారు. ఇంకా 9 మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉందని తెలిపారు. 9 మంది మావోయిస్టులను గుర్తించే కార్యక్రమం లో భాగంగా వారి ఫొటోలను పొరుగు రాష్ట్రాలు, సరిహద్దుల్లో ఉన్న జిల్లాల పోలీసులకు పంపినట్లు ఆయన తెలిపారు.



అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సీపీఐ వినతి

నవతెలంగాణ-బోనకల్

మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, మౌళిక వసతులు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయంలో డిప్యూటీ సిఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టీవిక్రమార్కకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైన వారిలో నిజమైన పేదలకు, అర్హత కలిగిన వారికి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు అయ్యేలా రాజకీయ పార్టీలు పనిచేయాలన్నారు. మండలంలో పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, మౌళిక వసతులు కల్పించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో సిపిఐ మండల సహయ కార్యదర్శులు జక్కుల రామారావు, ఆకెన పవన్ తదితరులు ఉన్నారు. దీంతో మల్లు భట్టి విక్రమార్క స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ తప్పనిసరిగా ఇల్లు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు. పేద ప్రజలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు.

ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నేడు ధర్నా

నవతెలంగాణ-ముదిగొండ

ఎమ్మార్పీఎస్ మండల కార్యాలయంలో సంఘ మండల నాయకులు పడిశాల నాగేశ్వరావు మాదిగ అధ్యక్షతన మంగళవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల ఇంచార్జి నూకల నాగేశ్వరావు మాదిగ, కో-ఇంచార్జీ ఎల్ భద్రం ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ వర్గీకరణ లేకుండానే డీఎస్సీ ఫలితాలు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహిస్తున్నమన్నారు. జడ్పీ సెంటర్ నందు అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు నల్ల జెండాలతో భారీగా జరిగే నిరసన ప్రదర్శనలో మాదిగలు, మాదిగ ఉపకులాల, ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత, మహిళలు, విద్యావంతులు డీఎస్సీ అభ్యర్థులు అధికసంఖ్యలో పాల్గొని ఆందోళనను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్పి మండల సీనియర్ నాయకులు కట్టకూరి సురేష్, ఇరుకు రమేష్, బొడ్డు అనిల్, గుర్రం సంగయ్య పాల్గొన్నారు.

చెన్నారంలో దారుణం

నవతెలంగాణ నేలకొండపల్లి

మండలంలోని చెన్నారం గ్రామంలో దారుణం జరిగింది. గ్రామంలోని ఓ ఇంటి వద్ద మంగళవారం ఉదయం మగ మృత శిశువు ప్లాస్టిక్ కవర్ పై ప్రత్యక్షమైంది. నిద్ర లేవగానే తమ ఇంటి వద్ద జరిగిన దారుణాన్ని చూసిన ఆ ఇంటివారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జరిగిన ఘటనపై ఆ నోట ఈ నోట గ్రామం మొత్తం దావణంలా వ్యాపించింది. ఏ తల్లి కన్న బిడ్డడో కండ్లు తెరవని పసిగందు దిక్కూ మొక్కు లేకుండా నడి బజారులో మృత్యువాత పడి కనిపించడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. పోలీసులు అక్కడకు చేరుకొని జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు.

సత్తుపల్లి గాంధీనగర్‌లో భారీ చోరీ

40 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ. 36వేల నగదు,

- సుమారు రూ. 28.66 లక్షల సొత్తు దొంగల పాలు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ రోడ్డునెం-4 ప్రధాన రహదారి పక్కన నివాసముంటున్న ఆర్అండ్‌బీ ఉద్యోగి ఎండీ గులాం ఫహీముద్దీన్ ఇంట్లో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంటి తాళాలను పగుల గొట్టిన చోరులు ఆ ఇంట్లోని బీరువాలో దాచివుంచిన 40 తులాల బంగారం, 40 తులాల వెండి, నగదు రూ. 30వేలను దొంగలు అపహరించుకు పోయారు. ఫహీముద్దీన్ పని నిమిత్తం ఉదయం ఖమ్మం వెళ్లారు. సాయంత్రం ఇంటికొచ్చి చూసే సరికి ఇంట్లో దొంగలు పడినట్లు గుర్తించారు. భయాందోళనకు గురైన అతను ఇంట్లోకెళ్లి బీరువాను పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి బట్టలను చిందర వందర చేసి అందులో ఉన్న పైన తెలిపిన సొత్తు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు చోరీ జరిగిన సమాచారాన్ని అందించడంతో ఏసీపీ అనిశెట్టి, సీఐ తెల్లబోయిన కిరణ్ నేతృత్వంలో పోలీసుల బృందం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అపహరణకు గురైన సొత్తు సుమారు రూ. 28.66లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఫహీముద్దీన్ పోలీసులకు తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ముదిగొండ

ముఖ్యమంత్రి సహాయనిధికి పమ్మి గ్రామానికి చెందిన నేరెళ్ల శైలజ దరఖాస్తు చేసుకోగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు రూ.26వేల చెక్కు మంజూరు కాగా ఆ చెక్కును బాధితురాలు శైలజకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ వడ్డే శ్రీనివాసరావు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వడ్డే మాధవరావు, నాయకులు ఏలూరి హనుమంతరావు, పంజాల రాజేష్, ఎస్కే సొందు, ఏలూరి జానకిరామయ్య, రాయబారపు సంగీతరావు, నేరెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏకమైన జాట్ వ్యతిరేక కులాలు

ప్రభుత్వ వ్యతిరేక ఓట్లలో చీలిక హర్యానాలో గట్టెక్కిన బీజేపీ



చండీగఢ్ : హర్యానాలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవడంతో బీజేపీ గట్టెక్కగలిగింది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ), జననాయక్ జనతా పార్టీ (జేజేపీ), ఆమ్‌ఆద్మీ పార్టీ పెద్దగా ప్రభావం చూపకపోయినప్పటికీ ప్రతిపక్ష శిబిరం ఓట్లను కొంత మేర చీల్చాయి. జాట్లకు వ్యతిరేకంగా 35 కులాలను సంఘటిత పరచడం ద్వారా బీజేపీ లబ్ది పొందగలిగింది.

దళితుల ఓట్లను కూడా ఆ పార్టీ కొల్లగొట్టింది. సంస్థాగత బలం, టిక్కెట్ల కేటాయింపులో వ్యూహాత్మకంగా వ్యవహరించడం కమలదళానికి కలిసొచ్చింది. ప్రభుత్వ వ్యతిరేక పవనాలు, రైతులు-రెజ్లర్ల దీర్ఘకాల నిరసనలు, అగ్నివీర్ పథకంపై అసంతృప్తి... ఇవేవీ బీజేపీ విజయాన్ని అడ్డుకోలేకపోయాయి. బీజేపీ ప్రచారమంతా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ చుట్టూనే కేంద్రీకృతమైంది. ఆయన ముఖ్యమంత్రి పదవిని చేపట్టి కేవలం ఆరు నెలలు మాత్రమే అయింది. అనేక మంది సీనియర్ నేతలను కాదని బీజేపీ కొత్త ముఖాలకు పార్టీ టిక్కెట్లు కేటాయించింది. కాంగ్రెస్ మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేలందరినీ బరిలో దింపింది.

సైనీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిందని, ఓబీసీ కేటగిరీలో ఉపాధి కల్పనకు క్రీమిలేయర్ వార్షిక ఆదాయ పరిమితిని పెంచడం ద్వారా వెనుకబడిన తరగతులకు మేలు చేసిందని బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. భూపీందర్ సింగ్ హూడా నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నడిచినప్పుడు సిఫార్సులు, ముడుపులు ఇవ్వనిదే ఉద్యోగాలు రాలేదని ఆరోపించింది. ఈ ప్రచారం ఓటర్లపై ప్రభావం చూపిందని ఫలితాలు నిరూపిస్తున్నాయి. పార్టీ టిక్కెట్లు లభించని సీనియర్ నేతలను బుజ్జగించడంలో కూడా బీజేపీ సఫలమైంది. లోక్‌సభ ఎన్నికలలో ఐదు స్థానాలను కాంగ్రెస్‌కు కోల్పోయినా, ఫలితాల అనంతరం పలువురు నాయకులు పార్టీకి రాజీనామా చేయడమో లేదా తిరుగుబాటు చేయడమో జరిగినా కలవరపడకుండా బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది.



బీజేపీ పరువు నిలబెట్టిన ఆరు సీట్లు

లేకుంటే గతం కంటే దారుణం
కాశ్మీర్ లోయలో తెరవని బీజేపీ ఖాతా
జమ్మూలో కమలం పార్టీపై విశ్లేషణ

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో కొత్తగా ఏడు అసెంబ్లీ స్థానాలు చేరాయి. ఇందులో జమ్మూలో 6 స్థానాలు, కాశ్మీర్‌లో ఒక స్థానం ఉన్నాయి. గతంలో జమ్మూలో 37 స్థానాలు, కాశ్మీర్‌లో 46 స్థానాలు ఉండేవి. డీలిమిటేషన్ తర్వాత ఈ సీట్లను పెంచారు. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ మెరుగ్గా రాణిస్తుందని అంచనా వేసింది. జమ్మూలో 30 నుంచి 35 సీట్లు గెలుస్తామని పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. కానీ కేవలం 29 స్థానాలను మాత్రమే బీజేపీ గెలుచుకోగలిగింది. ఈ సీట్లన్నీ జమ్మూ ప్రాంతంలోనే ఉన్నాయి. కాగా, ఈసారి కూడా కాశ్మీర్ లోయలో బీజేపీ ఖాతా తెరవలేదు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ 25 సీట్లు గెలుచుకుంది. ఈ సారి 29 సీట్లు. ఈ లెక్కన చూస్తే నాలుగు సీట్లు ప్లస్ అయ్యాయి. అది కూడా డీలిమిటేషన్ తర్వాత జమ్మూలో కొత్తగా 6 సీట్లు పెరిగితే బీజేపీ గెలిచే సీట్ల సంఖ్య కాస్త తగ్గే అవకాశం ఉండేది. ఎందుకంటే ఈ 6 కొత్త సీట్లలో బీజేపీ ఐదింటిని గెలుచుకుంది. స్వతంత్ర అభ్యర్థి ఒకే ఒక్క స్థానంలో గెలుపొందారు.

సీట్లు ఎక్కడ పెరిగాయి?

జమ్మూ రీజియన్‌లోని సాంబా, కథువా, రాజౌరి, కిష్త్వార్, దోడా, ఉధంపూర్‌లలో ఒక్కో సీటు పెరిగింది. జమ్మూలోని సాంబాలోని రామ్‌గఢ్, కతువాలోని జస్రోటా, రాజౌరిలోని తన్నమండి, కిష్త్వార్‌లోని పద్దర్-నాగసేని, దోడాలోని దోడా వెస్ట్ , ఉదంపూర్‌లోని రామ్‌నగర్ సీట్లు కొత్తగా చేర్చబడ్డాయి.

లోయ రాజకీయాల్లో బీజేపీ తప్పులు

జమ్మూలో హిందూ ప్రాబల్యం ఉన్న రెండు స్థానాల్లో బీజేపీ ఓడిపోయింది. ఈ ప్రాంతంలో బీజేపీ ఎప్పటి నుంచో ఉన్నది. ఇక్కడ బీజేపీకి మంచి ఫలితాలు వస్తాయని పార్టీ వర్గాలు భావించాయి. ఏది ఏమైనప్పటికీ, జమ్మూలోని రెండు హిందూ ప్రాబల్యం ఉన్న స్థానాలైన బానీ, రాంబన్‌లో బీజేపీ ఓడిపోయింది. బానీలో స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ రామేశ్వర్ సింగ్ 2,048 ఓట్ల తేడాతో బీజేపీకి చెందిన జీవన్ లాల్‌పై విజయం సాధించారు. జీవన్‌లాల్ 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి గెలుపొందారు. కాగా, రాంబన్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన అర్జున్ సింగ్ రాజు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ తిరుగుబాటు నేత, స్వతంత్ర అభ్యర్థి సూరజ్ సింగ్ పరిహార్‌పై 9,013 ఓట్ల తేడాతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి రాకేష్ సింగ్ ఠాకూర్ మూడో స్థానంలో నిలిచారు.

2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 25 సీట్లు గెలుచుకోగా, పీడీపీ 28 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. వీరిద్దరూ కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2018 జూన్‌లో పీడీపీతో బీజేపీ పొత్తును విచ్ఛిన్నం చేసింది .దీంతో మెహబూబా ముఫ్తీ ప్రభుత్వం పడిపోయింది.

కొత్త స్థానాల ఫలితాలు..

▸▸ **రామ్‌గఢ్:** ఇక్కడి నుంచి బీజేపీకి చెందిన డాక్టర్ దేవేందర్ కుమార్ మన్యాల్ విజయం సాధించారు. దేవేందర్ కుమార్ 14,035 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి యశ్ పాల్ కుండల్‌పై విజయం సాధించారు.

▸▸ **తన్నమండి:** ఇక్కడ జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి ముజఫర్ ఇక్బాల్ ఖాన్ 6,179 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇక్బాల్ ఖాన్ బీజేపీకి చెందిన ఇక్బాల్ మాలిక్‌పై విజయం సాధించారు.

▸▸ **జస్రోటియా:** బీజేపీ అభ్యర్థి రాజీవ్ జస్రోటియా స్వతంత్ర అభ్యర్థి బ్రిజేశ్వర్ సింగ్‌పై 12,420 ఓట్ల తేడాతో విజయం సాధించారు. రాజీవ్ జస్రోటియాకు 34,157 ఓట్లు రాగా, బ్రిజేశ్వర్ సింగ్‌కు 21,737 ఓట్లు వచ్చాయి.

▸▸ **పెద్దర్-నాగసేని:** ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి సునీల్ కుమార్ శర్మ నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి పూజా ఠాకూర్‌పై 1,546 ఓట్ల తేడాతో విజయం సాధించారు. పీడీపీ అభ్యర్థి సందేశ్ కుమార్ మూడో స్థానంలో నిలిచారు.

▸▸ **దోడా వెస్ట్:** బీజేపీ అభ్యర్థి శక్తి రాజ్ పరిహార్‌కు 33,964 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ కుమార్‌పై 3,453 ఓట్ల తేడాతో విజయం సాధించారు.

▸▸ **రాంనగర్:** బీజేపీ అభ్యర్థి సునీల్ భరద్వాజ్ 9,306 ఓట్ల తేడాతో విజయం సాధించారు. జమ్మూ కాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీకి చెందిన అప్రీ దేవిపై ఆయన విజయం సాధించారు. ఇక్కడ కాంగ్రెస్‌కు చెందిన మూల్‌రాజ్ మూడో స్థానంలో నిలిచారు.

మితిమీరిన ఆత్మవిశ్వాసం

● రచ్చకెక్కిన కుమ్ములాటలు ● జాట్ ఓట్లనే నమ్ముకొని భంగపడిన కాంగ్రెస్



చండీగఢ్: హర్యానాలో బీజేపీ హ్యాట్రిక్ విజయాన్ని అడ్డుకోగలమని ధీమాగా ఉన్న కాంగ్రెస్‌కు భంగపాటు తప్పలేదు. లోక్‌సభ ఎన్నికలలో మొత్తం 10 స్థానాలలో కాంగ్రెస్, బీజేపీలు చెరో ఐదింటిని గెలుచుకున్నాయి. అంతకుముందు కాంగ్రెస్‌కు హర్యానా నుండి ప్రాతినిధ్యమే లేదు. ఐదు స్థానాలు గెలుచుకోవడంతో ఆ పార్టీలో మితిమీరిన ఆత్మవిశ్వాసం కన్పించింది. అదే చివరికి కొంప ముంచింది. మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హూడాపై ఎక్కువగా ఆధారపడడం నష్టం కలిగించిందా అని పార్టీలో అంతర్మథనం మొదలైంది. హూడా, కుమారి సెల్జా మధ్య విభేదాలు వీధిన పడడం కాంగ్రెస్‌కు ఇబ్బంది కలిగించింది. ఆలూ లేదు...చూలూ లేదు అన్న చందంగా ముఖ్యమంత్రి పదవి నాదంటే నాదంటూ వీరిద్దరూ వీధిన పడ్డారు. టిక్కెట్ల కేటాయింపులో హూడా మాటే చెల్లుబాటు కావడం సెల్జా శిబిరంలో ఆగ్రహం రేపింది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో విస్తృత ప్రచారం నిర్వహించినా, ప్రచారానికి గడువు ముగిసే ముందు యాత్ర చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. 2014లో బీజేపీ చేతిలో ఓటమి చవిచూసిన కాంగ్రెస్ పార్టీ, 2019 శాసనసభ ఎన్నికల నాటికి కొంతమేర పుంజుకుంది. అయితే 2019 లోక్‌సభ ఎన్నికలలో ఆ పార్టీకి ఒక్క స్థానం కూడా రాలేదు. కానీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో మళ్లీ పూర్వ వైభవం సంతరించుకున్న సంకేతాలు కన్పించాయి. అయినా ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా జాట్లు, దళితుల ఓట్ల పైనే ఆధారపడడం నష్టం చేకూర్చిందని పరిశీలకులు అభిప్రాయపడ్డారు. జాట్ వ్యతిరేక ఓట్లన్నీ సంఘటితమై బీజేపీకి పడ్డాయి. దళితుల ఓట్లను సైతం ఈసారి బీజేపీ కొంతమేర కొల్లగొట్టడం గమనార్హం.

సత్యమే గెలిచింది

(మొదటిపేజీ తరువాయి)




అనంతరం తన విజయంపై వినేశ్ ఫోగట్ మొదటిసారి స్పందించారు. 'ఇది ఎల్లప్పుడూ దేశంలో పోరాట మార్గాన్ని ఎంచుకునే ప్రతి అమ్మాయి గెలుపు. మహిళల పోరాటం వృథా కాదు. సత్యమే గెలిచింది. ఈ దేశం నాకిచ్చిన ప్రేమను నేను ఎప్పటికీ నిలబెట్టుకుంటాను' అని అన్నారు.. వినేశ్ ఫోగట్ విజయంపై బీజేపీ నాయకుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మాట్లాడుతూ 'ఆమె నా పేరును ఉపయోగించుకొని గెలిస్తే, దాని అర్థం మనం గొప్ప వ్యక్తులం. ఆ పేరుకు అంత శక్తి ఉంది. ఈ పేరుతో గెలవడం ద్వారానే ఆమె పడవ దాటింది. కానీ కాంగ్రెస్ పార్టీ మునిగిపోయింది' అని అన్నారు. అంతకుముందు బజరంగ్ పునియా మాట్లాడుతూ.. భారతదేశ ముద్దు బిడ్డ వినేశ్ ఫోగట్‌కు అభినందనలు. ఈ పోరు కేవలం ఒక్క జులనా సీటు కోసమే కాదు.. పార్టీల మధ్య కాదు. ఈ పోరాటం దేశంలోని బలమైన అణచివేత శక్తులకు వ్యతిరేకంగా జరిగింది. ఇందులో వినేశ్ విజేతగా నిలిచింది అని అన్నారు.

ఈవీఎంలలో అవకతవకలు

(మొదటిపేజీ తరువాయి)

అభీష్టాన్ని బీజేపీ తారుమారు చేసిందని ఆరోపించారు. మధ్యాహ్నం వరకు తాను ఈసీతో టచ్‌లో ఉంటూ మూడు జిల్లాల్లోని ఈవీఎంలపై ఫిర్యాదు చేసినట్టు జైరామ్ రమేశ్ తెలిపారు. హర్యానాలో ఫలితాలు పూర్తిగా అనూహ్యంగా, ఆశ్చర్యకరంగా ఉన్నాయని రమేశ్ వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయి పరిస్థితికి ఇవి పూర్తి విరుద్ధంగా ఉన్నాయని అన్నారు. ఇది ప్రజాభీష్టాన్ని తారుమారు చేయడమేనని, ప్రజాస్వామ్య ప్రక్రియను నాశనం చేయడమేనని విమర్శించారు. ఉదయమే ఈసీ వెబ్ సైట్లో ఫలితాల సరళి అప్‌డేట్ సరిగా జరగడం లేదంటూ జైరామ్ రమేశ్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఈసీ.. 'కాంగ్రెస్ ఆరోపణలు బాధ్యతారాహిత్యం' అని పేర్కొంది. మరో కాంగ్రెస్ నేత పవన్ ఖేరా కూడా హర్యానా ఫలితాలు అనూహ్యంగా ఉన్నాయని తెలిపారు.



హర్యానాలో ఆప్‌కు 'జీరో'

1.79 శాతం ఓట్లు వచ్చినా ఓటమే

జమ్మూ కాశ్మీర్‌లో 0.52 శాతం ఓట్లు

● దోడా సీటు కైవసం ● అసెంబ్లీలో అడుగుపెట్టనున్న మెహ్రాజ్ మాలిక్

చండీగఢ్: జమ్మూకాశ్మీర్, హర్యానా అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టిన ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) హర్యానాలో 1.79 శాతం ఓట్లు వచ్చినా 'జీరో'కే పరిమితమైంది. ఆ పార్టీ నుంచి ఒక్కరు కూడా గెలవలేకపోయారు. కానీ జమ్మూ కాశ్మీర్‌లో 0.52 ఓట్లు సాధించి దోడా స్థానానికి పోటీ చేసిన ఆప్ అభ్యర్థి మెహ్రాజ్ మాలిక్ విజయం సాధించారు. ఆమెకు మొత్తం 23,228 ఓట్లు వచ్చాయి. దీంతో మెహ్రాజ్ మాలిక్ అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ హర్యానా ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేశారు. అయినా అక్కడి ఓటర్లు విశ్వసించకపోవడంతో ఆ పార్టీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఓట్ల శాతం పెరిగినా అభ్యర్థులు ఓటమిపాలయ్యారు. ఈ ఎన్నికల్లో ఆప్‌నకు మొత్తం 1.79 శాతం ఓట్లు వచ్చాయి. అయితే జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆమ్ ఆద్మీ పార్టీకి ఊరటనిచ్చాయి. తొలిసారిగా ఈ పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాష్ట్ర అసెంబ్లీలో కూర్చోనున్నారు.

ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. హర్యానాతో పోలిస్తే జమ్మూ కాశ్మీర్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటరు శాతం తక్కువగా ఉంది. రాష్ట్రంలో ఆ పార్టీకి 0.52 శాతం ఓట్లు వచ్చాయి.

ఐదో స్థానానికి డిప్యూటీ సీఎం దుష్యంత్

● 'ఉచన కలాన్'లో బీజేపీ విజయం ● 32 ఓట్ల తేడాతో గెలుపు



చండీగఢ్ : హర్యానాలోని ఉచన కలాన్ స్థానం చర్చనీయాంశంగా మారింది. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి దేవేంద్ర అత్రి కేవలం 32 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి బ్రిజేంద్ర సింగ్‌పై విజయం సాధించారు. అయితే ఉచన కలాన్ నియోజకవర్గం డిప్యూటీ సీఎం, జేజేపీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా గెలుపొందిన స్థానం. కానీ ఈ ఎన్నికల్లో ఆయన ఐదో స్థానానికి పరిమితమయ్యారు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు సైతం చౌతాలా కంటే అధిక ఓట్లను పొందారు.

ఈ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి దేవేంద్ర అత్రికి 48968 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి బ్రిజేంద్ర సింగ్‌కు 48936 ఓట్లు వచ్చాయి, ఇద్దరి గెలుపోటముల్లో తేడా కేవలం 32 సీట్లు మాత్రమే. కేంద్ర మాజీ మంత్రి బీరేంద్ర సింగ్ కుమారుడు బ్రిజేంద్ర సింగ్ లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి టిక్కెట్ లభించనప్పటికీ, అసెంబ్లీ ఎన్నికల్లో బ్రిజేంద్ర సింగ్ ఆధిక్యంలో ఉండగా చివరికి 32 ఓట్ల తేడాతో ఆయన ఓడిపోయారు.

దుష్యంత్ చౌతాలా రాజకీయాలను పరిశీలిస్తే..

దుష్యంత్ చౌతాలా 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీతో పొత్తు పెట్టుకుని డిప్యూటీ సీఎం అయ్యారు. కానీ ఎన్నికలకు ముందు ఆయన జేజేపీ, బీజేపీ నుంచి విడిపోయారు. ఈ ఎన్నికల్లో దుష్యంత్ చౌతాలాకు 7950 ఓట్లు రాగా 41018 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. ఈ స్థానంలో వీరేంద్ర ఘోఘరియన్ మూడో స్థానంలో, వికాస్ నాలుగో స్థానంలో ఉన్నారు,

అయితే ఉచన కలాన్ నియోజకవర్గంలో 75.44 శాతం ఓటింగ్ జరిగింది. 2019లో ఇక్కడ 76.9 శాతం, 2014లో 85.4 శాతం ఓటింగ్ నమోదైంది. 2014లో బీజేపీ ఈ స్థానాన్ని కైవసం చేసుకోగా, 2019లో దుష్యంత్ చౌతాలా బీజేపీని ఓడించి ఈ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దుష్యంత్ చౌతాలా 2019లో 45 వేలకు పైగా ఓట్లతో ఈ స్థానాన్ని గెలుపొందగా, బీజేపీ రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర రాజకీయ కంచుకోటగా భావించే జింద్ జిల్లాలో ఉచన కలాన్ అసెంబ్లీ స్థానం ఉన్నది.



లడఖ్ కార్యకర్తల నిరాహార దీక్షకు సీపీఐ(ఎం) సంఘీభావం

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో లడఖ్‌ను చేర్చాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరవధిక నిరశన చేపట్టిన లడఖ్ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ప్రభృతులకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సంఘీభావం తెలియచేసింది. పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్, ఎంపి డాక్టర్ జాన్ బ్రిటాస్‌లు దీక్షా శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. పార్టీ సంఘీభావాన్ని ప్రకటించారు. లడఖ్ నుంచి దేశ రాజధాని వరకు శాంతియుతంగా పాదయాత్ర జరిపిన 150మంది కార్యకర్తలను ఢిల్లీలో ధర్నాకు అనుమతించకపోవడం మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రతిబింబిస్తోందని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో విమర్శించింది. ధర్నాకు అనుమతించకపోగా వారిని అరెస్టు చేసి, వారిపట్ల అనుచితంగా వ్యవహరించడం, లడఖ్ భవన్‌కు మాత్రమే వారిని పరిమితం చేయడాన్ని విమర్శించింది. దాంతో ఆ భవన్‌లోనే వారు నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. గిరిజనుల ఆమోదం లేకుండా లడఖ్ ప్రాంతాన్ని కార్పొరేట్ మైనింగ్ కంపెనీలు, ఇతర ప్రైవేట్ ప్రాజెక్టులకు అప్పజెప్పకుండా వాటి నుండి కాపాడేందుకు దాన్ని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా వుంది. 2019 మేనిఫెస్టోలో బిజెపి ఈ చర్య తీసుకుంటామని హామీ ఇచ్చింది. లడఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేర్చడానికి సీపీఐ(ఎం) మద్దతును తెలియచేస్తోంది. సంబంధిత మంత్రులు తక్షణమే సోనమ్ వాంగ్‌చుక్, ఆయన బృందంతో భేటీ కావాలని, ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పసిఫిక్ మహా సముద్రంలో రష్యా, చైనా సంయుక్త గస్తీ

మాస్కో : పసిఫిక్ మహా సముద్రంలోని ఈశాన్య ప్రాంతంలో రష్యా, చైనా నావికా దళాలకు చెందిన నౌకలు సంయుక్తంగా గస్తీ నిర్వహిస్తున్నాయని రష్యా మిలటరీ మంగళవారం తెలిపింది. ఈ నౌకలు జలాంతర్గాముల విధ్వంసక ఎత్తుగడలు, వ్యూహాలను అభ్యసిస్తున్నాయని పేర్కొంది. సంయుక్త సైనిక విన్యాసాల తర్వాత సంయుక్తంగా గస్తీ చర్యలు చేపట్టారు. రష్యాతో కలిసి సంయుక్త సముద్ర గస్తీ చర్యల్లో పాల్గొంటామని సెప్టెంబరు తొలినాళ్లలో చైనా తెలిపింది. రష్యా నిర్వహించే ఓషన్-2024 వ్యూహాత్మక విన్యాసాల్లో కూడా పాల్గొంటామని పేర్కొంది. జులైలో దక్షిణ చైనాలోని గుయాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో ఝాన్‌జియాంగ్ నగరం చుట్టుపక్కలా గగనతలంలో, సముద్ర జలాల్లో రెండు దేశాలు సంయుక్త విన్యాసాలు చేపట్టాయి. పశ్చిమ దేశాల గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా ముఖ్యంగా అంతర్జాతీయ వ్యవహారాల్లో అమెరికా ఆధిపత్యాన్ని నిరసిస్తూ ఇటీవలి సంవత్సరాల్లో రష్యా, చైనాలు ఆర్థిక, సైనిక సహకారాన్ని పెంపొందించుకుంటున్నాయి. తమ భాగస్వామ్యానికి పరిమితుల్లేవని వారు ప్రకటించారు.



జమ్మూకాశ్మీర్‌లో పారని బీజేపీ పాచిక

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఎత్తుగడలు వేసిన బీజేపీని ప్రజలు తిరస్కరించారు. ఆ పార్టీ బలమంతా కేవలం జమ్మూ ప్రాంతానికే పరిమితమైంది. కాశ్మీర్ లోయలో కమలం పూర్తిగా వాడిపోయింది. అసలు లోయలో ఆ పార్టీకి పోటీ చేసేందుకు అభ్యర్థులే కరువయ్యారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి విజయ తీరానికి చేరింది. 2014లో జరిగిన శాసనసభ ఎన్నికలలో అతి పెద్ద పార్టీగా అవతరించి, బీజేపీతో పొత్తు పెట్టుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన పీడీపీని ప్రజలు ఆదరించలేదు. ఆ పార్టీ కేవలం మూడు స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎన్నికలలో అనేక చిన్నా చితకా ప్రాంతీయ పార్టీలు పోటీ చేసినప్పటికీ అవి పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. జమ్మూ కాశ్మీర్‌లో 2019లో ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత ఇప్పుడు తొలిసారిగా ప్రజా ప్రభుత్వం ఏర్పడేందుకు మార్గం సుగమమైంది. ఈ ఎన్నికలలో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి అంచనాలకు భిన్నంగా మెజారిటీ స్థానాలు గెలుచుకుంది. 'నయా కాశ్మీర్' ప్రజలు బీజేపీని పూర్తిగా తిరస్కరించారు. లోయలో నేషనల్ కాన్ఫరెన్స్ క్లీన్‌స్వీప్ చేసింది. జమ్మూ ప్రాంతంలోని నౌషేరా స్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనా సైతం పరాజయం పాలవడం ఆ పార్టీకి గట్టి ఎదురు దెబ్బగా చెప్పవచ్చు.

నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం

శాసనసభ ఎన్నికలలో పీడీపీ ఘోర వైఫల్యాలను చవిచూడడంపై ఆ పార్టీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి స్పందిస్తూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని తెలిపారు. తాము గతంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశామని చెప్పారు. 2014 ఎన్నికలలో పీడీపీ అతి పెద్ద పార్టీగా అవతరించిన విషయం తెలిసిందే. కాగా తన కుమారుడు ఒమర్ అబ్దుల్లాయే ముఖ్యమంత్రి అవుతాడని ఎన్సీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు తనకు సంతోషాన్ని కలిగించాయని ఎన్సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా చెప్పారు. తాము ఊహించిన దాని కంటే ఎక్కువగా ప్రజల మద్దతు లభించిందని తెలిపారు. తమ పార్టీని నామరూపాలు లేకుండా చేసేందుకు గత ఐదు సంవత్సరాలుగా ప్రత్యర్థులు ప్రయత్నిస్తూనే ఉన్నారని విమర్శించారు. తమను రాజకీయంగా అంతం చేయబోయి వారే కనుమరుగయ్యారని ఎత్తిపొడిచారు. ఒమర్ బద్గాం నియోజకవర్గంలో పీడీపీ ప్రత్యర్థిపై 18 వేల ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు.

కతువా జిల్లాలోని బాషోలీ స్థానంలో సీనియర్ కాంగ్రెస్ నేత చౌదరి లాల్ సింగ్ మరోసారి పరాజయం చవిచూశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా గెలుపొందిన లాల్ సింగ్ తన కంచుకోట బాషోలీలో నాలుగో విజయం కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. దూరు స్థానంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మిర్ విజయం సాధించారు. సెంట్రల్ షాల్టెంగ్ స్థానంలో పీసీసీ అధ్యక్షుడు తారిక్ కర్రా జయ కేతనం ఎగరేశారు. జమ్మూకాశ్మీర్‌లో ఆప్ ఖాతా తెరిచింది. దోడా స్థానంలో ఆ పార్టీ అభ్యర్థి మేహ్‌రాజ్ మాలిక్ విజయం సాధించారు.

గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు

హర్యానాలో మాజీ ముఖ్యమంత్రి భూపీందర్ సింగ్ హూడా గర్హి సంప్లా-కిలోయ్ స్థానం నుంచి ఘన విజయం సాధించారు. ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ లద్వా స్థానంలో గెలుపొందారు. హిసార్‌లో పారిశ్రామికవేత్త, కురుక్షేత్ర ఎంపీ నవీన్ జిందాల్ తల్లి సావిత్రి జిందాల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మైనారిటీల ప్రభావం అధికంగా ఉన్న నుహ్, ఫెరోజ్‌పూర్ జిర్కా, పునహానా స్థానాలలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు.

డ్రై ఫ్రూట్స్ ఎప్పుడు తినాలి?

చాలా మంది ఉదయాన్నే డ్రై ఫ్రూట్స్ తినడానికి ఇష్టపడతారు. సాయంత్రం పూట తినే వారు కూడా ఉన్నారు. డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జీడిపప్పు, బాదం, మఖానా, ఎండుద్రాక్ష, ఖర్జూరం, వాల్‌నట్స్ వంటి డ్రై ఫ్రూట్స్ తినే సమయంపై పోషకాహార నిపుణులు ఏమంటున్నారో చూద్దాం. డ్రై ఫ్రూట్స్‌లో ప్రోటీన్, ఫైబర్, ఒమేగా 3, ఫ్యాటీ యాసిడ్స్‌తో సహా అనేక పోషకాలు ఉంటాయి. అవి శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బాదం, వాల్‌నట్‌లను రాత్రంతా నానబెట్టి తినాలి.

డ్రై ఫ్రూట్స్‌ను నానబెట్టి తింటే చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, డ్రై ఫ్రూట్స్ ఉదయం ఖాళీ కడుపుతో తినాలి. అప్పుడు శరీరానికి అవసరమైన



పోషకాలు అందుతాయి. రోజంతా తగినంత శక్తిని పొందుతారు. ఉదయం అల్పాహారానికి ముందు లేదా తర్వాత తీసుకోవచ్చు.

మధ్యాహ్న భోజనం తర్వాత డ్రై ఫ్రూట్స్‌ను స్నాక్స్‌గా కూడా తినవచ్చు. కానీ రాత్రిపూట వీటిని తినకుండా ఉంటేనే మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు. వీటిలో ఉండే అధిక ప్రోటీన్ జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. రాత్రిపూట డ్రై ఫ్రూట్స్ తినడం వల్ల జీర్ణక్రియ సరిగా పనిచేయదు. ■

'మహిళలకు బాధ్యతలు ఎక్కువ. ఇంటి పనికి, పిల్లలకు ఇచ్చిన ప్రాధాన్యత ఉద్యోగానికి ఇవ్వరు' అంటూ వారి అభివృద్ధికి ఎన్నో ఆటంకాలు సృష్టిస్తుంది ఈ పురుషాధిక్య సమాజం. అనేక సాకులు చూపి గొప్ప అవకాశాలకు దూరం చేస్తుంటారు. అలాంటి ఆటంకాలను బద్దలు కొట్టుకుంటూ తమ కలలను నిజం చేసుకుంటున్న వారు మన ముందు ఎందరో ఉన్నారు. అలా పోలీసు డిపార్టుమెంటులో ముందుకు దూసుకుపోతున్న మహిళా ధీరల పరిచయాలు నేటి మానవిలో...

ఆటంకాలు బద్దలు కొట్టుకుంటూ...



అష్నా చౌధురి

ఇద్దరు బిడ్డల తల్లిగా ఉంటూనే...

ఇంట్లో ఏడు నెలల చిన్నారి. మరో పాపకు రెండున్నర ఏండ్లు. వారి ఆలనా పాలనా చూసుకోవడమంటే అంత సులభమైన విషయం కాదు. అలాంటిది ఆ పిల్లల్ని అమ్మమ్మ వద్ద వదిలి తన కలలను నెరవేర్చుకునేందుకు అడుగు బయట పెట్టింది. ఆమే మణిమాల. సివిల్ సర్వీసెస్ సాధించాలనేది తన కోరిక. కానీ ఇంతలో ఎస్సై నోటిఫికేషన్ రావడంతో ఎలాగైనా ఆ జాబ్ కొట్టాలనే ఆకాంక్షతో బయల్దేరింది. ఎట్టకేలకు తన గమ్యాన్ని చేరుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈవెంట్స్ కోసం కష్టనష్టాలకోర్చి నిరూపించుకున్నారు. మణిమాల తండ్రి నాగళ్ల శ్రీనివాస్. అంబర్‌పేట్‌లోని సీపీఎల్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. భర్త డి.వెంకటేశ్వరరావు కూడా కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని పీవోపీలో పాల్గొని తల్లిదండ్రులు, భర్త కళ్లలో ఆనందం చూశానని ఆమె సంతోషంగా చెప్పుకుంటున్నారు. తండ్రి, స్నేహితురాలు సృజన తనకు స్ఫూర్తి అని ఆమె చెబుతున్నారు. ఒక మహిళగా ఆర్థిక స్వావలంబన ఉడటం చాలా ముఖ్యమని, తన విధి నిర్వహణలో భాగంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు కృషి చేస్తానని అంటున్నారు.



మణిమాల

సమాజానికి సేవ చేయాలని

ఒడిలో పాపాయికి చనుబాలు మాన్పించి 32 ఏండ్ల వయసులో గ్రౌండ్ బాటపట్టారు. అనుక్షణం తనని తాను నిరూపించుకోవాలని వందకు రెండొందల రెట్లు కష్టపడ్డారు. మైదానంలో శివంగిలా దూకారు. మెదడుకు పదును పెట్టారు. పోలీసు శిక్షణలో భాగంగా ఇండోర్, ఔట్ డోర్ విభాగంలో దూసుకుపోయి టాపర్‌గా నిలిచి పాసింగ్ ఔట్ పరేడ్ కమాండెంట్‌గా నిలిచారు భాగ్యశ్రీ. భద్రాచలంలో సారపాక గ్రామానికి చెందిన ఆమె నిరుపేద కుటుంబం నుండి వచ్చారు. తండ్రి నాగేశ్వరరావు. ఆయన పెండిండ్లకు వంటలు చేస్తుంటారు. తల్లి దుర్గ. భర్త పవన్ కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. చదువు మాత్రమే పేదరికాన్ని దూరం చేస్తుందని నమ్మి చదువుపై శ్రద్ధ పెట్టారు. గతంలో గ్రూప్-4 ఉద్యోగం చేస్తూ సమాజానికి నేరుగా ఏదైనా సాయం చేయాలన్న తలంపుతో ఎస్సై కోసం సన్నద్ధమయ్యారు. ఆ సయంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. భర్త ప్రోత్సాహంతో ఇదంతా సాధ్యమైందని ఆమె చెబుతున్నారు. శిక్షణలో ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకున్నానని, ఫీల్డ్‌లో ఎంతో కష్టపడతానని చెబుతున్నారు.



భాగ్యశ్రీ

ఆఫీసర్ అవ్వాలని...

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షల్లో విజయం సాధించాలంటే చాలా కష్టం. మరో రంగంలో ఉంటూ యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు ప్రిపరేషన్ చేయడం కత్తి మీద సాము లాంటిది. ఉత్తరప్రదేశ్‌లోని జిల్లా పిల్ఖువాకి చెందిన ఆష్నా చౌధురి మాత్రం ఇప్పుడు చాలా మందికి రోల్ మోడల్‌గా మారారు. యూపిఎస్సీ సివిల్స్ ఫలితాల్లో విజయం సాధించి ఐపీఎస్ ఆఫీసర్ అయ్యారు. ఇప్పుడు రౌడీలను పరిగెత్తించే డైనమిక్ ఐపీఎస్ ఆఫీసర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు.

అష్నా చౌధురి ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాపుడ్ జిల్లా పిల్ఖువాకి చెందిన వారు. ఈమె చదువుకున్న ధనిక కుటుంబానికి చెందిన వారు. ఆమె కుటుంబంలో పలువురు ప్రొఫెసర్లు ఉన్నారు. అందుకే ఆష్నా కూడా పీహెచ్‌డీ చేస్తుందని అందరూ అనుకున్నారు. కానీ ఆష్నా ఆలోచన వీటన్నింటికీ భిన్నంగా ఐపీఎస్ ఆఫీసర్ అయ్యారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. దాంతో వారి ఇంట్లో తరుచుకుగా అధికారుల గురించి మాట్లాడుకునే వారు. దాంతో ఆమె యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పట్ల ఆకర్షితురాలు అయ్యింది. ఓ మంచి ఆఫీసర్ కావాలని నిర్ణయించుకుంది.

ఆష్నా ఘజియాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదువుకుంది. లేడీ శ్రీ రామ్ కాలేజ్ నుంచి ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో ఆనర్స్ చేసింది. ఆ తర్వాత సౌత్ ఏషియన్ యూనివర్సిటీ నుంచి ఇంటర్నేషనల్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేసింది. చదువుకునే సమయంలోనే ఆమె అనేక పరీక్షలలో ఉత్తీర్ణత సాధించింది. అయితే జోష్ టెక్స్ ఈమెను తిరస్కరించింది. అంతటితో ఆగిపోకుండా, అధైర్యపడకుండా కృషి చేస్తూనే ఉంది. తన మాస్టర్స్ తర్వాత ఏడాది విరామం తీసుకొని యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు సిద్ధమయింది. ఈ పరీక్షల కోసం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల పాటు నిరంతరం చదువుకునేది. గత ఏడాది ప్రశ్నాపత్రాలను చదివి అందుకు తగిన టైమర్‌ని సెట్ చేసుకొని వాటిని పరిష్కరించేది. అయితే మొదటి రెండు ప్రయత్నాలల్లో ఆమె విఫలమయింది. కానీ పట్టిన పట్టు వదలకుండా కష్టపడి ప్రిపరేషన్‌ను కొనసాగిస్తూనే ఉంది. ఎట్టకేలకు యూపీఎస్సీ సివిల్స్ మూడో ప్రయత్నంలో 116వ ర్యాంక్ సాధించింది. తన కలను నెరవేర్చుకుని ఐపీఎస్ ఆఫీసర్ అయింది.

'మీకు ధైర్యం ఉన్నంత వరకు మీరు మీ ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లో విరమించ కూడదు. ఎందుకంటే ప్రయత్నించే వారు ఎప్పుడూ విఫలం కారు' అని ఈ యువ ఐపీఎస్ అధికారిణి నేటి యువతకు సందేశం ఇస్తుంది. అలాగే 'జీవితంలోని నమ్మిన సూత్రం ఏమిటంటే మీరు మీకు కావలసిన దాని కోసం రాత్రి, పగలు త్యాగం చేయాలని, లక్ష్య సాధన కోసం చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఇలా చేస్తే తప్పకుండా మీ గమ్యాన్ని చేరుకుంటారు' అని కూడా చెబుతు న్నారు. ఆష్నా చౌదరది ఇప్పుడు చాలా మందికి రోల్ మోడల్‌గా మారింది. సోషల్ మీడియాలో ప్రముఖ వ్యక్తులలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇన్‌స్టాలో ఈమెకు రెండు లక్షల అరవై నాలుగు మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. అందం, అధికారం మాత్రమే కాదు ఈమె చిరుతపులి లాంటిది అని ఎంతో మంది కామెంట్లు చేస్తున్నారు. ■

ఉపాధ్యాయ పోస్టులకు 10,006 మంది ఎంపిక

(మొదటిపేజీ తరువాయి)

వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో రాతపరీక్షలను నిర్వహించింది. గతనెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డీఎస్సీ ఫలితాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈనెల రెండో తేదీ నుంచి ఐదో తేదీ వరకు జిల్లాల్లో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. 1:3 నిష్పత్తిలో 25,924 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తే, వారిలో 24,466 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, డీఎస్సీ మార్కులు, టెట్ మార్కులను పరిగణనలోకి తీసుకుని 1:1 నిష్పత్తి జాబితాను పాఠశాల విద్యాశాఖ రూపొందిం చింది. 24,466 మందిలో 10,006 మంది అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక య్యారు. అయితే డీఎస్సీ రాతపరీక్షలను నిర్వహించిన 56 రోజుల్లో డీఎస్సీ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. 65 రోజుల్లోనే నియామక పత్రాలను అందిస్తుండడం గమనార్హం.

డీఎస్సీ పోస్టులు, ఎంపికైన అభ్యర్థుల వివరాలు

కేటగిరీ	పోస్టులు	ఎంపికైన అభ్యర్థులు
స్కూల్ అసిస్టెంట్	2,629	2,515
ఎస్జీటీ	6,508	6,277
పండితులు	727	685
పీఈటీలు	182	145
మొత్తం	10,046	9,622
స్పెషల్ ఎడ్యుకేషన్		
స్కూల్ అసిస్టెంట్	220	103
ఎస్జీటీ	796	281
మొత్తం	1,016	384
మొత్తం పోస్టులు	11,062	10,006


కాంగ్రెస్‌కు..నో ఎంట్రీ బోర్డులే

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలోకి రావడం చాలా అరుదు. అసోంలో అధికారంలోకి వచ్చి 13ఏండ్లు అయ్యింది. కొన్ని రాష్ట్రాల్లో 60ఏండ్ల నుంచి అధికారంలోకి రాలేదు. ఒక్కసారి కాంగ్రెస్‌ను ఓడిస్తే మళ్లీ అధికారంలోకి రానివ్వరు. 'నో ఎంట్రీ' బోర్డు పెట్టేస్తారు" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. భారత సమాజం, ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు ప్రపంచవ్యాప్తంగా కుట్రలు జరుగుతున్నాయన్న ఆయన.. కాంగ్రెస్, దాని పక్షాలు ఇందులో భాగమేనన్నారు.అటు జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఎన్నికలు.. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువల విజయమని మోడీ పేర్కొన్నారు. ఓట్ల విషయంలో జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు.బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు హాజరయ్యారు.

మంచుకొండల్లో ఎగిరిన ఎర్ర జెండా

(మొదటిపేజీ తరువాయి)



దార్‌కు 7,561, అప్నీ పార్టీ అభ్యర్థి మహమ్మద్ అఖీబ్ దార్‌కు 2,726, స్వతంత్ర అభ్యర్థి జమిన్ ఇర్షాద్ పర్రీకి 993, నేషనల్ పాంథర్స్ పార్టీ అభ్యర్థి సుదర్శన్ సింగ్‌కు 778, అమన ఔర్ శాంతి తెహ్రీక్-ఎ-జమ్మూకాశ్మీర్ అభ్యర్థి అబ్దుల్ అహద్ మిర్‌కు 646, స్వతంత్ర అభ్యర్థి సజాద్ అహ్మద్ దార్‌కు 636, పీపుల్స్ కాన్ఫరెన్స్ అభ్యర్థి జనీర్ అహ్మద్ లవేకి 506, స్వతంత్ర అభ్యర్థి అఫ్రూజా బానూకు 344, నోటాకు 1,358 ఓట్లు వచ్చాయి. ఈ స్థానాన్ని సీపీఐ (ఎం) 1996 నుంచి గెలుచుకుంటోంది.

మార్కెట్‌లో నకిలీ సర్టిఫికెట్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా గుట్టును సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్సు, అంబర్‌పేట్ పోలీసులు రట్టు చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 84 ఫేక్ సర్టిఫికెట్లు, 4 ఖాళీ సర్టిఫికెట్లు, 14 జూడీషియల్ స్టాంప్ పేపర్స్, కంప్యూటర్, రెండు ఐఫోన్లతో పాటు ఇతర పత్రాలు, స్టాంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం టాస్క్‌ఫోర్సు అదనపు డీసీపీ ఏ.శ్రీనివాస్‌రావు వివరాలు వెల్లడించారు. మల్కాజిగిరికి చెందిన మహ్మద్ మహఫూజ్ ఇక్బాల్ అంబర్‌పేట్‌లోని ఒవైసీ నగర్‌లో 'ఎంస్ ఎంటర్‌ప్రైజెస్' పేరుతో జిరాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఆన్‌లైన్‌లో వర్క్ ఆర్డర్ తీసుకుని, వాటిని పూర్తిచేసి తిరిగి పంపించేవాడు. కొద్ది నెలల నుంచి వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్న ఇక్బాల్ తన స్నేహితుడైన షేక్ ఇలియాస్ హైమద్‌కు విషయం చెప్పాడు. ఇద్దరూ కలిసి జిరాక్స్ సెంటర్‌లో వివిధ కాలేజీలు, యూనివర్సిటీలకు చెందిన ఎస్-ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు ఇతర డాక్యుమెంట్లను నకిలీవి తయారు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేస్తున్న నిందితులు వాటికి నకిలీ తయారు చేస్తూ కావాల్సిన వారికి, తెలిసిన వారికి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అనంతరం వారిని అంబర్‌పేట్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు.

భౌతికశాస్త్రంలో ఇద్దరికి నోబెల్

(మొదటిపేజీ తరువాయి)

పురస్కారం వరించింది. స్టాక్‌హోంలో ఉన్న కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లోని నోబెల్ బందం ఈ పురస్కారాలను ప్రకటించింది.

గతేడాది (2023) భౌతికశాస్త్రంలో ఈ పురస్కారం ముగ్గురిని వరించింది. పరమాణువుల్లోని ఎలక్ట్రాన్ల కదలికలను శోధించిన ఫ్రాన్స్ శాస్త్రవేత్త పియర్ అగోస్తి, హంగేరియన్ సంతతి వ్యక్తి ఫెరెంక్ క్రౌజ్, ఫ్రాన్స్-స్వీడన్ శాస్త్రవేత్త యాన్ ఎల్ హ్యులియర్‌లు ఈ పురస్కారం అందుకున్నారు. మొత్తంగా 1901 నుంచి ఇప్పటివరకు 117సార్లు భౌతికశాస్త్రంలో నోబెల్ ప్రకటించారు.

వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14 వరకు కొనసాగనుంది. సోమవారం వైద్యశాస్త్రంలో విజేతలను ప్రకటించగా మంగళవారం భౌతికశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడించారు. బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యం విభాగాల్లో విజేతలను ప్రకటిస్తారు. శుక్రవారం రోజున నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు.

స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తున్న సంగతి తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా 1901 నుంచి ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డుల ను ఏటా ప్రదానం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు 11లక్షల స్వీడిష్ క్రోనర్ (10లక్షల డాలర్లు) నగదు అందుతుంది. డిసెంబర్ 10న నిర్వహించే కార్యక్రమంలో గ్రహీతలకు అవార్డులను అందజేస్తారు.

కోల్‌కతా హత్యాచారంపై మనస్తాపం

కోల్‌కతా : విధుల్లో వుండగా అత్యాచారానికి, హత్యకు గురైన జూనియర్ డాక్టర్‌కు న్యాయం చేయాలని కోరుతూ ఆమరణ నిరశన చేపట్టిన జూనియర్ డాక్టర్లకు సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఆర్.జి.కర్ ఆస్పత్రికి చెందిన దాదాపు 50మంది సీనియర్ డాక్టర్లు మంగళవారం రాజీనామాలు చేశారు. ఈ మేరకు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఆస్పత్రిలోని వివిధ విభాగాల హెడ్‌ల సమావేశం ఉదయం జరిగిందని, అందులో మూకుమ్మడిగా రాజీనామాలు చేయాలని నిర్ణయించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఆర్.జి.కర్ ఆస్పత్రిలో తమ సహచరులు తీసుకున్న నిర్ణయాన్నే తాము కూడా అనుసరించాలని ఎన్ఆర్ఎస్ మెడికల్ కాలేజీ అండ్ ఆస్పత్రికి చెందిన సీనియర్ డాక్టర్లు యోచిస్తున్నారని ఆ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ డాక్టర్స్ కూడా వారికి సంఘీభావం ప్రకటించింది. అవినీతిమయంగా మారిన ఆరోగ్య వ్యవస్థకు స్వస్తి పలకాలని వారు కోరుతున్నారు.

తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గత నాలుగు రోజులుగా జూనియర్ డాక్టర్లు ఆమరణ నిరశన చేపట్టారు. అయితే సమస్యల పరిష్కారానికి ఇంతవరకు సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేదని ప్లాట్‌ఫారమ్ ఆఫ్ డాక్టర్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. నిరశనలో వున్న వారి ఆరోగ్య పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. కేంపస్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని, రోగులతో స్నేహంగా మెలిగే వ్యవస్థను తీసుకురావాలని కోరుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తాము వారికి సంఘీభావం తెలియచేస్తున్నామన్నారు. ప్రైవేటు రంగంలో వున్న వారు కూడా సముచితమైన కార్యాచరణ చేపట్టాలని ప్లాట్‌ఫారమ్ ఆఫ్ డాక్టర్స్ కోరింది. విధుల్లో చేరాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినప్పటికీ ఏడుగురు డాక్టర్లు మంగళవారం కూడా ఆమరణ నిరశన కొనసాగించారు.

కులగణన విధివిధానాలపై కసరత్తు

- నెల రోజుల్లోపు పూర్తిచేసే యోచన
- రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం కీలక భేటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణన విధివిధానాలపై కసరత్తు చేస్తున్నది. అందుకు తగిన విధంగా షెడ్యూల్ ఖరారు చేయటానికి హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో సమావేశాన్ని నిర్వహించారు. దీనిలో బీసీ కమిషన్ ఛైర్మెన్ నిరంజన్‌తో పాటు ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బీసీల్లో రిజర్వేషన్లు ఖరారు చేయటానికి బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే కులగణన కోసం అసెంబ్లీలో, క్యాబినెట్‌లో కూడా తీర్మానం చేసింది. అయితే కులగణన ఎలా చేయాలి అనే దానిపై అధికారులతో చర్చించారు. వివిధ రాష్ట్రాల్లో చేసిన కులగణనపై అధ్యయనం చేశారు. కర్నాటక, బీహార్, ఆంధ్రప్రదేశ్‌లో చేసిన గణనపై సమావేశంలో చర్చించారు. కర్నాటకలో బీసీ కమిషన్, బీహార్‌లో జీఏడి ద్వారా, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ ద్వారా చేసిన సర్వేల అంశాలపై చర్చించారు. అక్కడ డోర్ టూ డోర్ పూర్తి స్థాయి సర్వే నిర్వహించారు. ఇందులో మూడు రాష్ట్రాల్లో చేసిన బెస్ట్ పాలసీని తీసుకుని రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వటం, ప్రభుత్వం వర్గీకరణ మీద సబ్ కమిటీ సమావేశాలు కొనసాగుతుండటంతో కులగణన సర్వే నివేదిక ఎస్సీ వర్గీకరణకు కూడా అవసరం ఉంటుంది. కాబట్టి పూర్తి స్థాయి కులాల గణన చేసి వారికి అవసరమైన డేటా తీసుకునేలా చేసే అంశంపైనా చర్చించారు. రిపోర్టు పారదర్శకంగా ఉండడానికి ఇరు శాఖలకు సంబంధం లేకుండా కులగణన జీఏడీ లేదా పంచాయతీ రాజ్, రెవెన్యూలో దేని ద్వారా చేయించాలనే దానిపై రెండు రోజుల్లో సీనియర్ మంత్రులతో ప్రభుత్వం కీలక సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కుల గణనకు సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో మానిటరింగ్ చేసేలా చూడాలని సూచించారు. నెల రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర కమిటీ సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన మంగళవారం వర్చువల్‌గా నిర్వహించారు. నర్సిరెడ్డి గత ఐదున్నర ఏండ్లుగా శాసన మండలి సభ్యునిగా విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చావ రవి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలతోపాటు వివిధ వర్గాల ప్రజాసమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశారని వివరించారు. ఆయన సేవలకు గుర్తింపుగా మరోసారి శాసన మండలి అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యక్షులు రాములు, దుర్గాభవాని, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులతోపాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెరువుల గుర్తింపునకు హైడ్రా భారీ కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

వారు అందించిన వివరాలతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువులపై సమగ్ర నివేదిక తయారీ చేయనున్నారు. సర్వే ఆఫ్ ఇండియా సేకరించిన డేటాను డిజిటలైజేషన్‌తోపాటు పూర్తి వివరాలతో నివేదికను తయారు చేయనున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారించి ఆ తర్వాత తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ప్రాధాన్యత క్రమంలో చెరువులను పునరుద్ధరించేందుకు హైడ్రా ప్రయత్నిస్తోంది.

మంత్రి సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. తన కుమారుడి విడాకులు మాజీ మంత్రి కే తారకరామారావు వల్లే జరిగాయంటూ మంత్రి కొండా సురేఖ తన కుమారుడు అక్కినేని నాగచైతన్య, సమంత పేర్లను ప్రస్తావిస్తూ అసభ్యంగా మాట్లాడారని చెప్పారు. 2017లో తన కుమారుడు నాగచైతన్య, సమంత వివాహం చేసుకున్నారనీ, 2021లో వ్యక్తిగత కారణాలతో ఇద్దరూ విడాకులు తీసుకున్నారని కోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారంలో మాజీమంత్రి కే తారకరామారావు పేరును ప్రస్తావిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవని పేర్కొన్నారు. మంత్రి వ్యాఖ్యలు తన మేనకోడలు సుప్రియ ద్వారా తెలిశాయనీ, ఆ మేరకు మంత్రి మాట్లాడిన మాటలు సామాజిక మాధ్యమాలు, వార్తా ఛానళ్ల ద్వారా ప్రచారంలోకి వెళ్ళాయని తెలిపారు. మంత్రి వ్యాఖ్యలతో తాను, తన కుటుంబసభ్యులు తీవ్ర మనస్తాపానికి గురయ్యామనీ, చేయని తప్పుకు అందరిలో తలవంచుకొనేలా మంత్రి వ్యాఖ్యలు బాధించాయని వివరణ ఇచ్చారు. తన కుటుంబం పట్ల ఉద్దేశ్యపూర్వకంగానే మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారనీ, అందువల్ల ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. న్యాయస్థానం ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. అనంతరం మొదటి సాక్షిగా నాగార్జున మేనకోడలు సుప్రియ సాక్ష్యాన్ని కూడా నమోదు చేశారు. దీనిపై నాగార్జున తరపు న్యాయవాది మీడియాతో మాట్లాడుతూ ఈనెల 10న మరో సాక్షి వాంగ్మూలాన్ని కూడా నమోదు చేసి, మంత్రి కొండా సురేఖకు న్యాయస్థానం నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే మంత్రి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కోర్టుకు సమర్పించామన్నారు. అంతకుముందు సినీనటుడు నాగార్జునతో పాటు ఆయన భార్య అక్కినేని అమలు, కుమారుడు నాగచైతన్య, మేనకోడలు సుప్రియ, సోదరి నాగ సుశీల కూడా కోర్టుకు హాజరయ్యారు.

ఈ నెలలోనే స్కిల్ వర్సిటీ ప్రారంభం



(ఫైల్)

మొదటి విడతలో నాలుగు కోర్సులు

- దసరా సెలవుల తర్వాత తొలి నోటిఫికేషన్ : వీసీ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావు వెల్లడి

రూ.7 కోట్లతో రెడింగ్టన్ లాజిస్టిక్ ల్యాబ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే వినూత్నంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఈ నెల నుంచే కోర్సులను ప్రారంభించనుంది. యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణను అందించి జాబ్ గ్యారంటీ ఉండే కోర్సులను ఈ వర్సిటీ నిర్వహిస్తుంది. ఆయా రంగాల్లో పేరొందిన కంపెనీలు, సంస్థల భాగస్వామ్యంతో ఈ కోర్సులకు అవసరమైన సిలబస్‌ను రూపకల్పన చేస్తుంది. ఆయా రంగాల్లో నిపుణులతో విద్యార్థులకు బోధన తరగతులతో పాటు ప్రాక్టికల్స్‌ను నిర్వహిస్తుంది. హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీ భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే భూమిపూజ చేశారు. ఈ ఏడాది గచ్చిబౌలిలో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో తాత్కాలికంగా యూనివర్సిటీ తరగతులను ప్రారంభించాలని స్కిల్ యూనివర్సిటీ చైర్మెన్ ఆనంద్ మహీంద్రా సమక్షంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగిన ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు స్కిల్ యూనివర్సిటీ వీసీ వీఎల్వీఎస్-ఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాజిస్టిక్స్, మెడికల్ అండ్ హెల్త్, ఫార్మా రంగాల్లో అత్యధిక ఉద్యోగాల డిమాండ్ ఉన్న నాలుగు కోర్సులను మొదటి విడతలో ప్రారంభిస్తామని వివరించారు.

దసరా సెలవుల తర్వాత ఈ కోర్సులకు సంబంధించిన అడ్మిషన్లు, అర్హతల పూర్తి వివరాల నోటిఫికేషన్ వెలువడనుందని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని కోర్సులను ప్రారంభించేందుకు స్కిల్ యూనివర్సిటీ వివిధ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోందని వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో లాజిస్టిక్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రముఖ గ్లోబల్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ కంపెనీ రెడింగ్టన్ ముందుకొచ్చిందనీ, దాదాపు రూ.ఏడు కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధపడిందని వివరించారు. లాజిస్టిక్స్ రంగానికి సంబంధించి రెండు షార్ట్ టర్మ్ కోర్సులను యూనివర్సిటీ ప్రారంభించనుందని తెలిపారు. వేర్ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్, కీ కంటెయినర్ ఎగ్జిక్యూటివ్ పేర్లతో ఈ కోర్సులను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. వాటి నిర్వహణకు లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సహకారం అందిస్తోందని వివరించారు. నర్సులకు ఉన్నతమైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఫినిషింగ్ కోర్సును వర్సిటీ ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తోందని తెలిపారు.

అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్‌తో కలిసి ఈ కోర్సు నిర్వహించనుందన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫార్మా అసోసియేట్ పేరుతో అప్రెంటీస్‌షిప్ ఇండక్షన్ కోర్సును యూనివర్సిటీ ఈ ఏడాది నుంచే ప్రారంభించనుందని వివరించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ సహకారంతో ఈ కోర్సును నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కోర్సు కాల వ్యవధి ఆరు నెలలు ఉంటుందని పేర్కొన్నారు. యూనివర్సిటీ ప్రారంభించనున్న స్కిల్ డెవెలప్‌మెంట్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు గ్యారంటీగా వస్తాయని తెలిపారు. నైపుణ్య శిక్షణను అందుకున్న విద్యార్థులకు నెలకు కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేల వేతనం ఉండే ఉద్యోగాల్లో చేరే అవకాశాలుంటాయని పేర్కొన్నారు.

మహ్మదుల్లా రిటైర్మెంట్



ఢిల్లీ: బంగ్లాదేశ్ వెటరన్ బ్యాటర్ మహ్మదుల్లా టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్‌తో హైదరాబాద్ వేదికగా జరిగే మూడో మ్యాచ్ ఈ ఫార్మాట్‌లో తన ఆఖరి మ్యాచ్ అని తెలిపాడు. వన్డే ఫార్మాట్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మహ్మదుల్లా వెల్లడించాడు. 2021లోనే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన అతడు.. వన్డేలలో మాత్రం కొనసాగనున్నాడు.

లంకను దాటేస్తారా?

భారత్‌కు నేడు కీలక మ్యాచ్



దుబాయ్ : ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా మరో కీలక సవాల్‌కు సిద్ధమైంది. గ్రూప్-లో రెండు మ్యాచులు ఆడిన భారత్ ఓ మ్యాచ్‌లో విజయం సాధించి, మరో మ్యాచ్‌లో పరాజయం పాలైంది. న్యూజిలాండ్ చేతిలో భారీ ఓటమితో హర్మన్‌ప్రీత్ సేన నెట్ రన్‌రేట్ భారీగా దెబ్బతింది. తర్వాతి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉంది. దీంతో నేడు శ్రీలంకతో సమరంలోనే భారీ విజయం సాధించి నెట్ రన్‌రేట్‌ను మెరుగు పర్చుకోవటంపై భారత్ గురి పెట్టింది. ఇక్కడి పిచ్‌లు చాలా నెమ్మదిగా ఉన్నాయి. టీమ్ ఇండియా దూకుడు శైలికి సరిపోవటం లేదు. టాప్ ఆర్డర్‌లో కీలక బ్యాటర్లు తొలి పది ఓవర్లలోనే నిష్క్రమిస్తే మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి పెరుగుతుంది. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో భిన్నమైన ప్రణాళిక అమలు చేసి సక్సెస్ అయ్యారు. కానీ స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు ఎక్కువ ఓవర్లు ఆడాల్సి వచ్చింది. నేడు శ్రీలంకతో మ్యాచ్‌లో బ్యాటర్లు కాస్త వేగంగా పరుగులు చేయాల్సిన అవసరం ఉంది. షెఫాలీ వర్మ, మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్ సహా జెమీమా రొడ్రిగస్ భారత్‌కు కీలకం కానున్నారు. పేసర్లు అరుంధతి రెడ్డి, రేణుక సింగ్ సహా స్పిన్నర్ దీప్తి శర్మ శ్రీలంకతో మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేయనున్నారు. భారత్, శ్రీలంక మహిళల పోరు నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం కానుంది.

జోరు మీదున్న భారత్

సిరీస్ కాపాడుకునేందుకు పర్యాటక జట్టు యత్నం

రాత్రి 7 నుంచి స్పోర్ట్స్-18లో లైవ్



ఢిల్లీ : స్వదేశంలో బంగ్లాదేశ్‌పై మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న భారత క్రికెట్ జట్టు.. బుధవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరుగబోయే రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. గ్వాలియర్‌లో తొలి టీ20 నెగ్గిన ఊపులో ఉన్న సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని యువ భారత్.. ఢిల్లీలోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను ఒడిసిపట్టుకోవాలని భావిస్తోంది. రిషబ్, అక్షర్, బుమ్రా, గిల్, జైస్వాల్ వంటి స్టార్ ఆటగాళ్లు అందుబాటులో లేకున్నా అభిషేక్, మయాంక్, నితీశ్ లాంటి యువ క్రికెటర్లతోనే సత్తా చాటింది. మరోవైపు తమకంటే తక్కువ అనుభవం ఉన్న జట్టుతో ఆడి తొలి టీ20లో దారుణ పరాభవాన్ని మూటగట్టుకున్న బంగ్లాదేశ్.. ఢిల్లీలో అయినా గెలిచి సిరీస్ ఆశలు నిలుపుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం నాటి మ్యాచ్ రసవత్తరంగా సాగనుంది. ఢిల్లీ పిచ్ బ్యాటర్లకు అనుకూలించే అవకాశాలు మెండుగా ఉండటంతో భారీ స్కోర్లు నమోదయ్యే చాన్స్ ఉంది.

సంజూ, అభిషేక్ ఏం చేసేనో?

రెగ్యులర్ ఓపెనర్లు గిల్, జైస్వాల్‌కు విరామంతో గ్వాలియర్‌లో ఓపెనర్లుగా వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, యువ సంచలనం అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. ఈ ఇద్దరూ ఇన్నింగ్స్‌ను ధాటిగానే మొదలుపెట్టినా వాటిని భారీ స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. ముఖ్యంగా శాంసన్‌కు వరుసగా అవకాశాలిస్తున్నా విఫలమవుతుండటం ఆందోళన కలిగించేదే. ఈ నేపథ్యంలో అతడికి నేటి మ్యాచ్ కీలకం కానుంది. అభిషేక్ భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. తొలి మ్యాచ్‌లో కెప్టెన్ సూర్య, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా దూకుడుగా ఆడగా ఢిల్లీలోనే అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. వీళ్ల దూకుడుతో టార్గెట్‌ను భారత్ 12 ఓవర్లలోనే ఊదేసింది. యువ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి ఫర్వాలేదనిపించినా జట్టులో స్థానాన్ని కాపాడుకోవాలంటే ఇంకా మెరుగ్గా రాణించాల్సి ఉంది. గత మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన మయాంక్ యాదవ్ తన పేస్ పదును చూపిస్తే బంగ్లా బ్యాటర్లకు తిప్పలు తప్పవు. ఈ మ్యాచ్‌లో భారత్ తుది జట్టులో మార్పులేమీ చేయకపోవచ్చు.

సిరీస్ కాపాడుకునేందుకు..

తొలి టీ20లో బ్యాటింగ్ వైఫల్యంతో దారుణంగా ఓడిన బంగ్లాదేశ్.. ఢిల్లీలో మాత్రం పుంజుకోవాలని చూస్తోంది. లిటన్ దాస్, నజ్ముల్ హొసేన్ శాంతో, మహ్మదుల్లా, తౌహిద్ వంటి హిట్టర్లు ఉన్నా వాళ్లంతా నామమాత్రపు స్కోర్లకే పరిమితమయ్యారు. మిరాజ్ ఒక్కడే ఉన్నంతలో ఫర్వాలేదనిపించాడు. కానీ ఢిల్లీలో మాత్రం ఆ తప్పులను మళ్లీ చేయకుండా పక్కా ప్రణాళికతో భారత్‌కు షాకిచ్చి సిరీస్‌పై ఆశలు కాపాడుకోవాలని పర్యాటక జట్టు భావిస్తోంది. తొలి మ్యాచ్‌లో బంగ్లా బౌలింగ్ కూడా నాసిరకంగా ఉండటం ఆ జట్టుకు ఆందోళన కలిగించేదే.

ఉద్యోగుల డీఏలను వెంటనే చెల్లించండి

సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులకు డీఏలను దసరా కానుకగా చెల్లించేలా చొరవ చూపాలని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. గత సర్కార్ హయాంలో పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలతో పాటు బకాయిలన్నీ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నిబద్ధతతో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల సర్కారు సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు కె.రామకృష్ణ, జి.నిర్మల, రమేష్ పాక, స్వాజ్ ఫోరం ప్రతినిధులు వివేక్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విశ్వకర్మ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలు

పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీఎం విశ్వకర్మ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్‌రంజన్‌తో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎంఎస్ఎంఈ పాలసీపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం లక్ష్యం లబ్దిదారులకు చేరేలా నిబద్ధతతో పని చేయాలని అధికారులకు సూచించారు. మహిళా, ఎస్సీ, బీసీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తల రాయితీలు, ఇతర బ్యాంక్ అంశాలకు సంబంధించి అధికారులు తగిన సలహాలు సూచనలు అందించాలని ఆదేశించారు. ముద్ర రుణాలను లబ్దిదారులకు చేరువయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోవడంలో పరిశ్రమల విభాగం తన వంతు పాత్ర పోషించాలని పేర్కొన్నారు. అంతకు ముందు ఎంఎస్ఎంఈ పథకాలకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం


విశ్వం.. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల తొలి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు.
దోనేపూడి చక్రపాణి సమర్పించారు. ఈ సినిమా దసరా కానుకగా ఈనెల 11న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో గోపీచంద్ మాట్లాడుతూ, 'ఈ సినిమాకి టెక్నీషియన్స్ అందరూ చాలా కష్టపడ్డారు. చాలా రిస్కీ ప్లేసెస్‌లో షూట్ చేశాం. సినిమా ఇంత అద్భుతంగా వచ్చిందంటే వాళ్ళ హార్డ్ వర్కే కారణం. మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ సౌండింగ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, గుహన్ ఎక్స్‌ట్రార్డినరీ విజువల్ అవుట్‌పుట్స్ ఇచ్చారు. ప్రొడ్యూసర్స్ ఇద్దరికీ థ్యాంక్స్. విశ్వప్రసాద్ ఈ సినిమాకి రావడం చాలా ప్లస్ అయింది. డైరెక్టర్ శ్రీనువైట్ల సినిమాలో ఎంత ఎంటర్టైన్మెంట్ ఆశిస్తారో అంత ఎంటర్టైన్మెంట్ ఇందులో ఉంది. ఆయన మార్క్ ప్రతి ఆర్టిస్ట్‌లో కనిపిస్తుంది. థియేటర్లో కూర్చున్న ప్రతి ఒక్కరి నవ్వు ఆగదు. యాక్షన్, కామెడీ, ఫన్ ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. శ్రీనువైట్ల ఈజ్ బ్యాక్ విత్ బ్యాంగ్' అని అన్నారు.
ప్రొడ్యూసర్ టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ,' నేను యూఎస్‌లో ఉన్నప్పుడు శీను వైట్ల సినిమాలు నాకు స్ట్రెస్ బస్టర్స్. ఆయనతో కలిసి అసోసియేట్ అవ్వడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ సినిమాలో అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. గోపీచంద్‌తో ఇది మా సెకండ్ మూవీ. ఈనెల 11న అందరూ వచ్చి సినిమాని ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'ఇది నాకు చాలా స్పెషల్ మూవీ. ఇదొక పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్. ప్రేక్షకులకి నవరాత్రి ట్రీట్ లాంటి సినిమా' అని హీరోయిన్ కావ్య థాపర్ చెప్పారు.

> నేను 100% నమ్మకంతో ఉన్నాను ఈ సినిమా మీ అందరిని ఎంటర్టైన్ చేస్తుంది. రెండున్నర గంటల్లో ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టదు. ఎంగేజింగ్‌గా, హిలేరియస్‌గా ఉంటుంది.
> - దర్శకుడు శ్రీను వైట్ల

90 నిమిషాల గ్రాఫిక్స్ అద్భుతం



జీవా, అర్జున్ ప్రధాన పాత్రధారులుగా అనేక బ్లాక్‌బస్టర్ హిట్ సినిమాలను నిర్మించిన వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ అధినేతలు డా.ఇషారి కె.గణేష్ ఇప్పుడు అనీష్ దేవ్ నేతృత్వంలోని డబ్ల్యుఏఎమ్ ఇండియాస్‌తో కలిసి పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'అఘతియా' మూవీని నిర్మిస్తున్నారు.
రాశి ఖన్నాతో పాటు యూరోపియన్ నటి మటిల్డా, అమెరికన్ నటుడు ఎడ్వర్డ్ సోన్నెన్‌బ్లిక్ కీలక పాత్రలను పోషించారు. ఎంటర్‌టైన్మెంట్ ఎలిమెంట్స్‌తో ఉండే ఈ ఫాంటసీ థ్రిల్లర్ తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. తాజాగా మేకర్స్ ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు.
దర్శకుడు పా.విజయ్ మాట్లాడుతూ, 'అఘతియా హ్యూమన్ ఎమోషన్స్‌తో ఫాంటసీని బ్లెండ్ చేసిన డ్రీమ్ ప్రాజెక్ట్. ఇది మ్యాజిక్ గురించి మాత్రమే కాదు, పాత్రల మధ్య బాండింగ్ గురించి, తెలియని ప్రపంచం గుండా వారి జర్నీని ఆవిష్కరించే అద్భుత చిత్రీకరణ. దాదాపు 90 నిమిషాల పాటు అద్భుతమైన సీజీ విజువల్స్ అలరించబోతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కి యువన్ శంకర్ రాజా సంగీతం సమకూరుస్తున్నారు' అని అన్నారు.

నాగ సాధుగా తమన్నా


తమన్నా

తమన్నా ప్రధాన పాత్రధారిణిగా 'ఓదెల 2'లో మును పెన్నడూ చూడని పాత్రలో మెస్మరైజ్ చేయడానికి రెడీగా ఉన్నారు. తమన్నా తన కెరీర్‌లో తొలిసారి ఈ సినిమాలో శివశక్తి (నాగ సాధు) పాత్రలో నటిస్తోంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్‌గా వస్తున్న ఈ మూవీని అశోక్ తేజ డైరెక్టర్ చేస్తున్నారు. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తోంది.
ఈ సినిమాకి సంబంధించి చివరి షెడ్యూల్ ఓదెల విలేజ్‌లో జరుగుతోంది. కాశీలో ప్రారంభమైన ఈ థ్రిల్లింగ్ సీక్వెల్ ఇప్పుడు ఓదెల మల్లన్న క్షేత్రంలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఐకానిక్ ఓదెల మల్లన్న ఆలయం, గ్రామంలోని అందమైన ప్రదేశాలలో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. తమన్నా, మురళీ శర్మ, హెబ్బా పటేల్, యువతోపాటు ఇతర నటీనటులు చిత్రీకరణలో పాల్గొంటున్నారు. సంపత్ నంది సూపర్ విజన్‌లో ఎమోషనల్ డెప్త్, అడ్రినలిన్-పంపింగ్ యాక్షన్‌తో నిండిన ఈ సినిమా మంచి ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

యూనివర్సల్ ఎమోషన్ ఉన్న సినిమా


సందీప్ రెడ్డి

సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. ఈ సినిమా దసరా సందర్భంగా ఈనెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సందీప్ రెడ్డి బండ్ల మీడియాతో మాట్లాడుతూ, 'ఇప్పటి జనరేషన్‌లో పెళ్లైన కొత్త జంట ఓ పాపనో, బాబునో కనటానికి ఎందుకంత ఆలోచిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితులేంటి? అనే విషయాన్ని మధ్య తరగతి నేపథ్యంలో తీసుకుని సినిమాగా చిత్రీకరించాం. రీసెంట్‌గా ప్రీమియర్ షోస్ వేసినప్పుడు చూసిన అన్ని వయసుల వారి దగ్గర్నుంచి పాజిటీవ్ రిపోర్ట్ వచ్చింది. ఓ వ్యక్తి కండోమ్ కంపెనీపై కేసు వేస్తే ఎలా ఉంటుందనేదే ఈ సినిమా కథకి బేస్. పిల్లల గురించి డిస్కర్షన్ అనేది యూనివర్సల్ ఎమోషన్. ఈ పాయింట్ దిల్‌రాజుకి నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. బాలీవుడ్‌లో ఆయుష్మాన్ ఖురానా చేసిన 'విక్కీ డోనర్, బదాయి హో' తరహా లాంటి అవుట్ ఆఫ్ ది బాక్స్ సినిమా. తెలుగులో ఇలాంటి అవుట్ ఆఫ్ ది బాక్స్ సినిమాలు రాలేదు. సుహాస్ సినిమాలోని తన పాత్రకు నేను ఎక్స్‌పెక్ట్ చేసిన దానికంటే చాలా గొప్పగా న్యాయం చేశారు. విజయ్ బుల్గానిన్ తన సంగీతంతో సినిమాకు ప్రాణం పోశారు. కెకె లిరిక్స్, సినిమాటోగ్రాఫర్ సాయిశ్రీరామ్ ఇచ్చిన విజువల్స్, ఆర్ట్ డైరెక్టర్ రామ్ కుమార్, ఎడిటర్ పవన్, కాస్ట్యూమ్స్ డిజైనర్ భరత్ గాంధీ ఇలా అందరూ ఇచ్చిన సపోర్ట్‌తో మంచి సినిమాను తెరకెక్కించాను. పిల్లలు కావాలా..వద్దా అనుకునే పాయింట్ చుట్టూ తిరిగే కథ. ఈ మూవీ మగవాళ్లకు ఎంత నచ్చుతుందో, మహిళలకు కూడా అంతే బాగా నచ్చుతుంది' అని తెలిపారు.


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా జాతీయ చలన చిత్ర పురస్కారాలను అందుకుంటున్న మిథున్ చక్రవర్తి, రిషబ్‌శెట్టి, నిత్యామీనన్

ఘనంగా జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం

70వ జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. 2022 సంవత్సరానికిగానూ ఉత్తమ చిత్రాలు, ఉత్తమ నటీనటులు, సాంకేతిక నిపుణులుగా కేంద్రం ఎంపిక చేసిన విజేతలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పురస్కారాలను అందజేశారు.
జాతీయ ఉత్తమ నటుడిగా రిషబ్‌శెట్టి (కాంతార), జాతీయ నటిగా నిత్యామీనన్ (తిరుచిత్రంబలం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్) అవార్డులను అందుకోగా, ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా నిలిచిన 'కార్తికేయ 2' దర్శకుడు చందూ మొండేటి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ పురస్కారాలను రాష్ట్రపతి చేతుల మీదుగా తీసుకున్నారు. 'దాదాపు 15 ఏళ్ళ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఇది. చాలా ఆనందంగా ఉంది. నా సహ నటులు, 'తిరుచిత్రంబలం' బృందానికి ఈ అవార్డుని అంకితం ఇస్తున్నా' అని నిత్యామీనన్ అన్నారు. ఇదిలా ఉంటే, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని బాలీవుడ్ సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి అందుకున్నారు. ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా పొన్నియన్ సెల్వన్ 1 చిత్రానికి ఏఆర్ రెహ్మాన్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఇది ఆయన అందుకున్న 7వ జాతీయ అవార్డు కావడం విశేషం. అవార్డుల్లో అత్యధిక విభాగాల్లో అవార్డులను సొంతం చేసుకున్న 'పొన్నియల్ సెల్వన్ 1' చిత్రానికి దర్శకుడు మణిరత్నం సైతం ఈ ప్రతిష్టాత్మక అవార్డును పొందారు. లైంగిక వేధింపుల ఆరోపణలతో జైలు పాలైన జానీమాస్టర్‌కు ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డుని ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే.

జిగ్రా హిట్ ఖాయం : త్రివిక్రమ్


సమంత, అలియాభట్

అలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన 'జిగ్రా' చిత్రం ఈనెల 11న రిలీజ్ కాబోతోంది.
ఈ చిత్రాన్ని తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా రానా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు దర్శకుడు త్రివిక్రమ్, రానా దగ్గుబాటి, సమంత ముఖ్య అతిథులుగా విచ్చేశారు. త్రివిక్రమ్, సమంత చేతుల మీదుగా బిగ్ టికెట్ లాంచ్ చేశారు.
ఈ సందర్భంగా అలియా భట్ మాట్లాడుతూ, 'నేను మెసేజ్ చేసిన వెంటనే వచ్చిన త్రివిక్రమ్‌కి థ్యాంక్స్. ఆన్ స్క్రీన్, ఆఫ్ స్క్రీన్‌లో సమంత రియల్ హీరో. సమంతకు, నాకు సరిపోయే కథను త్రివిక్రమ్ రాస్తే బాగుంటుంద నిపిస్తోంది. 'ఆర్ఆర్ఆర్' తరువాత ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. యాక్షన్, డ్రామా, ఎమోషన్ ఇలా అన్నీ ఉన్న ఓ ఇంటెన్స్ సినిమా' అని అన్నారు.
'జిగ్రా ట్రైలర్ చూస్తే.. థియేటర్‌కు వచ్చి సినిమా చూడు అని పిలిచినట్టుగా అనిపించింది. కొన్ని సార్లు ట్రైలర్ చూస్తేనే సినిమా సూపర్ హిట్ అని చెప్పొచ్చు. ఫలితం గురించి ఆలోచించకుండా సినిమాను తీసే ధైర్యం వాసన్‌కి ఉంది' అని దర్శకుడు త్రివిక్రమ్ అన్నారు. సమంత మాట్లాడుతూ, 'హీరోయిన్లుగా మాపై కొంత బాధ్యత ఉంటుంది. అమ్మాయిలు వారి జీవితాలకు వాళ్లే హీరోలు అని చెప్పేందుకు అప్పుడప్పుడు ఇలాంటి కథలు చెప్పాల్సి వస్తుంది. వాసన్ బాలా అద్భుతంగా తీశారు' అని సమంత చెప్పారు. రానా మాట్లాడుతూ, 'బాహుబలి' కోసం ధర్మ ప్రొడక్షన్ ముందడుగు వేసింది. ఆలియా సేన జిగ్రాతో మరింత ఎక్కువ అవ్వాలని కోరుకుంటున్నాను. సమంతతో ఓ బేబీ చేశాం. వాసన్ బాలాకు ఆల్ ది బెస్ట్. ఈనెల 11న ఈ చిత్రం రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు. వాసన్ బాలా మాట్లాడుతూ.. 'జిగ్రా అంటే ధైర్యం.. యాక్టింగ్ అంటే అలియా. సినిమా తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుంది' అని చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886



ఎస్సీ వర్గీకరణ అమలుకు ఏకసభ్య న్యాయ కమిషన్

- 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన వర్గీకరణ
- ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చెయ్యాలని మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భేటీ అయింది. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇప్పటికే అధికారుల బృందం తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసిందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఉపకులాల వర్గీకరణ ఉంటుందని, అందుకు సంబంధించిన పూర్తి సమాచారం ఉద్యోగ నియామకాలతో సహా నివేదికను రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు గాను మంత్రివర్గ ఉప సంఘం జిల్లాల వారీగా పర్యటించనున్నట్టు వెల్లడించారు. కమిషన్ నియామకంలో అడ్వకేట్ జనరల్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఉపసంఘం తీర్మానించింది. ఏక సభ్య కమిషన్ చట్టపరంగా పటిష్ఠంగా ఉండడంతో పాటు కమిషన్ సిఫారసులను అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉంటుందని ఉపసంఘం ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

- త్వరితగతిన భూసేకరణ చేపట్టాలి
- సత్వరమే అనుమతులివ్వాలి :మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పెండింగ్ ప్రాజెక్టుల టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నీటిపారుదల శాఖాధికారులకు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు సీతారామ, డిండి, దేవాదుల తదితర ప్రాజెక్టులకు గాను త్వరితగతిన భూసేకరణ చేపట్టాలని సూచించారు. పెండింగ్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సంబంధిత శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యాదాస్ నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అడ్మిన్ అనిల్‌కుమార్, ఈఎన్సీ ఓ అండ్ యం నాగేందర్ రావు, మరో ఈఎన్సీ హరిరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బునాదిగాని కాలువ, ధర్మారెడ్డి కాలువ, పిల్లాయపల్లి కాల్వ తదితర ప్రాజెక్టులకు పాలనాపరమైన అనుమతులు సత్వరమే తీసుకోవాలని ఆదేశించారు. అందుకు సంబంధించి ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గల్ఫ్‌లో మరణించిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

- మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గల్ఫ్‌లో మరణించిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీపీసీసీ ఎన్నారై సెల్ నేతలు డాక్టర్ బీఎం.వినోద్ కుమార్, మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్‌రావుకు జీవో ప్రతులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎన్నారై అధికారి ఇ. చిట్టిబాబు ఉన్నారు. గల్ఫ్‌లో మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10.60 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా ఆ చెల్లింపులు జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. అంతకు ముందు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

రుణమాఫీపై దుష్ప్రచారమా?

- బీజేపీ, బీఆర్ఎస్‌లపై కోదండరెడ్డి ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు రుణమాఫీ చేసి తీరుతామని హామీ ఇచ్చి నెరవేర్చామని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి గుర్తు చేశారు. అయినా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రుణమాఫీపై తమ దుష్ప్రచారాన్ని ఆపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఫతే మైదాన్ క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షలలోపు రుణాలను మాఫీ చేసినట్టు తెలిపారు. దేశంలో ఎక్కడ కూడా రుణమాఫీ ఈ స్థాయిలో జరగలేదని చెప్పారు. ఉద్దేశపూర్వకంగానే ఆ రెండు పార్టీలు రుణమాఫీ కాలేదంటూ రైతులను రెచ్చగొట్టడం సరికాదన్నారు. మూసీ సుందరీకరణ, పెండింగ్ బిల్లులు ఇవ్వాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని అడుగుతుంటే, దాన్ని కూడా బీఆర్ఎస్ నేత కేటీఆర్ తప్పు పడుతున్నారని విమర్శించారు. చిన్నపాటి వర్షాలకే హైదరాబాద్ మునిగిపోతుందని, పదేండ్లుగా డ్రెయినేజీ వ్యవస్థ గురించి బీఆర్ఎస్ పట్టించుకోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పోయి తమ పార్టీ విషయాల గురించి పార్టీ పెద్దలతో మాట్లాడితే తప్పా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి హైదరాబాద్‌కు పైసా తెచ్చారా? అని ప్రశ్నించారు. ఇంకా అర్హులైన రైతులు రుణమాఫీ దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు. సాంకేతిక ఇబ్బందుల వల్ల కొంత మంది రైతులకు రుణం మాఫీ కాలేదని, అందుకు 32 రకాల సమస్యలను వ్యవసాయ శాఖ గుర్తించిందని తెలిపారు. అర్హులైన వారికి రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఎన్ఐసీ కంపెనీకి ధరణిని అప్పగించామని, అది పూర్తి కావొచ్చిందన్నారు.

పీజీఈసెట్ తుదివిడత కౌన్సెలింగ్‌లో 4,221 మందికి సీట్ల కేటాయింపు

- 14 నుంచి 17 వరకు కాలేజీల్లో చేరేందుకు అవకాశం


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తో పాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ(పీబీ) కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీఈసెట్ తుది విడత కౌన్సెలింగ్‌లో మంగళవారం సీట్లు కేటాయించారు. ఈ మేరకు పీజీఈసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. పీజీఈసెట్ కన్వీనర్ కోటాలో ఎంటెక్, ఎంఈ, ఎంఫార్మసీ, ఎంఫార్మ్, ఎంఆర్క్‌లో కలిపి మొత్తం 5,153 సీట్లున్నాయని వివరించారు. 7,014 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. ఎంటెక్‌లో 2,297 మంది, ఎంఆర్క్‌లో ఎనిమిది మంది, ఎంఫార్మసీ, ఫార్మాడీలో 1,916 మంది కలిపి మొత్తం 4,221 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 17 వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు చేరేందుకు అవకాశముందని తెలిపారు.

సంగమేశ్వర, బసవేశ్వర రద్దు!

నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లోని బీడు భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో సీపీఐ(ఎం), ఇతర ప్రజాసంఘాల ఆందోళనలతో గత ప్రభుత్వం బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టులను మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో ఆ రెండు లిఫ్ట్ పథకాలు రద్దయ్యాయి. 20 టీఎంసీల నీటిని తరలించి 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మంజూరు చేసిన రెండు లిఫ్ట్ పథకాలను పక్కన పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట, మెదక్ జిల్లాలకు మాత్రమే సాగునీటి వనరులున్నాయి. తలాపున మంజీరా నది, కండ్లెదుట సింగూరు జలాశయం ఉన్నా నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లో సాగునీటికి దిక్కులేదు. లిఫ్టు పథకాలను రద్దు చేస్తే.. ప్రత్యామ్నాయం ఏమిటని పలువురు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



20 టీఎంసీలు.. 3.84 లక్షల ఎకరాలు

నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లోని కరువు ప్రాంతాలకు సాగునీటి వనరుల్లేవు. ఆ ప్రాంతానికి సాగునీటి వనరుల్ని అభివృద్ధి చేసేందుకు ప్రాజెక్టులు కట్టాలని సీపీఐ(ఎం), ఇతర ప్రజా సంఘాలు అనేక పోరాటాలు చేశాయి. దీంతో గత ప్రభుత్వం రెండు ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టింది. సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయానికి నీటిని మళ్లించాలని ప్రణాళికలు తయారు చేసింది. 20 టీఎంసీల నీటితో 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రతిపాదించింది. జహీరాబాద్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో 2.19 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం కోసం 2021లో రూ.2653 కోట్ల పరిపాలనా ఆమోదం వచ్చింది. సింగూరు నుంచి నీటిని ఎత్తిపోతల ద్వారా 206 కిలోమీటర్ల అప్రోచ్ చానల్, కాలువలు, లైనింగ్ పనులు, పంప్‌హౌస్‌ల నిర్మాణం, పాత రిజర్వాయర్ల బలోపేతం చేసే పనులకు టెండర్లు పిలిచి రూ.2337 కోట్లతో గుత్తేదారులతో అప్పటి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. మూడు పంప్‌హౌస్‌లు నిర్మించే ఈ పథకానికి 140 మెగావాట్ల విద్యుత్ వినియోగం అవుతుందని అధికారులు చెప్పారు. భూసేకరణ చేశారు. చిన్న చెల్మెడ వద్ద పంప్‌హౌస్ నిర్మాణ పనుల్ని షురూ చేశారు.

అలాగే, నారాయణఖేడ్ నియోజక వర్గంలోని కంగ్టి, మనురు, సిర్గాపూర్, నాగిల్‌గిద్ద, నారాయణఖేడ్, కల్హేరు మండలాల్లో 1.65 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని బసవేశ్వర లిఫ్ట్‌ను మంజూరు చేశారు. 8 టీఎంసీల నీటిని వినియోగించడం కోసం 2021లో రూ.1774 కోట్లతో బసవేశ్వర లిఫ్ట్ పథకానికి టెండర్లు పిలిచారు. రూ.1428 కోట్లతో గుత్తేదారులతో ఒప్పందం చేశారు. ఈ పథకానికి కూడా 70 మెగావాట్ల విద్యుత్ వినియోగం అవసరం. ఈ రెండు లిఫ్టుల నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.2000 కోట్ల రుణం కూడా ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అప్పటికే బోరంచలో పంప్‌హౌస్ పనులు కొనసాగాయి. రూ.7 కోట్ల వరకు బిల్లుల చెల్లింపులు జరిగాయి.

ప్రభుత్వం మారగానే ఆగిన పనులు ?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు ఆగిపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం మంజూరు చేసిన సాగునీటి పథకాలైన బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్టు స్కీమ్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడమే ప్రధాన ఉదాహరణగా పలువురు చూపిస్తున్నారు. నారాయణఖేడ్, అందోల్ నియోజకవర్గాల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు, జహీరాబాద్ ఎంపీ కాంగ్రెస్ పార్టీ వాళ్లే అయినా, మంత్రి దామోదర ఉన్నా ఆ ప్రాంతానికి సాగునీరిచ్చే ప్రాజెక్టుల్ని పట్టించుకోకపోవడం గమనార్హం.

ప్రత్యామ్నాయ పథకాలపై దృష్టి లోపమా?

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి పెట్టట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్టులకు భారీ వ్యయం అవుతున్నందున ప్రత్యామ్నాయ వనరుల్ని పరిశీలించాలని ఇరిగేషన్ అధికారుల్ని కోరారు. కల్హేరు మండలానికి నల్లవాగు నీటిని రెండో పంటకు ఇచ్చేందుకు చేయాల్సిన పనులపై శ్రద్ధ చూపట్లేదు.

- ప్రత్యామ్నాయం ఏమిటీ..?
- గత ప్రభుత్వంలో రూ.4500 కోట్లు మంజూరు
- ప్రభుత్వ మార్పుతో ఆగిన పనులు
- ప్రత్యామ్నాయ ప్రాజెక్టులపై శ్రద్ధ చూపని ప్రభుత్వం
- లిఫ్టు పథకాల్ని పూర్తి చేయాలి : సీపీఐ(ఎం)

రెండు లిఫ్టులను పూర్తి చేయాలి

నాలుగు నియోజకవర్గాల్లో బీడు భూములకు సాగునీరిచ్చేందుకు గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ రూ.4500 కోట్లతో సంగమేశ్వర, బసవేశ్వర లిఫ్టు ప్రాజెక్టుల్ని మంజూరు చేశారు.. టెండర్లు ఖరారు చేసి పనుల్ని ప్రారంభించాం. ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టుల్ని పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంత ప్రజల ఓట్లు కావాలి కానీ.. వారికి సాగు, తాగునీరు ఇచ్చేందుకు మనసు రావట్లేదు. కాంగ్రెస్ ఎంపీ, మంత్రి, ఎమ్మెల్యేలు నిధులు రాబట్టి ప్రాజెక్టులు పూర్తి చేయాలి



మహారెడ్డి భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నారాయణఖేడ్

బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేయాలి



గతంలో నిధులు మంజూరై పనులు ప్రారంభించిన బసవేశ్వర, సంగమేశ్వర లిఫ్టు ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి. నారాయణఖేడ్ ప్రాంతం వెనుకబడటానికి సాగునీటి వనరుల్లేక పోవడమే కారణం. ఈ ప్రభుత్వం రెండు లిఫ్టులకు నిధులిచ్చి పనులు పూర్తి చేసి బీడు భూములకు సాగునీరివ్వాలి. నల్లవాగు నీళ్లను కల్హేర్ మండలానికి రెండో పంటకు ఇచ్చేందుకు అవసరమైన పనుల్ని పూర్తి చేయాలి. మైనర్ ఇరిగేషన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా కాల్వల్లో నీరు పారని కంగ్టి, మనురు, నాగిల్‌గిద్ద, నారాయణఖేడ్ మండలాల్లో సాగు నీరు ఇవ్వొచ్చు. రూ.5 వేల కోట్లు కేటాయిం చడం ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

అతిమేల మాణిక్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

'సూది ముట్టని' డాక్టర్‌పై విచారణ

- ఆదేశించిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్ నాయక్
- డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ఎంక్వయిరీ
- రెండు పీహెచ్‌సీల్లో సిబ్బందిని విచారించిన అధికారులు
- పత్రికలో వచ్చిన అన్ని అంశాలపై వివరణ తీసుకున్నట్టు సమాచారం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి / ఖమ్మం



నవతెలంగాణ ఎఫెక్ట్

'సూది ముట్టడు.. సిరంజి పట్టడు.. ఆ డాక్టర్ డ్యూటీయే సపరేటు' శీర్షికన 'నవతెలంగాణ' దినపత్రికలో ఈ నెల 7వ తేదీన ప్రచురితమైన కథనంపై తెలంగాణ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ స్పందించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండ పీహెచ్‌సీ డీడీవో/ మెడికల్ ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌పై గత నెల 12వ తేదీన బదిలీ అయిన డాక్టర్ కె.రమేష్ ఓపీ విధులను నిర్లక్ష్యం చేస్తుండటంపై వివరణ కోరారు. పత్రికలో డాక్టర్ రమేష్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు ఆదేశాలతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం విచారణ నిర్వహించారు. కొణిజర్ల పీహెచ్‌సీ నుంచి డాక్టర్ రమేష్ గత నెల డిప్యూటేషన్‌పై మంచుకొండ పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. నాటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా మంచుకొండ పీహెచ్‌సీలో ఓపీ చూసిన దాఖలాలు లేవు. పైగా కొణిజర్ల పీహెచ్‌సీలోనే అటెండెన్స్ రిజిస్టర్‌లో ఓడీగా పేర్కొంటున్నారు. రమేష్‌ను డిప్యూటేషన్‌పై మంచుకొండ పంపినప్పుడే ముదిగొండ మండలం వల్లభి పీహెచ్‌సీ నుంచి డిప్యూటేషన్‌పై శారదను కొణిజర్ల పీహెచ్‌సీకి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో మంచుకొండలో ఓపీతో పాటు డీడీవో బాధ్యతలు చూడాల్సిన డాక్టర్ రమేష్ ఇక్కడ విధులు నిర్వహించకుండా కొణిజర్ల వెళ్తున్నారని పత్రికలో కథనం వచ్చింది. దీంతో పాటు మరికొన్ని ఆరోపణలు కూడా రమేష్‌పై వచ్చాయి. కొణిజర్ల మండలం పెద్దగోపతి మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నప్పుడు అక్కడి పీహెచ్‌సీకి కేటాయించిన కొత్త ల్యాప్‌టాప్‌ను నిబంధనలకు విరుద్ధంగా అతనితో పాటే తీసుకొచ్చుకున్నారు. ఫలితంగా పాత ల్యాప్‌టాప్‌తోనే అక్కడ వెళ్లదీయాల్సి వస్తోంది. సిబ్బంది సముపార్జిత సెలవుల విషయంలోనూ ఆరోపణలు వచ్చాయి. మంచుకొండతో పాటు కొణిజర్ల, పెద్దగోపతి పీహెచ్‌సీల్లో డాక్టర్ రమేష్ విధి నిర్వహణలో వ్యవహరించిన తీరుపై సిబ్బందిని ఉన్నతాధికారులు ఆరా తీసినట్టు తెలుస్తోంది. ముందుగా మంచుకొండ పీహెచ్‌సీలో విచారణ నిర్వహించిన అధికారులు ఆ తర్వాత కొణిజర్ల పీహెచ్‌సీలోనూ విచారణ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ విచారణ నిర్వహిస్తుండగా డీఎంహెచ్‌వో సైతం అక్కడికి వెళ్లడం వల్ల సిబ్బందిని ప్రభావితం చేసినట్టు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. విచారణలో భాగంగా డాక్టర్ రమేష్ తాను విధుల్లో నిర్లక్ష్యం వహించలేదని, తనపై వచ్చిన ఇతర ఆరోపణలకు సంబంధించి కూడా రాతపూర్వకంగా వివరణ ఇచ్చినట్టు సమాచారం.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎన్జీవో కేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, మహిళా నేతలు ఉమాదేవి, శైలజ, అనురాధ, రంగారెడ్డి అధ్యక్షులు లక్ష్మణ్, హైదరాబాద్ నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, హరికృష్ణ, హైదరాబాద్ జిల్లా నాయకులు విక్రమ్, శ్రీనివాస్, రాజుకుమార్, మేడ్చల్ మల్కాజిగిరి నాయకులు భరత్ కుమార్, కేంద్ర సంఘం నేతలు నరసింహారెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అరుణ్ కుమార్, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి గంగాధర్‌తో పాటు మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆడుతూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ బతుకమ్మ అంటేనే తెలంగాణ సంస్కృతి అని అన్నారు. త్వరలోనే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల బాగు కోసం ఒకరోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగుల సంక్షేమం కోసం తప్పకుండా దీపావళి లోపు పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా రాష్ట్ర ప్రజలతో పాటు, ఉద్యోగుల కుటుంబాలు చల్లగా ఉండాలని చెప్పారు.

మెడికల్ బోర్డు నోటిఫికేషన్‌లో తిరకాసు

- విద్యార్హత పత్రాలు కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిబంధన
- 2020-2024 బీఫార్మసీ విద్యార్థులకు సాధ్యపడని రిజిస్ట్రేషన్
- ఫార్మాసిస్ట్ గ్రేడ్- 2 పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- ఆందోళనలో విద్యార్థులు
- ఉత్తీర్ణులందరికీ పరీక్ష రాసే అవకాశమివ్వాలని డిమాండ్

నవతెలంగాణ-మిర్యాలగూడ

వైద్య ఆరోగ్యశాఖలో 633 ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 పోస్టుల నియామకాల నోటిఫికేషన్‌ను గత నెల 24న మెడికల్ బోర్డు కార్యదర్శి గోపికాంత్ రెడ్డి జారీ చేశారు. ఈ నెల 5 నుంచి ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 పోస్టులకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నారు. ఈ నెల 21 వరకు గడువుంది. నవంబర్ 30న సీబీటీ పరీక్ష (కంప్యూటర్ బెస్ట్ టెస్ట్ పద్ధతిలో) ఇంగ్లీషులో ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే, అందులో పేర్కొన్న నిబంధనలే అభ్యర్థులకు అడ్డంకిగా మారాయి. దరఖాస్తు చేసుకునే సమయానికి తప్పనిసరిగా విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలనే నిబంధనను మెడికల్ బోర్డు నోటిఫికేషన్‌లో ప్రకటించింది. ఈ నిబంధన 2020-24 ఏడాది బీఫార్మసీ నిరుద్యోగులకు ఆటంకంగా మారింది. ఈ విద్యార్థులకు ఆగస్టులో ప్రొవిజినల్ బీఫార్మసీ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు వచ్చాయి. అందులో నూటికి 90 నుంచి 95 శాతం విద్యార్థులు ఓడీ(ఒరిజినల్ డిగ్రీ) కోసం ఆన్‌లైన్లో జేఎన్టీయూకు దరఖాస్తు చేసుకోవాలి. ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 నోటిఫికేషన్‌లో మెడికల్ బోర్డు నిబంధనలకనుగుణంగా బీఫార్మసీ 2020-24 విద్యార్థులు ఓడీ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. ఈ సర్టిఫికెట్ పోస్టు ద్వారా రావడానికి 15 రోజుల నుంచి 45 రోజులు పడుతుంది. సర్టిఫికెట్ వచ్చాక ఆన్‌లైన్‌లో తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో స్లాట్ బుక్ చేసుకుందామంటే చూపించడం లేదని.. ఇలాంటి సమయంలో ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 పోస్టుకు గడువులోగా దరఖాస్తు చేయడం సాధ్యపడదని బీఫార్మసీ నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 165 బీఫార్మసీ కళాశాలల్లో 2020-24 విద్యా సంవత్సరంలో సుమారు 8,250 మంది విద్యార్థులు ఫార్మసీ పూర్తి చేశారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఫార్మసిస్ట్ గ్రేడ్-2 పోస్టుల నియామకాలకు నోటిఫికేషన్ జారీ అయింది. అయితే, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ నిబంధనలతో ఉద్యోగం పొందే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుందని ఫార్మసీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడువులోగా దరఖాస్తు చేసుకునే విధంగా స్లాట్ తేదీలు బుక్ చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. త్వరితగతిన తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్లో విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు రిజిస్ట్రేషన్ చేయాలని లేదా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రొవిజినల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని నిరుద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. మెడికల్ బోర్డు అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి నిరుద్యోగులకు ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2 దరఖాస్తు చేసుకోవడంలో సడలింపులు ఇవ్వాలని ఎదురుచూస్తున్నారు. అన్ని యూనివర్సిటీలు త్వరితగతిన ఓడీ సర్టిఫికెట్ అత్యవసరంగా అందించేందుకు ఉన్నత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



పండుగ పూట పస్తులేనా..

- కాంగ్రెస్ పాలన గాడి తప్పింది : ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట

పోలీసులకు, ఆశ, అంగన్‌వాడీలు, మున్సిపల్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నెల నెలా జీతాలు ఇవ్వక పండుగ పూట కూడా వారిని పస్తులు ఉంచుతోందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆశాలు, అంగన్‌వాడీలు, పార్ట్ టైం లెక్చరర్లు పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఒకటో తేదీన జీతాలివ్వడం ఆచరణలో జరగడం లేదన్నారు. పోలీసులకు పది నెలలకు సంబంధించిన సరెండర్ లీవ్ డబ్బులు ఇవ్వలేదని, హోంగార్డ్ జీతాలు ఆలస్యంగా ఇస్తున్నారని ఆరోపించారు. మహిళలు ఘనంగా చేసుకోవాల్సిన బతుకమ్మ పండుగను ఆర్థిక ఇబ్బందులతో చేసుకోలేకపోతున్నారన్నారు. మూసీ సుందరీకరణకు లక్ష యాభై వేల కోట్లు ఖర్చు చేస్తానన్న సీఎం, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు ఇవ్వడం లేదని, వారి ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు మార్చి నెల నుంచి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

గత దసరా పండగ సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రచారం చేసిన యువత ఆలోచించాలని, ఇప్పుడు ఆ పార్టీ చేస్తున్న మోసాలను వివరించాలని కోరారు. నిరుద్యోగ భృతి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధుల జీతాలు ఇవ్వలేదని, కాంగ్రెస్ పాలనలో పంచాయతీ సెక్రటరీలు అప్పుల పాలయ్యారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, బియ్యం ధరలకు రెక్కలొచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆగమై లక్షల మంది వ్యాపారులు రోడ్డున పడ్డారని చెప్పారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ గ్యారంటీ అంటే గోల్డెన్ గ్యారంటీ అన్నారని, అది గోల్‌మాల్, గోబెల్స్ గ్యారంటీ అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజనర్సు తదితరులు ఉన్నారు.

అప్పుడే పుట్టిన బిడ్డకు సీపీఆర్

- పసికందు ప్రాణం కాపాడిన 108 సిబ్బంది

నవతెలంగాణ-కీసర

అప్పుడే పుట్టిన బిడ్డకు 108 సిబ్బంది సీపీఆర్ చేసి ప్రాణం కాపాడారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకెళ్తే.. కీసర మండల పరిధిలోని కుందన్‌పల్లి గ్రామానికి చెందిన రమ్య పురిటి నొప్పులతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు వైద్యులు నార్మల్ డెలివరీ చేయగా.. పాప పుట్టింది. అయితే, పసికందులో కదలికలు లేకపోవడంతో వైద్యులు 108కు సమచారం ఇచ్చారు. కీసర 108 సిబ్బంది ఈఎంటీ చిత్రం రవి, పైలట్ రాంబాబు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పాపను అంబులెన్స్‌లో ఎక్కించారు. అపస్మారక స్థితిలో ఉన్న పాపకు సీపీఆర్ చేయడం ప్రారంభించారు. పసికందు శ్వాస కూడా సరిగ్గా తీసుకోలేకపోతుండటంతో అంబుబాగ్‌ను ఉపయోగించి (కృత్రిమ శ్వాస యూనిట్) శ్వాసను అందిస్తూ తక్కువ సమయంలో నగరంలోని పెద్ద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి మెరుగ్గా ఉంది. బిడ్డకు ప్రాణం పోసిన అంబులెన్స్ సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం ఢిల్లీకి పోతే మీకేంటి అభ్యంతరం

- కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిలీకి 23 సార్లు కాదు.. 230 సార్లు పోతారు.. మీకేంటి అభ్యంతరమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు. సీఎం రేవంత్ ప్రజా పాలనను చూసి కేటీఆర్ ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ అసెంబ్లీలోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎం ఢిల్లీ పర్యటనపై విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. కేటీఆర్‌కు సిగ్గూ, శరం ఉందా? అని ప్రశ్నించారు. హోం మంత్రుల సమావేశానికి ఢిల్లీకి సీఎం వెళ్లారనీ, రాష్ట్రానికి వరద సాయం కోరారని తెలిపారు. ప్రజల సొమ్ము జీతంగా తీసుకుంటున్న ప్రతిపక్ష నేత ఫామ్‌హౌస్ నుంచి బయటకు వెళ్లడం లేదని విమర్శించారు. చెల్లెలు కవిత బెయిల్ కోసం ఢిల్లీకి ముడుపులు పంపిన కేటీఆర్ తమకు నీతులు చెబుతున్నారన్నారు. ప్రజాపాలనలపై సిద్దిపేటలో చర్చకు రావాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు సవాల్ విసిరారు.